ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
సిటీ◆

fb/prajasakti
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu
www.prajasakti.com
సంపుటి : 37 సంచిక : 231
విజయవాడ, సోమవారం 21 ఆగస్టు 2017
12 + 12 పేజీలు వెల : 4.00



చిరుతపులిని పోలి ఉన్న నీటికుక్క

కోరంగిలో అరుదైన వన్యప్రాణులు

నీటికుక్కలు, ఫిషింగ్ క్యాట్ ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆ ప్రాంతం అరుదైన జీవవైవిధ్యానికి ఆలవాలమైంది. అక్కడ అంతరించిపోయిన వన్యప్రాణుల ఆచూకీ మళ్లీ లభించింది. అదే తూర్పుగోదావరి జిల్లా కోరంగి అభయారణ్యం. అక్కడ నీటి కుక్కలు, ఫిషింగ్ క్యాట్ (చేపల పిల్లి) ఆచూకీ లభ్యమైంది. అటవీశాఖ వన్యప్రాణి విభాగం చేసిన పరిశోధన ఫలించింది. ఈ అడవిలో మాత్రమే జీవించే ఆ వన్యప్రాణుల జాడను ట్రాప్ కెమెరాలు పసిగట్టాయి.

కోరంగి అభయారణ్యంలో వేల రకాల అరుదైన పక్షి జాతులు, జంతువులు నివసిస్తున్నాయి. ఈ అరణ్యంలో మాత్రమే జీవించే నీటి కుక్కలు, ఫిషింగ్ క్యాట్ అంతరించిపోయాయని కేంద్ర వన్యప్రాణి విభాగం భావించింది. అయితే వీటి ఆచూకీ కోసం అటవీశాఖ వన్యప్రాణి విభాగం శాస్త్రీయమైన పరిశోధన చేపట్టడంతో ఎట్టకేలకు వీటి ఆచూకీ లభించింది. ఆసియాలోనే అతిపెద్ద మడ అడవిగా పేరొందిన కోరంగి మడ అడవులు పరిశోధనలకు కేంద్రంగా మారాయి. ఉభయచర జీవులుగా ఉన్న నీటికుక్కలు, ఫిషింగ్ క్యాట్‌లు నీటిలోనూ, నేలపైనా జీవిస్తాయి. కొన్ని దశాబ్దాలుగా ఈ అడవిలో వీటి సంతతి క్షీణించిందని అంతరించిపోయిన జాబితాలో వీటిని చేర్చారు. కోరంగి అడవుల్లో కాలుష్యం పెరిగిపోయి ఆహారం లభించని స్థితిలో ఈ జాతులు అంతరించి పోయాయని భావించారు ఈ నేపథ్యంలో అటవీశాఖ వన్యప్రాణి విభాగం శాస్త్రవేత్తలు రంగంలోకి దిగి పరిశోధనలు మొదలెట్టారు. ఇదే అభయారణ్యం చెంతనే వేలాది ఎకరాల్లో విస్తరించిన ఆక్వా చెరువులను ఆవాసంగా చేసుకుని అవి జీవిస్తున్నట్లు శాస్త్రవేత్తలు మిగతా 9లో

ఒక్కటీ రాలేదు...!

- ఫలితమివ్వని దావోస్ యాత్రలు
- ఇప్పటివరకు 61 సంస్థలతో భేటీలు
- వచ్చిన పెట్టుబడుల అంకెలు ఇంకా రహస్యమే
- మరోసారి దావోస్‌కు వెళ్లనున్న ముఖ్యమంత్రి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దావోస్ యాత్రలతో భారీగా పెట్టుబడులు వస్తాయన్న అంచనాలకు భిన్నమైన పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలో దావోస్‌కు వెళ్లనున్న నేపథ్యంలో గత ఏడాది చేసిన పర్యటన ఫలాలు చర్చనీయాంశంగా మారాయి. ఉన్నతస్థాయి అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం గత ఏడాది పర్యటన అనంతరం ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. దావోస్ కేంద్రంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక పెద్దపెద్ద సంస్థలతో నిర్వహించిన భేటీలు కూడా ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు ఇవ్వలేదు. అధికార యంత్రాంగం కూడ ముఖ్యమంత్రి ఎన్ని సంస్థలను కలిశారో, ఎవరెవరితో భేటీ అయ్యారో చెబుతున్నారే తప్ప, ఆ పర్యటనతో వచ్చిన పెట్టుబడుల వివరాలు మాత్రం వెల్లడించడం లేదు. అంతర్గతంగా రూపొందించిన నివేదికలో మాత్రం 'ఆశించిన ఫలితాలు కనిపించలేదు' అని పేర్కొనడం విశేషం! ఈ నేపథ్యంలో వచ్చే జనవరిలో మరో దావోస్ యాత్రకు చంద్రబాబు సిద్ధమవుతున్నారు.

గత ఏడాది దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో 61 సంస్థలతో చంద్రబాబు బృందం పెట్టుబడుల కోసం విస్తృతంగా చర్చలు నిర్వహించింది. భేటీలు జరిపిన 61 సంస్థల్లో 24 సంస్థలకు సంబంధించిపలు దఫాలుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. వాటిల్లో కొన్ని సంస్థల పెట్టుబడులు ఖరారయ్యే అవకాశాలు ఉంటాయని అధికారులు చెబుతున్నప్పటికీ, అవి ఎప్పటిలోగా సాధ్యమవుతాయన్నది మాత్రం ఇదమిద్ధంగా చెప్పలేకపోతున్నారు. అలాగే మరో 10 సంస్థలతో చర్చలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇక 27 సంస్థలతో జరిగిన చర్చలు పూర్తయినప్పటికీ, వాటిల్లో ఫలితాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. ఇలా దావోస్ భేటీ జరిగిన చాలాకాలమే అయినప్పటికీ వచ్చిన ఫలితాలు ఆశాజనకంగా లేవని, అందువల్లనే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత సంస్థలతో చర్చించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచిస్తున్నారు.

దావోస్‌లో భేటీ అయిన సంస్థల సంఖ్య	:	61
ఫలితం రాని సంస్థలు	:	27
చర్చలు జరుపుతున్నా స్పందించనవి	:	24
ఇంకా ప్రారంభదశలోనే	:	10

ఇవి రానట్టే!

చర్చలు పూర్తయినప్పటికీ స్పందన రాని 27 సంస్థల్లో లాయిడ్స్ బ్యాంక్, పేటిఎం, ఆదానీ గ్రూప్, వోల్వో బస్సులు, జపాన్‌కు చెందిన టీజిన్ లిమిటెడ్, జిఇ ఆయిల్ గ్యాస్, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఫ్యుజిత్సూ లిమిటెడ్ వంటి సంస్థలు ఉన్నాయి. చర్చల కొనసాగింపుకోసం ఈ సంస్థల ప్రతి నిధులతో అధికారయంత్రాంగం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రెండు,మూడు సార్లు ఆ సంస్థల ప్రతి నిధులతో చర్చించడానికి ప్రయత్నించినప్పటికీ వారు ఆసక్తి చూపలేదని తెలిసింది. దీంతో ఈ సంస్థల నుండి పెట్టు బడులు రాకపై ఆశలు వదులుకున్నారు. వీటితో మిగతా 9లో



శిఖర్, కోహ్లీ చితక్కొట్టేశారు

- తొలి వన్డే భారత్‌దే
- 9 వికెట్లతో శ్రీలంకపై జయభేరి

12

పోలీసు శాఖపై రాజకీయ ప్రాబల్యం

- వెల్లువెత్తుతున్న విమర్శలు
- ఏదాదిగా ఎఫ్ఎసిగానే డిజిపి
- కొందరు అధికారుల్లో అసంతృప్తి

2

ఉద్యమంతో వివక్షకు చెక్

3

నేటితో ప్రచారానికి తెర

- నంద్యాలలో పోటాపోటీ
- రెండురోజులు పర్యటించిన బాబు
- చివరి రోజు వరకూ జగన్
- రెండు పార్టీల రాష్ట్ర నాయకత్వాలు ఇక్కడే!



నంద్యాల ఎన్నికల ప్రచారంలో బలిజ సంఘీయుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల నియోజకవర్గంలో పోటాపోటీగా సాగిన ప్రచార పర్వానికి నేటితో తెరపడనుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సోమవారం సాయంత్రం నుండి మైకులు మూగబోనున్నాయి. సాయంత్రం ఆరు గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అదే సమయంలో ఎటువంటి సర్వేలను ప్రచురించకూడదని మీడియాపై ఆంక్షలు విధించింది.

ఈ ఉప ఎన్నికతో టిడిపి ప్రభుత్వానికి జరిగే నష్టం, వైసిపికి వచ్చే లాభం ఏమీ లేనప్పటికీ 2019 సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్‌గా రెండు పార్టీలు భావించడంతో ప్రచారం పతాకస్థాయిలో సాగింది. ఉప ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టిడిపి, వైసిపిల రాష్ట్ర నాయకత్వం నంద్యాలలోనే మకాం వేసింది. టిడిపి అధినేత, రాష్ట్ర మిగతా 9లో

సర్వేలు నిషేధం!

భన్వర్‌లాల్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా అన్ని రకాల సర్వేలను, అభిప్రాయ సేకరణలను నిషేదించామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ చెప్పారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన పోలింగ్‌కు ముందు ఎవరికి ఓటు మిగతా 9లో

4.13 లక్షల 'తెల్ల కార్డులు' కట్

- అనర్హత పేరిట తొలగింపు
- పల్స్ సర్వే నివేదికే ఆధారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించిన ప్రజా సాధికార సర్వే (పల్స్)లో భాగంగా 4.13 లక్షల తెల్లరేషన్ కార్డుల్ని తొలగించారు. రాష్ట్ర విభజన తర్వాత ఉన్న కొద్దిపాటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకునేందుకు ప్రజల సహకారం అవసరమని ప్రకటించిన ప్రభుత్వం, దానికనుగుణంగా పల్స్ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చింది. అర్హత ఉన్న వారు ప్రభుత్వ ప్రయోజనాలు పొందవచ్చని అధికారులు విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. దీంతో రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొని ఆధార్, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, గ్యాస్ కనెక్షన్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కిసాన్ కార్డు, పింఛన్ సర్టిఫికెట్, ఉపాధి హామీ జాబ్ కార్డు, డ్వాక్రా సభ్యత్వ కార్డు వంటి వివరాల్ని అందజేశారు. ఈ సర్వే ఆధారంగా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 4.13 లక్షల తెల్ల రేషన్ కార్డులను రద్దు చేశారు. ఇంటి విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయని, ద్విచక్ర వాహనం, కలర్ టెలివిజన్ ఉన్నాయని, పొలాలు అధికంగా ఉన్నాయని ఇలా ఏదో ఒక కారణాన్ని చూపిస్తూ వాటిని రద్దు చేశారు. రేషన్ కార్డుల్ని రద్దు చేస్తున్నట్లు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే ఈ-పోస్ పరికరాల్లో నమోదైన కార్డుల్ని రద్దు చేస్తున్నారు. ఈ విషయం తెలియక సబ్సిడీ సరుకుల కోసం రేషన్ షాపులకు వెళ్లిన పేదలకు కార్డు వివరాలు ఈ-పోస్ పరికరాల్లో లేవనే సమాధానం వస్తోంది. ఇదేమి అన్యాయమని డీలర్లను లబ్ధిదారులు ప్రశ్నిస్తే తమకేమీ తెలియదనే సమాధానమే వస్తోంది. వ్యయప్రయాసలకోర్చి తహసిల్దార్ కార్యాలయాలకు వెళ్లి, రద్దయిన తమ తెల్ల రేషన్ కార్డులను పునరుద్ధరించాలని లబ్ధిదారులు పలుమార్లు విజ్ఞప్తులు చేస్తున్నా అధికారుల నుంచి స్పందన రావడం లేదు. అయితే ఇందులో అధికార మిగతా 9లో

మృత్యు మార్గాలు

విశాఖ జిల్లా పరిధిలోనే 80 అతి ప్రమాదకర పాయింట్లు



- రాష్ట్రంలో జాతీయ రహదారుల తీరు
- ప్రమాదాల శాతం 36.5
- ఎన్‌హెచ్ఎఐ, రవాణా శాఖ సర్వేలో బహిర్గతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని రాష్ట్ర రహదారులకు మించి జాతీయ రహదారుల్లో ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్నాయి. జాతీయ రహదారుల్లోనే ప్రమాదాలు జరిగే అవకాశమున్న పాయింట్లు అత్యధికంగా ఉన్నాయి. కలకత్తా నుంచి చెన్నై వరకు ఉన్న జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)పై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ)తో కలిసి ఎపి రవాణా శాఖ తాజాగా చేసిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు బహిర్గతమ య్యాయి. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్ని కలుపుతూ 315 కిలోమీటర్ల మేర ఉన్న ఈ జాతీయ రహదారిపై సర్వే నిర్వహించారు. ఈ మూడు జిల్లాల్లోనే జాతీయ రహదారికి సంబంధించి 1985 సమస్యలున్నట్లు సర్వేలో గుర్తించారు. ఆమోద యోగ్యమైన, అనుమతించదగిన, తీవ్రమైన, అతి తీవ్రమైన సమస్యలుగా నాలుగు రకాలుగా ప్రాధాన్యతా క్రమంలో విభజించారు. ఒక్క విశాఖపట్నం జిల్లా పరిది.లోని జాతీయ రహదారిపై 80 ప్రాంతాల్ని అతి ప్రమాదకర పాయింట్లుగా గుర్తించారు. ఈ సమస్యల్ని పరిష్కరించే పనిలో రవాణా శాఖ అధికారులు నిమగ్నమ య్యారు. బ్రిడ్జీలు, మలుపులున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు లేకపోవడం, బ్రిడ్జీలు, కల్వర్టుల వద్ద ఫుట్‌పాత్ సౌకర్యం లేకపోవడం, హైవే నుంచి ఫ్యాక్టరీలకు, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు సరైన మార్గాలు లేకపోవడం వల్ల కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆ సర్వేలో బట్ట బయలయ్యింది. కొన్ని ప్రాంతాల్లో హైవే నిర్మాణ డిజైన్లలోనూ లోపాలున్నట్లు సర్వేలో తేలింది. ఈ సర్వేపై సమగ్ర నివేదికను న్యూ ఢిల్లీలోని ఎన్‌హెచ్ఎఐ కార్యాలయానికి ఎపి రవాణా శాఖ కమిషనర్ ఇప్పటికే పంపించి నట్లు సమాచారం. త్వరలోనే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల గుండా వెళ్లే జాతీయ రహదారిలోని ప్రమాద కర పాయింట్లపై త్వరలోనే సర్వే చేపట్టనున్నారు.

హైవే పక్కన దాబాలూ ప్రమాదాలకు కారణమే

జాతీయ రహదారుల పక్కన ఏర్పాటు చేసిన దాబాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నట్లు రవాణా శాఖ మిగతా 9లో



సందర్శకులు లేక ఖాళీగా ఉన్న భవానీపురంలోని అప్‌కాస్ట్ కార్యాలయం.

ఆదరణ లేని అప్‌కాస్ట్

- కొరవడిన సైన్సు అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల్లో మూఢ నమ్మకాలను పారదోలి , శాస్త్ర సాంకేతిక విజ్ఞానంపై అవగాహన కల్పించాల్సిన ఎపి కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్‌కాస్ట్) మరుగున పడుతోంది. గత రెండేళ్లుగా రాష్ట్రంలో అప్‌కాస్ట్ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. అప్‌కాస్ట్ పాఠశాలలను ఆహ్వానించి, విద్యార్థులకు సైన్స్ పరికరాలు, పలు ప్రాజెక్టులు తదితర శాస్త్ర విజ్ఞాన అంశాలను వివరించాలి. ఒక్కోసారి కౌన్సిల్ తరపున సిబ్బందే పాఠశాలలకు వెళ్ళి ఈ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇప్పుడా పరిస్థితి లేకపోగా, విద్యార్థులే మిగతా 9లో

ప్రజ్ఞ

1. శ్రీలంక నేవీ ఛీఫ్‌గా నియమితులైన తమిళ జాతీయుడు ఎవరు?
2. భారత్‌లో రష్యా రాయబారి ఎవరు?
3 ఎటిపి టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో మొదటిస్థానంలో కొనసాగుతున్న క్రీడాకారుడెవరు?
4. యుపిలో ముజఫర్‌నగర్‌లో పట్టాలు తప్పిన రైలు ఏది?
5. అమెరికా నుంచి ఏ యుద్ధ హెలికాప్టర్ల కొనుగోలుకు భారత్ ఆమోదం తెలిపింది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వాతావరణం

చురుగ్గా రుతుపవనాలు
కోస్తాలో పలుచోట్ల జల్లులు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ఉత్తరకోస్తాపై ఉన్న అల్పపీడనం ఆదివారం నాటికి ఆగ్నేయ విదర్భ మీదకు చేరుకున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. ప్రస్తుతం తీవ్ర అల్పపీడనంగా మారిందని తెలిపింది. దీనికి అనుబంధంగా 9.5 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు తెలిపింది. ఇది నైరుతి దిశకు మళ్లిన్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో చురుగ్గా కదులుతున్నట్లు వివరించింది. ఫలూది, ఉదయ్‌పూర్, ఇండోర్, విదర్భ, కళింగపట్నం, ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతానికి నైరుతి పవనాల ద్రోణి చేరుకున్నట్లు పేర్కొంది. దీంతో కోస్తాలో పలుచోట్ల ఓ మోస్తరు నుండి చెదురుమదురు జల్లులు పడతాయని తెలిపింది. బుధ, గురువారం కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. రాయలసీమలోనూ అక్కడక్కడా జల్లులు పడతాయని తెలిపింది. ఆదివారం ఉదయానికి కళింగపట్నంలో 7.1 సెం.మీ, తడ 5.9, సూళ్లూరుపేటలో 5.2, కొయ్యలగూడెంలో 4.7, పోలవరంలో 2.6, చింతలపూడిలో 2.5, వెంకటగిరిలో 2.4, శ్రీకాళహస్తిలో 4.6, సత్యవేడులో 4.4, తొట్టంబేడులో 4.3, ఉరవకొండలో 3.6, రాజుపాలెంలో 3.4, తాడిపత్రిలో 3.2, పమిడిలో 3.0 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

ప్రతి ఒక్కరికీ చంద్రన్న బీమా..!

కొత్త వారిని నమోదు చేసేందుకు ప్రత్యేక యాప్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

చంద్రన్న బీమా పథకంలో సభ్యులుగా లేని వారిని కొత్తగా నమోదు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. దీని కోసం ఒక కొత్త యాప్‌ను కూడా రూపొందించింది. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఈ పథకంలో చేర్చేందుకు త్వరలో సర్వేలు ప్రారంభం కాబోతున్నాయి. నిరుపేద కుటుంబాల్లో ఉన్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇప్పటికే చంద్రన్న బీమా పథకంలో చేరిన వారికి ప్రమాద, మరణ సమయాల్లో బీమా చెల్లింపులు జరుగుతున్నాయి. గ్రామాల్లో అర్హులై ఉండి పథకంలో నమోదు కాని వారు లక్షల్లోనే ఉన్నారు. వీరి కోసం మరో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల భారీ సంఖ్యలో అర్హులు నమోదయ్యే అవకాశాలున్నాయి. కొత్త యాప్ ద్వారా అర్హులను గుర్తించి ఆన్‌లైన్‌లో పొందుపర్చే బాధ్యతను వెలుగు శాఖకు ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు వెలుగు అధికారులకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో యాప్ ద్వారా గతేడాది చేపట్టిన సర్వే వివరాల ఆధారంగా ఎంతమంది అర్హులున్నారనే సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి నిబంధనలు వచ్చే అవకాశాలున్నట్లు వెలుగు అధికారులు చెబుతున్నారు.

పోలీసు శాఖపై రాజకీయ ప్రాబల్యం

- వెల్లువెత్తుతున్న విమర్శలు
- ఏడాదిగా ఎఫ్‌ఎసిగానే డిజిపి
- కొందరు అధికారుల్లో అసంతృప్తి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాధారణ ఎన్నికలకు మరో రెండేళ్ల గడువు మాత్రమే ఉండడంతో రాష్ట్రంలో పోలీస్ శాఖపై రాజకీయ ప్రాబల్యం పెరుగుతోందన్న విమర్శలొస్తున్నాయి. అధికార టిడిపి ప్రభుత్వం ప్రజల కంటే పోలీసులనే ఎక్కువగా నమ్ముకున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో తొమ్మిది జిల్లాలు సెక్షన్ 30 నీడలోనే ఉండడం, అవసరానికి మించి 144 సెక్షన్ విధించడమే దీనికి నిదర్శనం. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు నిర్వహించుకునే సాధారణ సభలు, సమావేశాలకు అనుమతులివ్వకుండా పోలీసులు నానా ఇబ్బందులు పెడుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. నిర్వాసితులు, నిరసనకారులు, ఆందోళనకారులపై ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు దాడులకు పాల్పడుతున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో నష్ట పరిహారాన్ని కోరుతూ సొంత పొలాల్లోకి వెళ్లిన రైతుల్ని పోలీసులు చితకబాదడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

పోలీస్ శాఖను పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే వినియోగించుకుంటున్న ట్లు ప్రతిపక్షాలు బహిరంగానే విమర్శిస్తున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. కర్నూలు జిల్లాలో ఏకపక్షం గా ప్రతిపక్ష నేతల ఇళ్లపై పోలీసులు దాడులు చేస్తున్నారని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులందాయి. నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో ఆ ప్రాంత డిఎస్పీపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేయడం చర్చనీయాంశమవుతోంది. పోలీసులపై రాజకీయ ప్రభావం పెరిగి పోవడం వల్లే వివిధ సమస్యల పరిష్కారానికి పోలీస్ స్టేషన్లకొచ్చే సాధారణ ప్రజలకు న్యాయం జరగడం లేదని బాధితులు వెల్లడిస్తున్నారు. విశాఖపట్నం, తిరుపతి అర్బన్, విజయవాడలతో పాటు పలు ప్రాంతాల్లో ఫిర్యాదులు అసలు పరిష్కారం కావడం లేదని కొన్ని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గంజాయి, బెట్టింగ్, జూదం, ఎర్ర చందనం, వ్యభిచారం, భూదందాలు వంటి అనేక సమస్యలున్నా రాజకీయ నేతలు తమ ప్రాధాన్యతా క్రమంలోనే పోలీసుల్ని వినియోగించుకుంటున్నారన్న విమర్శలొస్తున్నాయి.

ఏడాదిగా ఎఫ్‌ఎసిగానే డిజిపి

ప్రస్తుత డిజిపి ఎన్ సాంబశివరావు గతేడాది జులై 23న డిజిపిగా బాధ్యతలు స్వీకరించారు. 13 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ డిజిపిని ఫుల్ అడిషనల్ చార్జి(ఎఫ్‌ఎసి)గానే ప్రభుత్వం కొనసాగిస్తుండడం గమనార్హం. మరో నాలుగు నెలల్లో ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఈ అంశం కూడా పోలీస్ శాఖపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎఫ్‌ఎసి కావడంతో పూర్తి స్థాయి నిర్ణయాలు తీసుకోవడంలో సాంకేతికంగా కొన్ని ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నట్లు సమాచారం. దీంతో పూర్తిగా అధికార పార్టీ నేతల అడుగులకు మడులొత్తాల్సిన పరిస్థితులు దాపురించాయని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం కుయుక్తితోనే డిజిపికి ఇంత వరకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాము కూడా ప్రజలకు సేవ చేయడానికే ఉద్యోగంలోకొచ్చామని, చాలా సార్లు రాజకీయ నేతల ఒత్తిడితో పని చేయాల్సిన పరిస్థితులేర్పడడం బాధాకరమైన అంశమని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో ఇప్పుడు విపరీత ధోరణులు కొనసాగుతున్నాయని సదరు అధికారి వ్యాఖ్యానించారు.

ఎల్‌ఇడి బల్బుల మార్పిడికి మండల కేంద్రాల్లో కౌంటర్లు

ఐదేళ్ల వారంటీ కోసం ఇఎస్‌ఎస్‌ఎల్‌కు లేఖ
అధికారులకు మంత్రి కళా ఆదేశం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎల్‌ఇడి బల్బుల మార్పిడి కోసం మండల కేంద్రాల్లోనే కౌంటర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు అధికారుల్ని ఆదేశించారు. ఈ అంశంపై ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో నియోజవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నందున మండల కేంద్రాల్లోని విద్యుత్తు కార్యాలయాల్లో మార్పిడికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రంలో 2.16 కోట్ల ఎల్‌ఇడి బల్బుల్ని పంపిణీ చేశారన్నారు. పని చేయనివాటిని మార్చుకునేందుకు జిల్లాల్లో బల్బులు అందుబాటులో లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎల్‌ఇడి బల్బుల మార్పిడి బాధ్యతను డిస్కంలు తీసుకోవాలని సూచించారు. పాడైన ఎల్‌ఇడి బల్బుతోపాటు విద్యుత్తు బిల్లు లేదా ఆధార్ కార్డు నఖలు సమర్పిస్తే కొత్త బల్బు ఇవ్వాలని ఆదేశించారు. మూడేళ్ల వారంటీ ఇచ్చిన బల్బులకు గడువును ఐదేళ్ళకు పెంచేలా ఇఎస్‌ఎస్‌ఎల్‌కు లేఖ రాయాలని అధికారులకు సూచించారు. విద్యుత్తు శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకూ 5.26 లక్షల పని చేయని ఎల్‌ఇడి బల్బుల స్థానంలో కొత్త వాటిని అందజేశామన్నారు. ట్రాన్స్‌కో సిఎండి కె.విజయానంద్, జెఎండి దినేష్ పరుచూరి, ప్రభుత్వ సలహాదారు రంగనాథం, డిస్కంల సిఎండిలు నాయక్, దొర టెలీకార్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

గుంత ఒకటే పనులు మూడు

- నాయకుల జేబుల్లోకి రూ.లక్షలు
- నీరుగారిన లక్ష్యం

ప్రజాశక్తి-టంగుటూరు (ప్రకాశం)

ప్రభుత్వ పథకాలు నాయకులకు వరప్రదాయంగా మారాయి. ఒకే పనిని వేర్వేరు పథకాల పేరుతో చూపి బిల్లులు చేసుకుంటున్నారు. అధికారులు కూడా మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని కారుమంచిలో అక్కిరెడ్డికుంటలో జరిగిన కుంట పనులే ఇందుకు నిలువెత్తు సాక్ష్యం. గ్రామాల్లో ప్రతి వలసల కుటుంబానికీ వంద రోజుల పని కల్పించి రోజుకు రూ.150 గిట్టుబాటయ్యేలా ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించారు. గ్రామ నాయకులు అక్కిరెడ్డి కుంటలో క్యాటిల్‌పాండ్ పేరుతో ఐడినంబర్ 081164808005170110 ద్వారా రూ.16 లక్షల వ్యయంతో కూలీలకు ఉపాధి కల్పించామని లెక్కలు చూపి నిధులు కాజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల దగ్గర నీరు-చెట్టు, నీరు-ప్రగతి పనులు చేయకూడదు. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా అక్కిరెడ్డికుంటలోనే నీరు-చెట్టు పేరుతో మరో రూ.5 లక్షల పనులు చేశారు. జెసిబి సహాయంతో ఉపాధిలో చేసిన పనుల వద్దే నీరు-చెట్టు పనులు చేసి బిల్లులు పొందారు. ఈ ఏడాది అదే గుంతలో మళ్లీ నీరు-ప్రగతి పనులు చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. అదే గ్రామంలో ఎగ్జిస్టింగ్ ఫీడర్ ఛానల్ పేరుతో మూడు కిలో మీటర్ల మేర పనులు చేసినట్లు లెక్కలు చూపించి రూ.2.69 లక్షలు నిధులు కాజేశారు. తూతూమంత్రంగా కిలోమీటర్ ఫీడర్ ఛానల్ జెసిబి ద్వారా పనులు చేయించి కూలీల ద్వారా పనులు చేయించినట్లు చూపించి నిధులు మింగేశారు. నెల రోజులకే ఫీడర్ ఛానల్‌లో గట్ల వెంబడి చిల్ల చెట్లు మొలచాయి. వీటిని పరిశీలించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. సక్రమంగా నిధులు ఉపయోగించి పనులు చేస్తే చెరువుకు చిన్నపాటి వర్షానికే నీరు వస్తుందని, తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు తెలిపారు.



జెసిబితో తీయించిన కాలువ, (ఇన్‌సెట్లో) రెండు పథకాలతో పనులు చేసిన అక్కిరెడ్డికుంట వద్ద ఉన్న బోర్డులు

నంద్యాలలో అధికార పార్టీ ప్రలోభాలు

- విద్యాసంస్థల యాజమానులు, ఉద్యోగ సంఘాలతో మంత్రుల మంతనాలు
- టిడిపికి ఓటు వేయాల్సేందేనని బెదిరింపులు

ప్రజాశక్తి-నంద్యాల

నంద్యాల ఉప ఎన్నికలో అధికార టిడిపి అడ్డదారులు తొక్కుతోంది. ఈ ఎన్నికలో ఏలాగైనా గెలవాలని అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రలోభాలకు దిగుతోంది. ఇప్పటికే ఆయా సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సభల పేరుతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సమావేశాలు జరుపుతున్నారు. ఎన్నికల తేదీ దగ్గర పడటంతో మంత్రులు నంద్యాలలోని తమ శాఖల పరిధిలోకొచ్చే ప్రైవేట్ సంఘాలతో సమావేశాలు జరుపుతూ ఆయా సంఘాల యాజమానుల్ని బెదిరిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని, లేదంటే అభివృద్ధి జరగదని వివిధ సంఘాలతో విడివిడిగా సమావేశాలు జరుపుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. నంద్యాలలో నియోజకవర్గ పరిధిలోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమానులు, ఉద్యోగ సంఘాలు, వ్యాపార వేత్తలు, రైస్ మిల్లర్లతో విడివిడిగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఈ సంఘాలతో పాటు తమ సామాజిక వర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని ఆశచూపుతున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు, శుక్ర, శని వారాల్లో వివిధ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. తన శాఖ పరిధిలోకొచ్చే విద్యాసంస్థల యాజమానులతో గంటా శ్రీనివాసరావు సమావేశాన్ని ఏర్పాటు చేసి వారిని పరోక్షంగా బెదిరించారు. టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, తమ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్చరికలు జారీ చేశారు. ఏవైనా సమస్యలుంటే పరిష్కరిస్తానంటూ ముందుగానే వారికి ఆశలు చూపించారు. కర్నూలు ఎంపీ టిజి వెంకటేష్‌తో కలిసి వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రి గంటా చర్చలు జరిపారు. టిడిపికి మద్దతు ఇవ్వాలని ఈ సమావేశంలో పాల్గొన ఎపిఎన్జీవో అధ్యక్షులు అశోక్ బాబుతో పాటు పలువురు నాయకుల్ని ప్రలోభాలకు గురిచేశారు. ఇక ఆయన సామాజిక వర్గమైన కాపు నేతలతో కూడా ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఇక అటవీ శాఖమంత్రి శిద్దా రాఘవరావు కూడా వివిధ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఇలాంటి ప్రలోభాలకే దిగారు. నంద్యాల రైస్ మిలర్స్ అసోసియేషన్ సభ్యులతో,బొమ్మల సత్రం ఇండస్ట్రియల్ ఎస్టేట్ వ్యాపార వేత్తలతో శుక్ర, శని వారాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఉప ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానంద రెడ్డికే ఓటు వేయాలని పరోక్ష బెదిరింపులకు దిగారు.

సినీ నటుడు వేణుమాధవ్‌కు బెదిరింపులు

కర్నూలు పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా టిడిపి తరపున ప్రచారం చేస్తున్న హాస్య నటుడు వేణుమాధవ్‌కు బెదిరింపులు వచ్చాయి. దీనిపై ఆదివారం సాయంత్రం కర్నూలు నగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీసు స్టేషన్ సిఐ డేగల ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదుకు చెందిన సినీ హాస్యనటుడు వేణుమాధవ్ నంద్యాల ఉప ఎన్నికల కోసం టిడిపి తరపున ప్రచారం చేస్తున్నారు. కర్నూలుకు వచ్చి స్థానిక మౌర్యాఇన్ హోటల్‌లో ఉంటున్నారు. రోజూ నంద్యాలకు వెళ్లి వచ్చేవారు. శనివారం మధ్యాహ్నం నంద్యాల పట్టణంలో ప్రచారంలో ఉన్నప్పుడు కొందరు వైసిపి కార్యకర్తలు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడారు. రాత్రి 10.30 గంటలకు రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి 13 నిమిషాలు అసభ్యకరంగా మాట్లాడిన వీడియోను యూట్యూబ్‌లో పెట్టాడు. ఆదివారం మధ్యాహ్నం మరోవ్యక్తి ఇదే విధంగా దూషిస్తూ వీడియోను యూట్యూబ్‌లో పెట్టాడు. ఈవిధంగా వరుసగా ఫోన్‌లు చేసి అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా చంపుతామని బెదిరిస్తున్నారని బాధితుడు వేణుమాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రీతిభాయ్ హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేయాలి

- రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రీతిభాయ్ హత్య కేసులో నిందితుడు కట్టమంచి జనార్ధన్ రెడ్డిని అరెస్టు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాము, నూర్ మహమ్మద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు లోని కట్టమంచి రామలింగారెడ్డి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రీతిభాయ్‌ని పాఠశాల యాజమాని జనార్ధన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది భౌతికంగా, లైంగికంగా హింసించి ఉరి వేశారని వివరించారు. ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేసిన పాఠశాల యాజమాని కట్టమంచి జనార్ధన్‌రెడ్డిని, అ పాఠశాల సిబ్బందిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర నాయకునిగా చలామణి అవుతున్న జనార్ధన్‌రెడ్డి , తన పాఠశాలల్లో విద్యార్థినిని ఈ విధంగా హింసించి, చంపడం విద్యా వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. తిరిగి ఆయనే సోమవారం విద్యా సంస్థల బంద్‌కు పిలుపు ఇవ్వడం దొంగే... దొంగా దొంగా అని అరిచినట్లుందని పేర్కొన్నారు. ప్రీతిభాయ్ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదంటూ స్వయంగా విద్యార్థిని తల్లిదండ్రులు చెప్పారని వివరించారు. విద్యార్థినిపై పాఠశాల యాజమాన్యం చేసిన దురాగతాన్నీ, లైంగిక వేధింపుల్నీ తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసిందనే కక్షతోనే యాజమాన్యం హత్య చేసిందన్నారు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించడానికి జనార్ధన్ రెడ్డి ప్రయత్నించారని, ఇలాంటి నీచమైన వ్యక్తులు విద్యావ్యవస్థలో ఉండటం విద్యారంగానికే హానికరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను ప్రభుత్వం వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తనపై హత్యాయత్నం చేశారంటూ ఘటనా స్థలాన్ని పరిశీలించిన విద్యార్థి సంఘాల నాయకులపై కూడా జనార్ధన్ రెడ్డి తప్పుడు కేసులు పెట్టాడన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులపై పెట్టిన అక్రమ కేసుల్ని ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. హత్యకు గురైన ప్రీతిభాయ్ కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రెండు నెలల్లో రామ మందిర నిర్మాణం

ప్రవీణ్ తొగాడియా



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రెండు నెలల్లో రామ మందిర నిర్మాణం ప్రారంభమవుతుందని విహెచ్‌పి అంతర్జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా ప్రకటించారు. రామ జన్మభూమి మొత్తం హిందువులకే చెందాలని తాము కొట్లాడుతున్నామని చెప్పారు. భజరంగ్‌దళ్ జాతీయ కార్య వర్గ సమావేశాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రామ మందిరం నిర్మాణం కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం చేయాలన్నారు. ప్రభుత్వాల కారణంగా దేశంలో గో హత్యలు జరుగుతున్నాయన్నారు. కశ్మీర్‌లో ఆర్మీకి కేంద్రం పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం లేదన్నారు. అక్కడి ఆర్మీ మీద జాతి వ్యతిరేక శక్తులు దాడి చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్మీపై రాళ్ల వేస్తే బాంబులతో సమాధానం చెప్పాలన్నారు. ముస్లింలకు కల్పించినట్టుగా హిందువుకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అక్కడ 370 ఆర్టికల్ రద్దు చేయాలన్నారు. జిహాదీ ముక్త భారత్ నిర్మించడమే తమ లక్ష్యమన్నారు. సభలో విహెచ్‌పి అంతర్జాతీయ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సురేంద్రజైన్, మనోజ్‌వర్మ తదితరులు మాట్లాడారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న జగన్, భారీగా తరలివచ్చిన ప్రజలు

బాబును ఓడించండి

- వైసిపి అధినేత జగన్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల ఉపఎన్నికల్లో ఎవరినో ఎమ్మెల్యేను చేయటానికి ఓటు వేయమనడం లేదని, మూడున్నరరేళ్ల చంద్రబాబు పాలనకు వ్యతిరేకంగా ఓటు వేయాలని వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శిల్పామోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ ఆదివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ షో సంఘమిత్ర నుంచి సలీం నగర్, ప్రియాంక నగర్, మహారాణి థియేటర్ మీదుగా నందమూరి నగర్ నుంచి వైఎస్ నగర్ వరకూ సాగింది. రోడ్డుషో జనసంద్రంతో కిక్కిరిసింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చిన ప్రజలనుద్దేశించి పలు సెంటర్లలో జగన్ మాట్లాడారు. 2014లో బాబు గద్దెనెక్కడానికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, ఇది న్యాయమేనా అని ప్రశ్నించారు. నంద్యాలలో వైసిపి పోటీ చేయకపోయి ఉంటే బాబు కేబినెట్ నంద్యాలకు వచ్చేదా అని అన్నారు. ప్రతి పేదవాడికీ మూడు సెంట్ల స్థలం, ఇళ్లు కట్టిస్తామన్న బాబు ఒక్క ఇళ్లయినా కట్టించారా అని ప్రశ్నించారు. పేదవారికి కనీసం ఒక్క ఎకరా అయినా భూమి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. పాలనాకాలంలో నంద్యాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఎపి ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లు కావాలన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చాక హోదాను తీసుకు రాలేదన్నారు.

టిడిపిని బలపరచండి : చంద్రబాబు

ప్రజాశక్తి - నంద్యాల

పదేళ్ల ఎమ్మెల్యేగా, మూడేళ్లపాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఉండి నంద్యాల నియోజకవర్గాన్ని విస్మరించి సొంత ప్రయోజనాల కోసమే శిల్పామోహన్‌రెడ్డి రాజకీయాలు చేస్తున్నా రని, ఉపఎన్నికలో ఆయనను ఓడించి టిడిపిని బలపరచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రెండోరోజు నంద్యాలలోని పలు సదస్సులలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మొదట ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం, ముస్లిం మైనార్టీల సదస్సు, డ్వాక్రా మహిళలు, కాపులతో వేర్వేరుగా సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నంద్యాల అభివృద్ధి టిడిపి హయాంలో జరిగింది తప్ప కాంగ్రెస్ హయాంలో ఒక్క పనీ ముందుకు సాగలేదన్నారు. శిల్పా సహకార్ సొసైటీ చట్ట విరుద్ధంగా నడుస్తోందన్నారు.ఇది మైక్రో ఫైనాన్స్ కంటే దారుణంగా మహిళలను వేధిస్తోందన్నారు. చట్టవిరుద్ధంగా నడుస్తున్న శిల్పాసహకార్ సొసైటీలలో రుణాలు తీసుకున్న వారు తిరిగి కట్టొద్దని సూచించారు. ప్రభుత్వానికి చెందిన హౌసింగ్‌బోర్డు భూమిని శిల్పామోహన్‌రెడ్డి మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇందు కంపెనీకి అమ్ముకున్నాడని, ఈ కేసును సిబిఐ విచారణ చేస్తోందన్నారు. ఈ కేసులలో జగన్మోహన్‌రెడ్డి ఎ-1 నిందితుడిగా ఉన్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యేగా మహిళలకు రక్షణ ఇవ్వాల్సిన శిల్పామోహన్‌రెడ్డి మహిళలపై తన బంధువులు అత్యాచారాలు చేసి హత్య చేసినా అడిగేనాథుడే లేడని ఇక్కడ వీధుల్లో తిరుగుతుంటే తెలుస్తోందన్నారు. చాబోలులో ప్రభుత్వం పేరు చెప్పి దళితులకు సంబంధించిన భూమిని లాక్కున్నారని వీటన్నింటిపై విచారణ జరిపిస్తామన్నారు. భూమా నాగిరెడ్డి నంద్యాల అభివృద్ధి కోసం పరితపించే వాడని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ఇక్కడ టిడిపి అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు.

ఉప ఎన్నిక రద్దు చేయండి : రఘువీరా

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల ఉప ఎన్నికల్లో టిడిపి, వైసిపిలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని, తక్షణమే ఉప ఎన్నికను రద్దు చేయాలని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల ఆర్‌డిఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్‌కు ఎన్.రఘువీరారెడ్డి, కేంద్ర మాజీ మంత్రులు కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌తో కలిసి ఉప ఎన్నిక రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రధానంగా టిడిపి, వైసిపిలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. టిడిపి, వైసిపిలు డబ్బుతో ఓటర్లను కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. గతంలో ఎన్నికల్లో ఓటుకు రూ.5 వేలు ఇస్తామని సాక్షాత్తు సిఎం చంద్రబాబు నాయుడు చెప్పారని అన్నారు. చర్చిలు, దేవాలయాలు, మసీదులకు డబ్బులు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే రెండు పార్టీలు రూ.200 కోట్లకు పైగా ఖర్చు పెట్టాయన్నారు. రూ.కోట్లు ఖర్చుచేసిన టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఇప్పటి వరకూ రూ.3,82,450లు, వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి రూ.5,68,095లు ఎన్నికల ఖర్చుగా చూపించారని చెప్పారు. ఇది దగా, వంచన, ప్రజా ద్రోహమేనని అన్నారు. ఓటర్లకు అధికార టిడిపి ఓటుకు రూ.2 వేలు, వైసిపి రూ.వెయ్యి ఇస్తున్నాయని చెప్పారు. అధికారులు కేవలం రూ.18,76,000 మాత్రమే సీజ్ చేశారని తెలిపారు. డేగ కన్ను వేస్తానని చెప్పిన ఎన్నికల కమిషన్ నిద్రావస్థలో ఉందన్నారు. ఓటర్లకు నగదుతో పాటు గృహోపకరణాల వంటి వస్తువులు కూడా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అవినీతి, అక్రమాలకు నిలువుట్టద్దంగా మారిన నంద్యాల ఉప ఎన్నికను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను జరపాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రులు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, జెడి శీలం, రాష్ట్ర మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ పాల్గొన్నారు.



ఉద్యమంతో వివక్షకు చెక్

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఆలూరు శాసనసభ నియోజకవర్గాల్లో దళితుల పట్ల వివక్ష నేటికీ తీవ్రంగా కొనసాగుతోంది. సమాజంలో అన్ని సామాజిక తరగతుల మాదిరిగా జీవించేందుకు దళితులకు అవకాశం లేకుండా పోతోంది. ఆలయ ప్రవేశం చేసేందుకు వెళ్లిన దళితులపై ఆంక్షలు విధించారు. ఎస్సీ కాలనీకి వెళ్లకుండా ముళ్ల కంచె వేశారు. దళితుల పొలాల్లోకి వెళ్లడానికి ముందుగా పెత్తందారుల పొలాలు దాటి వెళ్లాలి. దారిలేకుండా చేసి భయభ్రాంతులకు గురి చేశారు. సంఘటన వివరాలు తెలుసుకుని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం చొరవతో పెత్తందారులతో, దళితులతో అధికారులు.. మాట్లాడి సయోధ్య కుదిర్చారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిరుమాన్‌దొడ్డి గ్రామంలో వివక్ష అనంతరం దళితులు వెళ్లిన దేవాలయం

ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం చిరుమాన్‌దొడ్డి గ్రామంలో ఈనెల 12న ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్టాపన సందర్భంగా ఆలయంలోకి దళితులు వెళ్తుండగా పెత్తందారులు అడ్డుకున్నారు. వారం రోజులపాటు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామంలో పెత్తందారులు దళితులను అనేక రూపాల్లో నిర్బంధాలకు పూనుకున్నారు. సంఘటన జరిగిన వెంటనే గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిలో ముళ్లకంప వేసి అడ్డుకున్నారు. అదే రోజు గ్రామంలో నీటి సరఫరా కూడా నిలిపివేశారు. దళిత మహిళలు బహిర్భూమికి వెళ్లాలంటే పెత్తందారుల పొలాల గుండా వెళ్ళాల్సి ఉంటుంది. అలా వెళ్లే సందర్భంలో మహిళలను ఇబ్బందులకు గురిచేశారు. దళితులు కూడా తమ పొలాలకు వెళ్లాలంటే పెత్తందారుల పొలాలు దాటి వెళ్లాలి. తమ పొలాల మీదుగా ఎలా వెళ్తారని దళితులను కొందరు పెత్తందారులు భయాందోళనకు గురిచేశారు. గ్రామంలో వారం రోజుల పాటు పోలీస్ పికెట్ నిర్వహించారు.



పశ్చిమ ప్రాంతంలో కొనసాగుతున్న వివక్షత

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం ఆలూరు, ఆదోని తదితర ప్రాంతాల్లో కులవివక్ష ఎక్కువగా ఉంది. చాలా గ్రామాల్లో ఇప్పటికీ హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోంది. ఆస్పరి మండలం జొహరాపురంలో 2013లో హనుమంతరాయలు గుడి ధ్వజ స్తంభ ప్రతిష్టాపన సందర్భంగా దళితులు ఆలయ ప్రవేశం చేసేందుకు వెళ్లగా గ్రామంలోని పెత్తందారులు అడ్డుకున్నారు. ఈ విషయంలో కెవిపిఎస్, దళిత సంఘాలు గ్రామానికి చేరుకొని దళితులకు అండగా నిలిచారు. దళిత సంఘం పోరాట ఫలితంగా అధికార యంత్రాంగం పోలీసుల సహకారంతో గ్రామంలో దళితులను ఆలయ ప్రవేశం చేయించారు. 2014లో ఆదోని మండలం బిళేకల్లు గ్రామంలో దళితుల ఆలయ ప్రవేశ కార్యక్రమం ఊరేగింపు సందర్భంగా తమ కాలనీలో వెళ్లరాదని ఆధిపత్యకుల పెత్తందారులు అడ్డుకున్నారు. ఈ సంఘటన జరిగిన తరువాత అధికార యంత్రాంగం గ్రామానికి వెళ్లి ఇరువర్గాలకూ కౌన్సెలింగ్ ఇచ్చి పరిస్థితిని అదుపులో తెచ్చారు.

అమలుకు నోచుకోని చట్టాలు

కుల వివక్షను నిర్మూలించేందుకు జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల్లో భాగంగా జారీ అయిన జిఒ.101, 105లను అమలు చేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పై జిఒల ప్రకారం అధికార యంత్రాంగం గ్రామాలకు వెళ్లి దళితుల చట్టాల పట్ల అవగాహన కల్పించాలి. కులవివక్షత నిర్మూలనకు పాటు పడాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో జరుగుతున్న కులవిక్షతను ముందుగా పసిగట్టి దళితులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలం చెందింది. ఏదయినా సంఘటన జరిగిన తరువాత ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి విచారించాలి. వివక్ష చూపిన వారిపైనా, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిపైనా చర్యలు తీసుకోవాలి. కేసు పరిస్థితిని బట్టి డిఎస్‌పి, ఎస్‌పి, కలెక్టర్ స్థాయి అధికారులు గ్రామాలను సందర్శించాలి. అలాంటి కార్యక్రమాలు వివక్ష అంతమయ్యే వరకు నిరంతరం అవగాహన కల్పించాలి. ఈ విషయాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల అనేక సంఘటనలు పునరావృతమవుతున్నాయి.

– ఎం. కృష్ణ, ఆలూరు రూరల్

ఆడపిల్లలు ఎంతో బాధపడ్డారు



ఊళ్లో దేవుని కార్యం జరుగుతుందని సంతోషంగా వచ్చిన ఆడ పిల్లలు ఆలయ ప్రవేశ నిషేధం సంఘటనతో ఎంతో బాధపడ్డారు. కుటుంబ సభ్యులంతా పండుగను సంతోషంగా జరుపుకునేందుకు అవకాశం లేకపోయింది. దేవుని గుడిలో కాకుండా ధ్వజ స్తంభాన్ని దర్శనం చేసుకుంటామన్నా ఒప్పుకోలేదు.

– శకుంతలమ్మ, చిరుమాన్‌దొడ్డి

ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడం తగదు



దళితులను ఆలయ ప్రవేశానికి నిషేధించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడం తగదు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా రాజ్యాంగం కల్పించిన హక్కులు దళితుల దరి చేరక పోవడం విచారకరం. అధికార యంత్రాంగం స్పందించి గ్రామంలో దళితులకు అండగా నిలిచి వారి హక్కులను కాపాడాల్సి అవసరం ఉంది. అధికారులు ఆ రీతిలో స్పందించక పోతే ఈ ప్రాంతంలో భవిష్యత్తులో ఉధృతంగా పోరాటాలకు దిగుతాం.

– ఆనంద్‌బాబు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

దేవాలయ ప్రవేశం చేస్తామన్నందుకు నిర్బంధం



దేవాలయం ప్రవేశం చేస్తామన్నందుకు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కాలనీకి వెళ్లే రహదారిలో ముళ్ల కంపలు వేశారు. పొలాలకు వెళ్లే రాస్తాలో కూడా అడ్డుకుంటామని భయాందోళనకు గురిచేశారు.

– రంగన్న, చిరుమాన్‌దొడ్డి

కెవిపిఎస్ ఉద్యమంతో సయోధ్య

సంఘటన తెలుసుకున్న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మల్యాద్రి, నాయకులు టి షడ్రక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, స్థానిక నాయకులు మహానందితో గ్రామానికి చేరుకొని దళితులకు అండగా నిలిచారు. చిరుమాన్‌దొడ్డి గ్రామంలో జరిగిన సంఘటనపై వెంటనే కెవిపిఎస్ స్పందించి దళితులకు అండగా నిలవడంతో ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిరి దళితుల ఆలయ ప్రవేశానికి పెత్తందారులు అంగీకరించారు. సిఐ అబ్దుల్ గౌస్, డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాసరావు, తదితర యంత్రాంగం గ్రామంలో దళితులను ఆలయ ప్రవేశం చేయించేందుకు ముందుకు వచ్చారు. ఆధిపత్యకుల పెత్తందారులు ఆలయ ధ్వజ స్తంభ కార్యక్రమం జరిగినందున 41 రోజులపాటు పూజారి తప్ప ఇతరులకు ప్రవేశం ఉండదని, అప్పటివరకు వేచి ఉండాలని పెత్తందారుల షరతుకు దళితులు ఒప్పుకున్నారు. 41 రోజుల తరువాత ఆలయ ప్రవేశం చేసేందుకు అధికార యంత్రాంగం దళితులు, అగ్రవర్ణాల కులపెద్దలంతో ఒప్పంద పత్రాలను రాయించారు.



దళితులను పెత్తందారులతో కరచాలనం చేయించి కలిసి ఉంటామని ఒప్పిస్తున్న పోలీసులు, కెవిపిఎస్ నాయకులు



భర్తీ కాని అంగన్‌వాడీ సూపర్ వైజర్ పోస్టులు

అధికారులపై విచారణతో నిలిచిన నియామకాలు

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణకు సూపర్ వైజర్ల కొరత తీవ్రంగా ఉంది. ప్రతి 25 కేంద్రాలకు ఒక సూపర్ వైజరు ఉండాలని ప్రభుత్వం గతంలోనే మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్రంలో 55 వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి 2200 మంది సూపర్ వైజర్లు ఉండాలి. ప్రస్తుతం 1690 మంది పనిచేస్తున్నారు. 510 వరకూ ఖాళీలు ఉన్నాయని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ కేంద్రాల నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించేందుకు సూపర్ వైజర్లు లేని చోట్ల కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు చొరవ తీసుకుని ఇన్‌ఛార్జిలను నియమించారు. కొన్ని జిల్లాల్లో మాత్రం ఇంకా నియమించలేదు. పలు జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాల్సిన సరుకులను దారి మళ్లించడం, టెండర్లలో అవకతవకలకు పాల్పడిన ఘటనలపై ఇప్పటికే ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో విచారణ జరుగుతోంది. పలు జిల్లాలో మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులను కూడా సస్పెండ్ చేశారు. గుంటూరు జిల్లా పీడీ నిర్మలనూ గతేడాది సస్పెండ్ చేశారు. మరికొంత మంది అధికారులపై విచారణ జరుగుతోంది. ఈ విచారణ పూర్తయ్యే వరకూ పోస్టుల భర్తీ చేయకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. గతంలో వివిధ జిల్లాల్లో వచ్చిన ఫిర్యాదుల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే వస్తువులను చాలా వరకూ కేంద్రీకృత పద్ధతికి మార్చామని మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి హెచ్.అరుణకుమార్ తెలిపారు.

తాజాగా పట్టణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకూ రేషనలైజేషన్ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల కుదింపులో భాగంగా రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మూడేళ్ల పిల్లల నుంచి ఐదేళ్లు నిండే పిల్లలకు చెందిన ప్రీప్రైమరీ స్కూల్సు, అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి ఒకే గొడుకు కిందకు తీసుకువస్తున్నామని అధికారులు తెలిపారు. వీటి ప్రకారం పట్టణాల్లో ఉన్న 4600 కేంద్రాలు క్రమంగా తగ్గి 1600 కేంద్రాలుగా మార్చారు. అయితే ఇదే పద్ధతిలో గ్రామాల్లోనూ కేంద్రాలను కుదించడానికి ప్రభుత్వం ప్రయత్నించగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తమ ప్రాంతంలో ఉన్న కేంద్రాన్ని మరో ప్రాంతానికి మార్చి వేయడాన్ని పలు గ్రామాల్లో ప్రజలు అంగీకరించడం లేదు. బడుగు, బలహీన వర్గాలు నివశించే ప్రాంతాల నుంచి అగ్రకులాలు నివశించే ప్రాంతాలకు తరలించే ప్రతిపాదనలపై ప్రజల నుంచి విముఖత రావడంతో ఈ ప్రతిపాదనను గ్రామాల్లో తాత్కాలికంగా విరమించుకున్నారు.

బెట్టింగు కేసులో ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలకు నోటీసులు

ప్రజాశక్తి – నెల్లూరు ప్రతినిధి

క్రికెట్ బెట్టింగు కేసులో నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి పోలీసులు ఆదివారం నోటీసులు జారీ చేశారు. సిఆర్‌పిసి సెక్షన్ 160 కింద ఈ నోటీసులు జారీ చేశారు. ఈనెల 22న ఉదయం 10 గంటలకు అదనపు ఎస్‌పి సమక్షంలో జరిగే విచారణకు వారు హాజరుకావాల్సి ఉంది. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలకు పోలీసులు అక్కడకు వెళ్లి నోటీసులిచ్చారు. ఇది రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. వారికి అత్యంత సన్నిహితులు కూడా ఈ కేసులో ఉన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో జిల్లాలో సుమారు 240 మందిని అరెస్ట్ చేశారు. సిఎం చంద్రబాబు క్రికెట్ బెట్టింగు కేసు విషయంలో చాలా సీరియస్‌గా పోలీసులను దర్యాప్తు చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలకు సైతం నోటీసులు అందాయి.

చిరంజీవి అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

ప్రముఖ సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులు ఆదివారం రక్తదానం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వద్ద అభిమాన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి యువత అధ్యక్షులు చింతల నాని బ్లడ్‌బ్యాంకు ఆర్గనైజర్ వలవల తాతాజీ మాట్లాడుతూ చిరంజీవి 62వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా పట్టణానికి చెందిన 40 మంది అభిమానులు రక్తదానం చేశారని చెప్పారు. వికలాంగుడైన అభిమాని రేపాక దుర్గాప్రసాద్ ఇప్పటివరకూ పదిసార్లు రక్తదానం చేయడం విశేషమన్నారు. అభిమానుల ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి వైద్యులు పి.రాజ్‌కుమార్, కొడాలి సత్యనారాయణ, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది, పలువురు మెగా అభిమానులు పాల్గొన్నారు.

జెవివి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి – తిరువూరు (కృష్ణా)

జనవిజ్ఞాన వేదిక(జెవివి) ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా తిరువూరులోని నాగార్జున మెరిట్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి నుంచి విశేష స్పందన లభించింది. కృష్ణా జిల్లా నుంచేగాక ఖమ్మం, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున షుగర్, బిపి రోగులు 1400 మంది తరలివచ్చారు. తెల్లవారుజాము ఐదు గంటల నుంచి రోగులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు శిబిరం వద్ద క్యూ కట్టారు. వీరికి జెవివికి చెందిన 70 మంది వలంటీలర్లు సేవలందించారు.

ఊసే లేని రామతీర్థసాగర్

- ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో చేర్చని వైనం
- పాలకుల ప్రకటనలు ఉత్తివేనా?
- సాగునీటి రంగంలో విజయనగరం జిల్లాపై వివక్ష



రామతీర్థసాగర్‌ప్రాజెక్టు

ప్రజాశక్తి– విజయనగరం ప్రతినిధి

సాగునీటి రంగంలో విజయనగరం జిల్లాపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి వివక్ష చూపిందని వార్త వినవస్తోంది. వెనుకబడిన ఈ జిల్లాను సాగునీటి సదుపాయాల కల్పన ద్వారా అభివృద్ధి చేస్తామంటూనే పాలకులు మరోసారి మోసం చేశారని జిల్లా ప్రజానీకం భావిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం చేసిన ప్రకటనే ఇందుకు నిలువెత్తు సాక్ష్యం. ఈ అధికారిక ప్రకటనతో జిల్లా ఇన్‌ఛార్జి, మంత్రి గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ ప్రకటనలు ఉత్తుత్తివేనని తేలిపోయాయి. ఇదే విషయంపై ప్రజాశక్తిలో ఈ నెల తొమ్మిదిన 'పేరుకే ప్రాధాన్యత–ఆచరణలో నిధుల కొరత' పేరిట ప్రధాన సంచికలో ప్రత్యేక కథనం వెలువడింది. జిల్లాలోని చంపావతి నదిపై తలపెట్టిన రామతీర్థసాగర్ ప్రాధాన్యతా ప్రాజెక్టు అని జిల్లా కలెక్టర్ ఈ నెల ఒకటిన ప్రకటించగా.. స్వాతంత్ర్య దినోత్సవం నాడు మంత్రి గంటా మరో అడుగు ముందుకేసి 2018లోపు ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామంటూ సందేశమిచ్చారు. అదే రోజున ప్రభుత్వం జారీ చేసిన అధికారిక ప్రకటనలో మాత్రం ఈ ప్రాజెక్టు ఊసే లేదు. రాష్ట్రవ్యాప్తంగా 28 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా జాబితాలో చేర్చినప్పటికీ విజయనగరం జిల్లాకు సంబంధించి ఒక్క ప్రాజెక్టూ లేకపోవడం గమనార్హం.

పూర్తికాని సాగునీటి ప్రాజెక్టులు

రామతీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తే సుమారు 24,710 ఎకరాలకు సాగునీరు అందుతుంది. 12 ఏళ్లు గడుస్తున్నా నిధులు పూర్తి స్థాయిలో కేటాయించకపోవడంతో లక్ష్యం నెరవేరలేదు. నేటికీ 50 శాతం పనులకే పరిమితమైంది. 40 ఏళ్ల నాటి జంఝావతి ప్రాజెక్టు పూర్తికీ కృషి జరగలేదు. ఒడిశాతో నెలకున్న అంతర్రాష్ట్ర వివాద పరిష్కారానికి చొరవ చూపకపోవడంతో 24,640 ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. ప్రభుత్వం 2000లో రూ.4 కోట్ల అంచనా వ్యయంతో గుర్లగెడ్డ ప్రాజెక్టు పనులు చేపట్టింది. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ వ్యయం పెరిగింది. 2007 నాటికి రూ.200 కోట్లు ఖర్చు చేసినా ఈ ప్రాజెక్టు పూర్తి కాలేదు. తోటపల్లి బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తి చేసినట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. నేటికీ పిల్ల కాలువలు, స్ట్రక్చర్లు, బ్రాంచి కాలువల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. భూసేకరణా పెండింగ్‌లో ఉంది. దీంతో ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష్యానికి అనుగుణంగా సాగు నీరందడం లేదు. బొబ్బిలి, గజపతినగరం బ్రాంచి కెనాల్ పనులు నేటికీ ప్రారంభం కాలేదు.

ప్రతిపాదనలకే పరిమితం

జిల్లాలో తలపెట్టిన అడారుగెడ్డ, గుమ్మడిగెడ్డ, పోతులగెడ్డ, ఏడొంపులగెడ్డ, కేదారిగెడ్డ, తాడికొండ తదితర గెడ్డలపై తలపెట్టిన మినీ రిజర్వాయర్లు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాలో ఒక్క ప్రాజెక్టునూ ప్రాధాన్యతా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ వివక్షకు, నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

హామీల అమలు కోసం రోడ్డెక్కాం : ముద్రగడ



కిర్లంపూడిలో ముద్రగడ ఇంటిగేటువద్ద బైఠాయించిన కాపు జెఎసి నాయకులు

ప్రజాశక్తి – కిర్లంపూడి, జగ్గంపేట(తూర్పుగోదావరి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల్లో కాపులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్లే ఈ రోజు కాపులంతా రోడ్డెక్కాల్సి వచ్చిందని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన ఇంటి నుంచి అనుచరులతో కలిసి ఆదివారం పాదయాత్రకు బయల్దేరగా ప్రధానగేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లాకు చెందిన కాపు జెఎసి నాయకులు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, జగ్గంపేట మండలాలకు చెందిన అధిక సంఖ్యలో చేరుకుని కాపునాయకులు గేటువద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలు, యువకులు, మహిళలు, రైతులను చంద్రబాబు నిలువునా మోసగించారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తయినా హామీలను నెరవేర్చలేదన్నారు. రానున్న కాలంలో ప్రజలు చూస్తూ ఊరుకోరని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అడుగడుగునా ప్రశ్నిస్తారని పేర్కొన్నారు.

చంద్రబాబు బుద్ధిమార్చాలని మహిళల పూజలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుద్ధిమార్చుకుని కాపులకు ఇస్తామన్న రిజర్వేషన్లు తక్షణం అమలుచేయాలని అధిక సంఖ్యలో మహిళలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి ఆదివారం మహిళలు చేరుకుని పాదయాత్రకు మద్దతు పలికారు. 2014 ఎన్నికల్లో హామీలతో మహిళలను మోసం చేశారని, రానున్న ఎన్నికల్లో మహిళలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారన్నారు.

త్వరలో కొత్త రేషన్‌కార్డులు

మంత్రి పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి – కరప (తూర్పుగోదావరి)

రాష్ట్రంలోని అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖమంత్రి పత్తిపాటి పుల్లారావు చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా కరప మండలం వేళంగిలో సివిల్‌సప్లయ్ గోదాములను ఆయన ఆదివారం పరిశీలించారు. పంచదార, కందిపప్పు, బియ్యం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరులోని రేషన్ షాపులో నాణ్యతా లోపాలు బయటపడ్డాయన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ సరఫరా అయ్యే గోదాములను తనిఖీ చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 1.42 కోట్ల మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారన్నారు. 29 వేల రేషన్ డిపోలు పనిచేస్తున్నాయని వివరించారు. నాణ్యమైన బియ్యం, కందిపప్పు, పంచదార సరఫరాచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. సరుకుల పంపిణీలో ఎటువంటి తూకాలు తక్కువ వచ్చినా, తక్కువ ఇచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి సరుకులను ప్రజలు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి లోడు చేసి రేషన్ సరుకు డిపోకు చేరే వరకు జిపిఎస్‌ను అనుసంధానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సినిమా చూపివ్వలేదని కాలవలో దూకిన మహిళ

ప్రజాశక్తి – విజయవాడ సిటీ ప్రతినిధి

సినిమాకు తీసుకెళ్లలేదనే చిన్న కారణంతో రైవస్ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకోబోయిన భార్యను, ఆమెను కాపాడే ప్రయత్నంలో కాలువలోకి దూకిన ఆమె భర్తను కాపాడిన ఎపిఎస్‌పి కానిస్టేబుల్ శ్రీనివాసరావును నగర జాయింట్ పోలీస్ కమిషనర్ వివి రమణకుమార్ అభినందించడంతోపాటు రివార్డును అందజేశారు. వివరాల్లోకి వెళితే వాంబే కాలనీకి చెందిన రాజారెడ్డి, తిరుపతమ్మలు నాలుగు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సినిమాకు తీసుకెళ్లలేదనే కారణంతో భర్తపై కోపగించుకుని క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకునేందుకు అలంకార్ సెంటర్‌లోని ఏలూరు కెనాల్‌లో దూకింది. అదే సమయంలో భర్త రాజారెడ్డి ఆమె పక్కనే ఉండటంతో భార్యను కాపాడేందుకు తానూ కాలువలోకి దూకాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎపిఎస్‌పి కానిస్టేబుల్ శ్రీనివాసరావు నీటిలో దూకి ఇద్దరిని సురక్షితంగా కాపాడాడు.

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం అడహక్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి–గుంటూరు

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం 13 జిల్లాల ప్రతినిధులు గుంటూరులోని ఎన్‌జిఒ కళ్యాణమండపంలో శ్రీనివాసరావు ఛైర్మన్‌గా, మరో ఏడుగురు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. తొలుత శ్రీనివాసరావు, జంపా సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అక్టోబర్‌లో రాష్ట్ర సంఘం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈలోగా జిల్లా స్థాయిలో ఎన్నికలు పూర్తి చేయాలని తీర్మానించారు. తొలుత సమావేశంలో ఏడేళ్ల నుంచి సంఘానికి ఎన్నికలు జరగకపోవటంతో సంఘం నిర్వీర్యం అవుతుందని, ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న శాఖాపరమైన నిర్ణయాలను ప్రతిఘటించలేకపోతున్నామని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు అశోక్‌బాబు సూచనలతో తిరిగి ఎన్నికలకు సమాయాత్తం కావాల్సి ఉందని పేర్కొన్నారు. అడహక్ కమిటీ నేతృత్వంలోనే జిల్లాలు, రాష్ట్ర సంఘం ఎన్నికలు జరుగుతాయని నిర్ణయం తీసుకున్నారు.



రోహిత్‌నాయుడు



రామరాజు

మడ్డువలస కాలువలో పడి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి– రాజాం (శ్రీకాకుళం జిల్లా)

కాళ్లకు అంటిన బురదను కడుక్కునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో జారడంతో మడ్డువలస కాలువలో పడి ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... రాజాం పట్టణానికి చెందిన సంతకవిటి పోలీస్‌స్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దుప్పాడ రాజశేఖర్ కుమారులు దుప్పాడ అభిలాష్‌నాయుడు, రోహిత్‌నాయుడు (18), రాజశేఖర్ అక్క దాసరి చిట్టెమ్మ కుమారుడు రామరాజు (18) రాజాం పట్టణంలోని డోలపేటలో ఒక శుభకార్యానికి ఆదివారం వచ్చారు. అక్కడ్నుంచి ఒకే ద్విచక్ర వాహనంపై ఈ ముగ్గురూ తమ స్వగ్రామమైన రేగిడి మండలం పెడకోడిశకు బయలుదేరారు. త్వరగా చేరుకోవచ్చని ఉణుకూరు నుంచి అడ్డదారిలో మడ్డువలస కాలువ గట్టు మీదుగా వెళ్తుండగా, వారి కాళ్లకు బురద అంటింది. కాళ్లు కడుక్కునేందుకు కాలువలోకి దిగిన రోహిత్‌నాయుడు, రామరాజు కాలు జారడంతో కాలువలో పడిపోయారు. ఈత రాకపోవడంతో ఇద్దరూ నీటమునిగిపోయారు. ఒడ్డున ఉన్న అభిలాష్‌నాయుడు కేకలు వేయడంతో స్థానికులు కాలువలో గాలింపు చేపట్టి, వీరి మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. ఎస్ఐ భాస్కరరావు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

సంపాదకీయం


జానపదం

'టప..టప..టప.. టప టప టప/చెమటబొట్లు తాళాలై పడుతుంటే/కరిగి కండరాలే.. నరాలే స్వరాలు కడుతుంటే/పాట.. పనితోపాటే పుట్టింది/పనీపాటతోనే జతకట్టింది..' అని సుద్దాల అశోక్‌తేజ అక్షరీకరించినట్టుగా.. శ్రమ నుంచి సేద తీరడానికి మానవులు సృష్టించుకున్నదే కళ. శ్రమ నుండి విడివడి రాజుల అంతఃపురాల్లో చేరిన కళ పరాన్నభుక్కుల రక్తి, ముక్తి అవసరాలు తీర్చడానికి ఉపయోగపడినా శ్రమజీవుల కళలు ప్రజా జీవితంతో మమేకమై జానపద కళలుగా కొనసాగాయి. ప్రకృతిలో విహరిస్తూ పాటలు అల్లిన కష్టజీవులు, చెట్టు నుంచి పుట్ట వరకు అన్నింటినీ తమ జానపదంతో శిల్పంగా తీర్చిదిద్దారు. పండగొస్తే పాట, కరువొస్తే పాట, వానొస్తే పాట, రాకపోతే పాట, బంధువొస్తే పాట, అమ్మ పాడే పాట ఇలా... కుటుంబ అనుబంధాలపైన, జీవన స్థితిగతులపైన, సమాజంపైనా పాటలు కట్టి శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆవిష్కరించినవి జానపద కళలు. ఇవి జనజీవన సంస్కృతికి ప్రతిబింబాలు. జీవన సమరంలో సుఖదు:ఖాలను బాణీలుగా చేసుకొన్న జావళీలు. విజ్ఞాన, వినోదాలను పంచే వాఙ్మయాలు. పల్లె జనాలు పాడుకునే పాటలు, ఆటలు, నృత్యాలు, సామెతలు వెరసి జానపదాలు. ప్రకృతి ఒడిలో పెరిగిన జానపదులు తమ అనుభూతులను పాటల్లో, ఆటల్లో, రకరకాల కళల్లో వ్యక్తం చేసుకున్నారు. ఒకప్పుడు జానపద సాహిత్యమంటే కేవలం పల్లె పదాలు మాత్రమే. కానీ.. మానవ జీవిత మంత విస్తృతమైన పరిధి జానపద విజ్ఞానానికి వుంది. 'మానవుని సృజనాత్మక ప్రతిభ సుందర రూపంలో వ్యక్తమయ్యేది కళల్లోనే' అంటాడు సంజీవ్‌దేవ్. జానపదుల విజ్ఞానాన్ని, సంస్కృతిని, జీవితంలోని అన్ని విషయాలనూ తనలో ఇముడ్చుకోగలిగినంత విశాలమైనది జానపదం.

జానపద కళారూపాలంటే నేడు చాలామందికి అర్థం కావు. జనపదం అంటే పల్లెటూరనీ, జనపదంలో నివసించేవారు జానపదులనీ, వారు పాడుకునే పాటలు, ఆడుకునే ఆటలు, చేసే నృత్యాలే జానపద కళారూపాలనీ పెద్దలు నిర్వచించారు. జానపద సాహిత్యం, జానపద గేయాలు, జానపద నృత్యాలు, జానపద సంగీతం, వీధి నాటకాలు, తోలుబొమ్మలాటలు, బుర్రకథలు, యక్షగానాలు జముకుల కథలు, పిచ్చుకుంటుల కథలు, పగటివేషాలు వంటి వందలాది జానపద కళారూపాలు నాటి పల్లె జీవనానికి అద్దం పట్టాయి. విజ్ఞానాన్ని, వినోదాన్నీ అందించాయి. జానపదమంటే పామరుల కళారూపాలనీ, సంగీతానికి, నృత్యానికి ఎలాంటి శాస్త్రీయత వుండదని ఓ దురాభిప్రాయం వుంది. కానీ.. జానపద కళారూపాలలోనూ సంగీతముంది. తాళం వుంది, లయ వుంది, నృత్యం వుంది. అభినయం వుంది. ఆహార్యం వుంది. వాయిద్యముంది. ఓ లయబద్ధమైన క్రమశిక్షణా వుంది. పంట విత్తనాలు వేసేటప్పుడు, పంట చేతికొచ్చినప్పుడు, పండుగల పాటలు, వారి పశువులకి సంబంధించిన పాటలు, వాన పాటలు, పడవ పాటలు, గొబ్బిళ్ళ పాటలు.. ఇదీ అదీ అని కాకుండా వివిధ అంశాల గురించి తమ సంతోషాన్ని, బాధని వారికొచ్చిన భాషలో పాడుకునేవారు. ప్రకృతితో, ప్రకృతిలోని పూలతో, పూల పరిమళాలతో సౌరభాలు వెదజల్లిన పాటలు వందల సంఖ్యలో వచ్చాయి. ఆ పాటలకీ, సంగీతానికీ అవినాభావ సంబంధం ఉంది. సంగీతంలోని రాగం, తాళం, పల్లవి, జతి, లయ వంటి అంశాలు ఈ పాటలతో అనుసంధానమై ఉన్నాయి. నిజానికి సాహిత్యం, నృత్యం వంటి ప్రక్రియలతో కలగలిసి వుండటం భారతీయ సంగీతం ప్రత్యేకత. జీవితంలోని ప్రతి సందర్భాన్ని పాటలతో, సంగీతంతో దీప్తిమంతం చేయడం జనజీవన సంస్కృతిలో అంతర్భాగం. అందుకే అంటాడు కొడవటిగంటి... 'జీవితాన్ని కాసేపు మరిపింపజేయడానికే కళలు' అని.

అదే సందర్భంలో జానపద వాఙ్మయాన ప్రశస్తమైన స్థానం సముపార్జించుకున్నది జానపద గేయం. అసలు జానపద వాఙ్మయమంటేనే గేయం స్ఫురణకొస్తుంది. సాహిత్యంలోని మిగతా ప్రక్రియలకంటే జానపద గేయానికి ఉచ్ఛ స్థానం ఉండటానికి గల కారణం దానికున్న గాన యోగ్యతే. 'సంగీతమపి సాహిత్యం సరస్వత్తాంతనద్వయం ఏకమాపాత మధురం అన్యదాలొచనామృతం' అన్న ఆర్యోక్తి జానపద గేయానికి అన్నివిధాలా సరిపోతుంది. 'సాహిత్యం భావాశ్రితమైతే గేయం గానానుకూల్యమైనది' అంటారు. అనగా గేయమున సాహిత్యపరమైన పదబంధంతో పాటు సంగీతపరంగా గానానుసంధానం కూడా కలదు. ఇతర జానపద వాఙ్మయాలన్నింటిలోనూ గేయ ప్రక్రియ జానపదుల జీవికతో ఎక్కువగా ముడిపడి ఉంది. తరతరాలుగా ప్రజలను ఉర్రూతలూగించిన జానపద కళరూపాలు... ప్రజాజీవనంలో పెనవేసుకుపోయి, వారి వినోద విజ్ఞాన వికాసాలకు ఎంతగానో తోడ్పడ్డాయి. క్రమానుగతంగా ప్రజాదరణ లేక శిథిలమైపోతున్నాయి. దీనికి కారణం... వినోద విజ్ఞాన రంగాల్లో ప్రపంచీకరణ కాలుమోపిన తర్వాత కళలు వ్యాపారంగా మారిపోయాయి. వ్యాపారంగా మారని, వినిమయ వస్తువుల ప్రచారానికి పనికిరాని కళలన్నీ కనుమరుగవుతున్నాయి. వేలాది జానపద కళారూపాలు ఆ విధంగా నిరాదరణకు గురవుతున్నాయి. ఆ కళలను నమ్ముకుని జీవనం సాగించిన కళాకారులకు నేడు ఆదరణ కరువయింది. కళలను నమ్ముకోలేక, నమ్ముకున్న కళలు కూడు పెట్టక దుర్భర జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు నాటి కళలను పునరుద్ధరిస్తామని కళాకారులకు బూటకపు వాగ్దానాలు, ప్రకటనలు చేస్తున్నాయే తప్ప ఆదుకునేందుకు నామమాత్రపు చర్యలు కూడా తీసుకున్నది లేదు. మన జీవన విధానానికి, విజ్ఞాన, వినోద, వికాసాలకు ఆలవాలమైన జానపద కళాసంపదను కాపాడుకోవాలి. భవిష్యత్తరాలకు అందించాలి. ప్రతియేటా ఆగస్టు 22న జరిగే 'ప్రపంచ జానపద దినోత్సవం' స్ఫూర్తిగా నిలవాలి.

మహనీయుల మాట



తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, ఎదుటివారి మాటకు కూడా విలువ ఇవ్వడం అలవరచుకుంటే జీవితంలో ఒక ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

కాలుష్యాన్ని పెంచే జిఎస్టీ

ప్రజాగళం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జిఎస్టీ, కాలుష్యాన్ని పెంచేందుకు కూడా దోహదం చేస్తోంది. నాలుగు శ్లాబ్‌లు అమలవుతున్న ఈ జిఎస్టీలో స్పోర్ట్స్ యుటిలిటీ (ఎస్‌యువి) వాహనాలపై పన్ను తక్కువగా నిర్ణయించడమే ఇందుకు కారణం. వీటి ధర చాలావరకు తగ్గడంతో ఎక్కువ మంది వీటిని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే అధిక శాతం ఎస్‌యు వాహనాల్లో డీజిల్‌నే ఇంధనంగా వినియోగిస్తారు. ఫలితంగా వాతావరణంలోకి విడుదలయ్యే కాలుష్య కారక డీజిల్ ఉద్గారాల పరిమాణం మరింత పెరుగుతుంది. అంతేకాక వీటి ఉత్పత్తి కూడా అధికంగానే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. వాయు కాలుష్యానికి డీజిలే శత్రువు. డీజిల్ వాహనాల్ని నిలిపేయాలని సుప్రీం కోర్టు గతంలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. మిగిలిన వాటితో పోలిస్తే ఈ వాహనాలు అధిక భూతాపానికి కారణమవుతాయి. వీటిలో వినియోగించే ఇంజిన్ అధిక ఉష్ణోగ్రత వద్ద డీజిల్‌ను మండిస్తుంది. ఫలితంగా రేడియేషన్, గాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీన్ని నివారించేందుకు జిఎస్టీ మండలి శాస్త్రీయ పద్ధతులను అనుసరించలేదన్న విమర్శలున్నాయి. సాధారణంగా కాలుష్యాన్ని తగ్గించేందుకు 'పొల్యూటర్ పే' నిబంధనల్ని అనుసరించాలి. ఈ నిబంధనల ప్రకారం కాలుష్య కారకునిపై అధిక పన్ను విధించాలి. ఆ అదనపు మొత్తాన్ని కాలుష్య నివారణా చర్యలకు ప్రభుత్వం వినియోగించాల్సి ఉంటుంది. అయితే కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జిఎస్టీ మండలి ఈ మేరకు చర్యలు తీసుకోలేదు. జిఎస్టీ అమల్లోకి రాకముందు ఈ వాహనాలపై 47.5 నుంచి 54.5 శాతం పన్ను ఉండేది. ఇంచుమించుగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పన్నురేటు అమల్లో ఉండేది. పన్ను ధర అధికంగా వుండటం వల్ల వాటి ధర ఎక్కువగా ఉండేది. దీంతో కొనుగోలు చేసేవారి సంఖ్య కూడా తక్కువగా ఉండేది. ఒకవేళ కొనుగోలు చేసినా వారి నుంచి కాలుష్య నివారణకు సెస్‌ను వసూలు చేసేవారు.



అయితే జిఎస్టీ అమల్లోకొచ్చాక ఆ అదనపు పన్నును తొలగించారు. ఉదాహరణకు మహీంద్రా స్కార్పియో వాహనం ధర అంతకుముందు రూ. 9.30 లక్షల నుంచి రూ. 15.51 లక్షల మధ్య ఉండేది. అయితే జిఎస్టీ అమల్లోకొచ్చాక దాని ధర రూ. 8.56 లక్షల నుంచి రూ. 14.27 మధ్యలో ఉంది. అంటే సుమారుగా రూ. 74 వేల నుంచి రూ. 1.24 లక్షల వరకూ ధర తగ్గింది. దీంతో ఎక్కువ మంది ఈ వాహనాల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. వాతావరణ కాలుష్యానికి పెట్రోలు, డీజిల్‌లు ప్రధాన కారణాలైనా డీజిల్‌తోనే ముప్పు ఎక్కువ. ధర కూడా తక్కువగా వుండటంతో కొనుగోలుదారులు ఈ వాహనాల వైపు మొగ్గు చూపే అవకాశాలే ఎక్కువగా వున్నాయి. ఇప్పట్లో పెట్రోలు, డీజిల్‌కు ఒకే ధర నిర్ణయించే ప్రతిపాదన కూడా లేదు. దీంతో రోడ్లపై తిరిగే మోటారు డీజిల్ వాహనాల సంఖ్య బాగా పెరిగే అవకాశముంది. పర్యవసానంగా వాతావరణంలో కాలుష్యశాతం పెరిగే అవకాశముంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వచ్చే మండలి నిర్ణయాల్లోనైనా ఈ వాహనాలపై 'సిన్ ట్యాక్స్' పేరుతో అదనపు పన్ను విధించని పక్షంలో కాలుష్యాన్ని నివారించడంలో కేంద్రం చిత్తశుద్ధి కనబర్చడంలేదన్న విమర్శల్ని ఎదుర్కోక తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

కాలుష్య నివారణకు ఆర్థిక శాఖ తీసుకోవాల్సిన చర్యలపై ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ కమిటీ చేసిన సూచనలను పరిగణలోకి తీసుకోవాలని సిఎస్‌ఇ కేంద్రానికి సూచిస్తోంది. అంతర్జాతీయంగా వాతావరణ కాలుష్య నివారణ దృష్ట్యా పలు రకాల అదనపు పన్నులు విధించడం ఈ రోజుల్లో పరిపాటయ్యిందని, కార్బన్ ట్యాక్స్, కార్ ట్యాక్స్ వంటి పన్నులు అమల్లోకి వచ్చాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని ఎస్‌యువి కార్లపై జిఎస్టీలో స్వల్ప మార్పులు చేయాలని పేర్కొంది. ప్రస్తుతం వీటిపై విధించిన పన్ను కూడా లగ్జరీ కేటగిరీ కింద వసూలు చేస్తున్నారే తప్ప పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని వసూలు చేయడం లేదని వివరించింది. 'మేక్ ఇన్ ఇండియా' ప్రోత్సాహకాల పేరుతో పన్ను సడలింపులు ఇవ్వడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. కొన్ని కార్లలో నాసిరకం డీజిల్‌ని వాడటం వల్ల అదనంగా ఒక శాతం కాలుష్య కారకాలు విడుదలవుతున్నాయని వివరించింది. ఢిల్లీలో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిన నేపథ్యంలో పెద్ద డీజిల్ కార్లపై అదనంగా ఒక శాతం పన్నును ప్రభుత్వం వసూలు చేసింది. తద్వారా కాలుష్య నియంత్రణకు అవసరమైన నిధి సమకూరుతోంది. పర్యావరణ,ఆర్థిక నిపుణులు కూడా ఇదే విషయాన్ని ఉదహరిస్తున్నారు.

కిల్లి వెంకట రమణమూర్తి, విజయవాడ.

కొలువు కోసం ఎదురుచూపులు

ఆర్భాటపు ప్రకటనలు, మోసపు విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం పబ్బం గడుపుతోంది. ప్రభుత్వ కొలువులపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులకు ప్రభుత్వం రిక్తహస్తం చూపుతోంది.



ఏపీపీఎస్సీ వార్షిక క్యాలెండర్ నోటిఫికేషన్ల విషయంలో తాత్సారం చేస్తోంది. వేల సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసే అవకాశముందని ప్రభుత్వం చేసిన ప్రకటన నిరుద్యోగుల సహనాన్ని పరీక్షిస్తోంది. పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతుల కోసం ఏపీపీఎస్సీ ఎదురు చూడాల్సివస్తోంది. ఉద్యోగాల భర్తీపై ఏపీపీఎస్సీ కూడా సరైన స్పష్టత ఇవ్వకపోవడంతో నిరుద్యోగుల్లో నిరాశ నెలకొంది. ఉద్యోగాలు ఎలాగూరావు.. కనీసం స్వయం ఉపాధి ద్వారానైన ఉపాధి దొరకుతుందనే యువత ఆశలకు కూడా ప్రభుత్వం గండి కొడుతోంది. అటు ఉద్యోగాలు, ఇటు ఉపాధి మార్గాలు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు. రుణాల మంజూరు విషయంలో బ్యాంకులు సహకరించకపోవడం, కార్పొరేషన్లలో అవినీతి కారణంగా రుణసౌకర్యం కూడా అందకుండా పోతోంది. కోట్లాది రూపాయలు నిరుపయోగం అవుతున్నా పాలకుల్లో స్పందన కనిపించడం లేదు. ప్రస్తుతం అభివృద్ధి పథకాలకు తీరుతెన్నులే లేవు. కాని యువజన అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్, నిరుద్యోగ భృతి అంటూ ఏవేవో ప్రకటనలు చేసి చేతులు దులుపుకోవడం ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. గతంలో జరిపిన ప్రజాసాధికారిత సర్వే ద్వారా రాష్ట్రంలో సుమారు 34 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా.. అంతమందికి ఉద్యోగాలు కల్పించడం అసాధ్యం..కనీసం ఉపాధి అవకాశాలైనా కల్పించాలి. కేవలం ప్రకటనలతో భరోసా ఇవ్వడం కాదు.. కార్యాచరణ చేసి చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

నల్లమిల్లి సత్యానందరెడ్డి, విశాఖపట్నం.

పసిపిల్లలకు పశువులపాటి విలువ లేదా?

ఎస్. వినయకుమార్



సమీక్ష

గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రిలో పెద్ద సంఖ్యలో సంభవించిన పిల్లల మరణాలకు కారణమేమిటి? ఆక్సిజన్ కొరత ఎంతవరకు కారణం? అపరిశుభ్రత ఎంతవరకు కారణం? ఇందుకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత ఎంత? గత ప్రభుత్వాల బాధ్యత ఎంత? వంటి ప్రశ్నలు ముందు కొచ్చాయి. నిర్దిష్ట ప్రాంతంలో నిర్దిష్ట ప్రజా సమూహంలో కన్పించే ఈ రకం మెదడువాపు వ్యాధిని యూపీ ఎందుకు సమర్థవంతంగా ఎదుర్కోలేకపోతోంది? దోమకాటు వల్ల సంక్రమించే ఈ వ్యాధిని నివారించడానికి పరిశుభ్రత ముఖ్యం. మరి అపరిశుభ్రతకు ఎవరు కారణం? ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగిని రెండు దశాబ్దాల నుండి లోక్‌సభకు పంపిస్తున్న గోరఖ్‌పూర్ అపరిశుభ్రతలో ఓలలాడుతోందన్నది నిజం. క్లీన్ సిటీల జాబితాలో ఇదొక అట్టడుగున ఉన్న పట్టణం. పట్టణ పరిశుభ్రత గురించి యోగి ఎప్పుడూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆయన పరిశుభ్రతపై దృష్టి సారించలేదు. బీఆర్‌డీ ఆస్పత్రి కూడా చెత్తాచెదారంతో కంపుకొట్టేదేనని మీడియా వార్తలు పేర్కొన్నాయి. ఇంత జరిగినా యోగి తీరు విడ్డూరంగా ఉంది. పెద్ద సంఖ్యలో జరిగిన పిల్లల మరణాలపై దేశమంతా నివ్వెర పోయి, విషాదంలో మునిగిపోగా, ముఖ్యమంత్రి యోగి కృష్ణాష్టమి వేడుకల్లో మునిగిపోయారు. ప్రాణం కోసం విలవిలలాడుతున్న పసిపాపల్లో యోగికి బాలకృష్ణులు కన్పించలేదు. యోగి వ్యవహారశైలిలో, ఆలోచనా ధోరణిలో పొంచి ఉన్న ప్రమాదమే ఇది. యోగి సంరక్షణకు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా నడుం బిగించడానికి ఈ ధోరణే కారణం.

చావులకు ఆక్సిజన్ కొరత కాదని ముఖ్యమంత్రి దబాయిస్తుండగా ఆక్సిజన్ కొరత కూడా అక్కడ ప్రాణాంతకంగా పరిణమించిందని దర్యాప్తు బృందాలు చెప్తున్నాయి. ముఖ్యమంత్రి ఆ వాస్తవాన్ని పట్టించుకోవడం లేదు. యోగి చెప్పినట్టు అపరిశుభ్రత కూడా వ్యాధికి కారణమే. మరి పరిశుభ్రతను కాపాడాల్సిందెవరు? రాష్ట్ర ప్రభుత్వానికి ఆ బాధ్యత లేదా? 'పరిశుభ్రత ప్రజల బాధ్యత' అన్నదే స్వచ్ఛ భారత్ కాన్సెప్ట్. యోగి మాటల్లోనూ అదే వ్యక్తమవుతోంది. చెత్తకుప్ప లను, పశువుల మలమూత్రాలను ఎత్తేసి శుద్ధి చేయడం ఓ దీర్ఘకాలిక ప్రణాళిక కాదు గదా? మరి యోగి ప్రభుత్వంలో ఆ పని ఎందుకు జరగడం లేదు? పశు విసర్జితాలు పవిత్రమన్న అశాస్త్రీయ భావన కూడా అపరిశుభ్రతకు కారణమవుతోంది. మరుగుదొడ్లపై పెద్ద ఎత్తున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. మంచిదే... కానీ పశువుల వల్ల ఏర్పడే అశుభ్రతను కూడా తొలగించాలి కదా. ఆ పని ఎందుకు జరగడం లేదు. గోరఖ్‌పూర్‌లో ఆస్పత్రులు, తదితర చికిత్సా విభాగాల చుట్టూ పశువులు సంచరిస్తున్నాయి. ఆకలితో అవి ప్లాస్టిక్ కాగితాలతో సహా దొరికిందల్లా తింటున్నాయి. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత యోగి ప్రభుత్వానికీ గోరక్షక దళాల కు లేదా? పశుమాంస భక్షకులన్న ముద్ర వేసి ముస్లింలు, దళితులపై దాడి చేయడమేనా గోరక్షక దళాల పని వంటి ప్రశ్నలకు కూడా బీజేపీ, యోగి సర్కార్ సమాధానం చెప్పాల్సి ఉంది.

బీఆర్‌డీ ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మండలి (ఐఎంఏ) బృందం పేర్కొంది. చాలా కాలం నుండి అక్కడ ఆక్సిజన్ కొరత నెలకొంది. ఆ ఆస్పత్రి ప్రమాణాల ప్రకారం 400 సిలిండర్లు ఎప్పుడూ నిల్వ ఉండాలి. కాగా 60 సిలిండర్లకు మించి ఉండటం లేదట. ఐదారు నెలల నుండి ఆక్సిజన్ సరఫరాదారులకు బిల్లులు చెల్లించడం లేదు. సరఫరాదారు నాలుగు రిమైండర్లు పంపినా ఫలితం లేకుండా పోయింది. నేరుగా సంబంధిత మంత్రికి లేఖ పంపినా స్పందన లేదు. అధికారులూ మంత్రి దృష్టికి తెచ్చారు. ఇది నిధుల సమస్యా? అవినీతి జాడ్యమా? తేల్చడానికి యోగి సిద్ధంగా లేరు. దీనివల్ల తన ప్రభుత్వ సమర్థతే ప్రశ్నార్థకమవుతుందని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తున్నది.



ఐదారు నెలల నుండి ఆక్సిజన్ సరఫరాదారులకు బిల్లులు చెల్లించడం లేదు. సరఫరాదారు నాలుగు రిమైండర్లు పంపినా ఫలితం లేకుండా పోయింది. నేరుగా సంబంధిత మంత్రికి లేఖ పంపినా స్పందన లేదు. అధికారులూ మంత్రి దృష్టికి తెచ్చారు. ఇది నిధుల సమస్యా? అవినీతి జాడ్యమా? తేల్చడానికి యోగి సిద్ధంగా లేరు. దీనివల్ల తన ప్రభుత్వ సమర్థతే ప్రశ్నార్థకమవుతుందని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తున్నది.

బీఆర్‌డీ ఆస్పత్రిలో ప్రతిరోజూ ఏడుగురు పిల్లలు చనిపోతారట. అక్కడ చావులు మామూలే అని అమిత్‌షా చేసిన వాదనకు ఈ సంఖ్య మూలం. కాని ఆగస్టు 10వ తేది నాడు ఒక్కరోజే 23 మంది పిల్లలు చనిపోయారు. ఆస్పత్రిలో పిల్లల చావులను రోజు వారీగా చూడాలా? ఏడాది సగటున చూడాలా? గత ఏడాదికంటే తక్కువగానే చనిపోయారు కదా అన్నది చిత్తశుద్ధిలేని వాదన. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో పిల్లలు చనిపోయినా అది పెద్దగా పట్టించుకోనక్కర్లేదని షా మాటల సారాంశం. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల పిల్లలు కనుక షా ఇలా స్పందించారని సరిపెట్టుకోవాలేమో!

గత నాలుగు దశాబ్దాల్లో గోరఖ్‌పూర్ పరిసర ప్రాంతాల్లో 25 వేల వరకు మెదడువాపు మరణాలు సంభవించాయని లెక్కలు చెబుతున్నాయి. నమోదు కాని చావులు కూడా లెక్కిస్తే ఈ సంఖ్య 50 వేల వరకు ఉంటుందని ఒక అంచనా. దేశంలో మరికొన్ని చోట్ల కూడా మెదడువాపు మరణాలు ఎక్కువ సంఖ్యలో ఉండేవి. వాటి సంఖ్య ఇప్పుడు తగ్గింది. యూపీలో కొనసాగుతోంది. రోగులను వెనువెంటనే ఆస్పత్రికి తరలించడానికి తగిన రోడ్లూ అవసరమైన రవాణా సౌకర్యాలూ లేకపోవడం, గోరఖ్‌పూర్ ఆస్పత్రికి చేరే సరికే పసి పిల్లలు కోలుకోలేని స్థితికి చేరడం కూడా చావులకు ఒక కారణమని నిపుణులు చెప్తున్నారు. గోరఖ్‌పూర్ ప్రాంతంలోని ప్రయివేట్ ఆస్పత్రుల క్లినిక్‌ల డాక్టర్లకూ సిబ్బందికీ మెదడువాపు వ్యాధిపై ప్రత్యేక శిక్షణ లేదు. ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాల్లోనూ ఇదే స్థితి. రోగి తిరిగి కోలుకోలేని స్థితికి చేరుతున్నాడని నిర్ధారించుకొన్న అరగంటలోపు చికిత్స ఆరంభించగలిగితే రోగి ప్రాణాలను కాపాడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ సూచనను గత ప్రభుత్వాలూ, ప్రస్తుత యోగి ప్రభుత్వమూ పట్టించుకోలేదు. చావులకు సగటు లెక్కగట్టి బాధ్యత నుండి తప్పుకొంటోంది. ఒక మిత్రుడు చెప్పినట్టు పశువులే కనుక ఇంత సంఖ్యలో చనిపోయి ఉంటే ఉత్తరప్రదేశ్ అల్లకల్లోలమై ఉండేది.

గోరఖ్‌పూర్ ఆస్పత్రి పరిశుభ్రతపై ఐఎంఎ బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎలుకలు, కుక్కలు ఆస్పత్రి వార్డుల్లో కనిపిస్తున్నాయని చెప్పింది. మరణాల వార్తలు పత్రికలకెక్కిన తర్వాత పరిస్థితి ఇది. అంతకు ముందు మరెంత ఘోరంగా వుందో! ప్రాథమిక వైద్య కేంద్రాల్లో పిల్లల వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందీ లేరని కూడా కమిటీ చెప్పింది. ఎంపీగా యోగి ఈ అంశంపై ఎప్పుడయినా దృష్టి పెట్టారా? ఇప్పుడయినా పెడతారా? ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం డాక్టర్ రాజీవ్ మిశ్రా, డాక్టర్ కఫీల్‌ఖాన్‌లను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోగా తమ పరిశీలనలో వారి నిర్లక్ష్యమేమీ కన్పించలేదని ఐఎంఎ బృందం చెప్పింది. పరిపాలనా వైఫల్యమే ఉందని పేర్కొంది. ఆ పరిపాలన వైఫల్యంలో ప్రజాప్రతినిధులు, మంత్రి, ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉంది. ఆస్పత్రిలోని సిబ్బంది తదితరులు తమతో మాట్లాడడానికి భయపడ్తున్నారని బృందం పేర్కొంది. సరఫరాదారులకు ముందుగా గానీ ఎప్పటికప్పుడు గానీ చెల్లింపులు జరగాలని ఐఎంఎ బృందం చెప్తోందంటే అక్కడ ఎలాంటి స్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు.

తమిళనాడులోని వెటల్లూరు ప్రాంతాల్లో ఈ రకం మెదడువాపు వ్యాధి కన్పించేది. అక్కడ డాక్టర్లకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అది ఫలితాన్నిచ్చింది. అలాంటి శిక్షణ గోరఖ్‌పూర్‌లో కూడా ఇవ్వాలని భారతీయ వైద్య పరిశోధనా సంస్థ సూచించింది. బీహార్, పశ్చిమ బెంగాల్‌లో కూడా ఈ సమస్యను ఎదుర్కొనే ప్రాంతాలున్నాయి. కానీ ఈ మోతాదులో చావులు సంభవించలేదు. నేపాల్‌లో కూడా ఈ వ్యాధి ఒక ప్రాంతంలో కన్పించేదని, తమ సూచనలవల్ల అరగంట వ్యవధిలో చికిత్సను అందించే ఏర్పాట్లు అక్కడ చేయడం వల్ల మంచి ఫలితాలు కన్పించాయని నిపుణులు చెపుతున్నారు. అలాంటి చర్యలు గోరఖ్‌పూర్ ప్రాంతంలో చేపట్టలేదు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు కూడా. టీకాలవల్ల పూర్తిగా అంతరించకపోయినా వ్యాధికి గురయ్యే వారి సంఖ్య తగ్గుతుందని గత అనుభవాలను బట్టి నిపుణులు చెప్తున్నారు. గోరఖ్‌పూర్ ప్రాంతంలో డయాగ్నస్టిక్స్ సౌకర్యాలు కూడా పెరగాలని నిపుణులు చెప్తున్నారు. ఈ అంశాలపై యోగి ఏమి చేయనున్నారో చూడాలి.

రచయిత ప్రజాశక్తి పూర్వ సంపాదకులు.

దళితులు : సామాజిక సాంస్కృతిక పునాదులు

డాక్టర్ కత్తి పద్మారావు



దర్పణం

నారా చంద్రబాబు నాయుడుగారి పాలనలో దళితుల్ని అవమానించడం అనేది ఒక కార్యక్రమంగా సాగుతోంది. నిజానికి ఆంధ్రుల చరిత్రను ఒకసారి పరిశీలిస్తే క్రీ.పూ. 6వ శతాబ్ది నుంచి దళితులు ఏ విధంగా ఆంధ్రదేశ సంస్కృతిని నిర్మించారో మనకు తేటతెల్లం అవుతుంది. ఆంధ్రదేశంలో వున్న భౌగోళిక పరిస్థితులకు అనుకూలంగా తమ జీవన విధానాన్ని మలచుకొన్నవారు దళితులు. ముఖ్యంగా వ్యవసాయ సంస్కృతిలో వున్న నాగలిని, ఇనుప కర్రుని కనిపెట్టి, వ్యవసాయ సంస్కృతిని రూపుదిద్దిన వారు దళితులు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి నిర్మాణంలో దళితులది కీలక పాత్ర అనే విషయం పాలక వర్గానికి తెలియకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. దళితులు ఈ దేశ నిర్మాతలు, ఈ దేశంలో ఉత్పత్తి అయ్యే ప్రతి వస్తువులోను, సంపదలోను, వారి శ్రమ దాగి వుంది. వారిని 'మనం గౌరవించుకోవాలి' అనే భావన పాలక వర్గానికి లేకపోవడం వల్ల, ఈ పాలక వర్గంలో వుండే కొంత మంది నిందాపూర్వకంగా మాట్లాడి అపహాస్యం చేస్తున్నారు. రాష్ట్రమంత్రి ఆదినారాయణ రెడ్డి 'దళితులు మురికిగా వుంటారు, స్నానం చేయరు' అని నిందించారు. చరిత్రేమో దళితులు ఎంతో శుభ్రంగా వుంటారని, మొదట నదిలో స్నానం చేసి శుభ్రపరచుకోవడాన్ని దళితులే కనిపెట్టారని చెప్తుంది. దళితులు ఎప్పుడూ నీటుగానే వుంటారు. నీటితో సంబంధం లేని కొన్ని సామాజిక జాతులకు నదిలో స్నానం చేయడం రాదు. కాల్వల్లో ఈదడం రాదు. సముద్రంలో మునగడం రాదు. కేవలం వారు నీటిని ఒంటిమీద పోసుకుంటారు. నీటిని ఒంటి మీద పోసుకోవడం అనేది బ్రాహ్మణులు నేర్పింది. వారికి నదీ నాగరికత తెలియదు. వాళ్ళు అగ్నిని పూజిస్తారు. నీటితో స్నానం చేసేవాళ్ళను ద్వేషిస్తారు. చాలా సందర్భాల్లో వాళ్ళు నీటిని ఒంటి మీద చల్లుకుంటారు. బ్రాహ్మణవాదాన్ని అనుసరించే కొన్ని కులాలకు నీటిలో దిగడం రాదు. వాళ్ళ ఉనికి క్రీ.శ. 7వ శతాబ్దం వరకు మనకు కనిపించదు. కొన్ని జిల్లాల్లోనే భూస్వామ్య పెత్తందార్లుగా ఏర్పడ్డట్టు మనకు చరిత్ర చెప్తుంది. కులం చిట్టెం కట్టుకు పోవడం వల్ల మనుషుల్ని కులాలుగా చూడటం మానివేయలేక పోతున్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత దళితుల విస్తృతి పెరిగిన విషయాన్ని వీళ్ళు గమనించలేక పోతున్నారు.

డా॥బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలు ముందుకు వచ్చిన తరువాత వీరు వ్యవసాయ సంస్కృతి నుంచి, నదీ నాగరికత సంస్కృతి నుంచి విస్తరించారు. విద్యారంగంలో తమ సత్తాని చాటుకొని టీచర్లుగా, లాయర్లుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఐ.ఎ.యస్. అధికారులుగా, గ్రూపు-1 అధికారులుగా ఉన్నతమైన విద్యావంతులుగా ఎందరో ఎదిగారు. విద్యలో ఇప్పుడు భూస్వామ్య కులాలు వీరిని అందుకోలేక పోతున్నాయి. దళితులు ఇతరుల భూమిని ఆక్రమించరు. ఇతరులను హత్య చేయరు. దాయాదులు ఒకరినొకరు చంపుకోరు. ఎన్నో ఉన్నత కులాలు, దళితుల నుంచి శ్రమ సంస్కృతిని ఇప్పుడు నేర్చుకుంటున్నాయి. 'విద్య ద్వారానే పైకి వెళ్ళగలుగుతాం' అని అట్టడుగు వర్గాలకు అంబేద్కర్ నేర్పడమే అందుకు కారణం. 'మన మీద మనకు ఆత్మవిశ్వాసం కావాలి. మనం ఆత్మ గౌరవంతో ముందుకు వెళ్ళాలి. మనం ఈ దేశాన్ని నిర్మించిన వాళ్ళం. ఆయా కులాలన్నీ కొన్ని జిల్లాలకే పరిమితమైతే మనం భారతదేశం మొత్తం విస్తరించి వున్నామని' ఆయన దళితులకు బోధించాడు. చంద్రబాబు కూడా ఇంతకు ముందు 'దళితుల్లో పుట్టాలని ఎవరు అనుకుంటారు'? అనే మాట వాడారు. అజ్ఞానం వల్లే ఆయనకు ఆ మాటలు వచ్చాయి. నిజానికి వీరికి ఈ మాటలన్నీ రావడానికి బ్రాహ్మణవాద విద్యే కారణం. ఒక పక్క బ్రాహ్మణత్వం వున్నవారు దళితుల్ని అవమానిస్తున్నారు. మరో పక్క రాజకీయ నాయకులు వీరిని కించపరచాలని ప్రయత్నిస్తున్నారు. మళ్ళీ ఎలక్షన్లు వచ్చేనాటికి వీరి ఇళ్లకు వెళ్ళి నమస్కరించి దోసిళ్ళబట్టి ఓటు యాచిస్తారు. గెలిచిన తరువాత వీరిని అవమానిస్తారు. భూములు ఆక్రమిస్తారు. వీరి స్త్రీలను చెరబడతారు. కేసులు మాఫీ చేయించుకుంటారు. వీరి స్కూళ్ళు, హాస్టళ్ళు మూయిస్తారు. వీళ్ళను ఊళ్ళ నుంచి వెళ్ళగొట్టాలని చూస్తారు. వీళ్ళని సాంఘిక బహిష్కరణ చేస్తారు. అయినా భూస్వామ్య వర్గానికి చెందినవారికి దళితులు ఎందుకు ఓటు వేస్తున్నారు? దళితులు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ముందుకు వచ్చింది. రిజర్వేషన్లకు సంబంధించి అవగాహన లేకుండా వీళ్ళు మాట్లాడతారు. సంపదను అందరికి పంచి రిజర్వేషన్లు ఎత్తివేయవచ్చుగదా? ఒకవేళ యస్.సిలకు రాజకీయ రిజర్వేషన్ లేదు అనుకుందాం. 111 మంది యస్.సి, యస్.టి. యం.పి.లు ఏర్పడి వుండేవాళ్ళా? అంటే దళితుల శక్తి ఏమిటో మీకు అర్థం కావడం లేదా? యస్.సి., యస్.టి. యం.పిల్లో 90 శాతం పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి అయినవాళ్ళే. 70 ఏళ్ళల్లో యస్.సి.లు ఎంత మంది చదువుకున్నారు? పెత్తందారీ కులాల చదువు ఎంత? యస్.సిల్లో ఎక్కువ మంది వీధి దీపాల కింద చదువుకున్నారు. హాస్టల్లో పెట్టే చారు అన్నం తిని చదువుకున్నారు. తల్లులు నాట్లు వేసి, కోతలు కోసి, తండ్రులు క్వారీల్లో - బట్టీల్లో పని చేసి, మట్టి పనులు చేసి పిల్లల్ని చదివించుకొన్నారు. ఇతరులను దోపిడీ చేసి ఈ డబ్బు సంపాదించలేదు. ఒకసారి మనం లోతుగా ఆలోచిస్తే కుల ఆర్థిక గణన వలన, భూగణన వలన భూమి, పరిశ్రమలు, వ్యాపారం, భిన్న అంశాలలో అగ్రకులాలే ఎందుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయో మనకు అర్థమవుతోంది.



మళ్ళీ ఎలక్షన్లు వచ్చేనాటికి వీరి ఇళ్లకు వెళ్ళి నమస్కరించి దోసిళ్ళబట్టి ఓటు యాచిస్తారు. గెలిచిన తరువాత వీరిని అవమానిస్తారు. భూములను ఆక్రమిస్తారు. వీరి స్త్రీలను చెరబడతారు. కేసులు మాఫీ చేయించుకుంటారు. వీరి స్కూళ్ళు, హాస్టళ్ళు మూయిస్తారు. వీళ్ళను ఊళ్ళ నుంచి వెళ్ళగొట్టాలని చూస్తారు. వీళ్ళని సాంఘిక బహిష్కరణ చేస్తారు. అయినా భూస్వామ్య వర్గానికి చెందినవారికి దళితులు ఎందుకు ఓటు వేస్తున్నారు?

జీవన సంక్షోభంలో వున్న ఎస్సీ ఎస్టీల ఆర్థిక అభివృద్ధి శాతం మందగించటానికి కారణం ప్రాథమిక అవసరాలే కాక, ప్రాథమిక విద్య, ప్రాథమిక వనరులు లేకపోవడమే. ఇది ఈనాటి కథ కాదు. కొన్నివేల సంవత్సరాలు వీరిని విద్యకు, ఆర్థిక వనరులకు దూరంగా వుంచారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా ప్రతి అవకాశం మీద దెబ్బకొడుతున్నారు. 25 శాతం ప్రజలను పేదరికంలో వుంచటం వలన భారతదేశం ఎలా అభివృద్ధి చెందుతుంది? ఈ అసమత్వమే భారతదేశం మొత్తం అభివృద్ధికి గొడ్డలిపెట్టు అవుతోంది. ఒక పక్క ఒక వర్గం కోట్లకు పడగలెత్తుతోంది. మరొక పక్క దళితుల్లో 90 శాతం మంది సామాజికంగా, సాంస్కృతికంగా అణగారిపోతున్నారు. ఆర్థిక పునాదులు కూలిపోవడానికి కారణాలు వెదికినప్పుడు 85 శాతం మందిని నిర్లక్ష్యం చేయడమేనని అర్థం అవుతోంది. పాలక వర్గాలు భారత రాజ్యాంగాన్ని అధ్యయనం చేస్తే ఎవరి శ్రమను దోచుకుంటున్నామో, వారిని నిందించటం ఎంత తప్పో అర్థం చేసుకోగలుగుతాయి. అందుకే అంబేద్కర్ కుల నిర్మూలనను బోధించారు. కులం రూపొందించబడిందే కానీ అది నిజం కాదు. ఒక వ్యక్తికి ఒక ఓటు విలువే కాదు, ఒక సామాజిక విలువ, ఒక రాజకీయ విలువ, ఒక ఆర్థిక విలువ, ఒక సాంస్కృతిక విలువ, ఒక సామాజిక గౌరవం ముఖ్యం. భూస్వామ్య కులాలు తమ కులభావాన్ని పోగొట్టుకోవడం ద్వారానే మనుష్యులు విస్తరించారు. జ్ఞానం లేని జాతులు అనేకం నశించిపోయాయి. కక్షలు కార్పణ్యాలు, హింస, హత్యలు, వేధింపులే జీవన విధానాలుగా బతకటం వల్ల జాతులు విస్తరించవు. జ్ఞానం, నీతి, నిజాయితీ, విద్య, మానవత్వం, ఆత్మీయత, ప్రేమ, కరుణ, ప్రజ్ఞ, మహోదాత్తత ఇప్పుడు అందరికీ కావాలి. అప్పుడే మనం అందరినీ అర్థం చేసుకోగలుగుతాం. ప్రతి శ్రామికుడు ఒక శిల్పకారుడే. మైలపడిన బట్టలను రసాయనాలతో ఉడికించి తెల్లగా చేసే రజకుడు శాస్త్రవేత్త కాదా? నాట్లేసి కోతలు కోసి భూమిని పండించే స్త్రీలు మహోన్నతులు కాదా? మగ్గం గుంటల్లో మగ్గి నీవు ధరించే వస్త్రం నేసిన మహిళ తల్లి వంటిది కాదా! సారె మీద మట్టితో కుండ చేసి నీ దాహం తీర్చిన స్త్రీ చెల్లి కాదా! ఆ శ్రామికులపైనే లైంగిక దాడులు చేయటం ఎంతవరకు సామాజిక న్యాయం! లెక్కలు, సైన్స్, చరిత్ర బోధించే డేవిడ్ మాస్టారు మనకు జ్ఞాన బిక్ష పెట్టలేదా? వారినే నిందించటం ఎంతవరకు సామాజిక నీతి! అగ్రకుల మేధావుల్లో ఎక్కువమంది ఎస్సీ కాలేజీలో చదవలేదా! ఉన్నత పదవులు అలంకరించలేదా! ఆలోచించుకోవాలి. విద్యతో పాటు మానవ విలువలు, ఆలోచన లేకపోవటం వల్లే ఇప్పటికీ కత్తులతో, గండ్ర గొడ్డళ్ళతో, పరుష వ్యాఖ్యలతో కొందరు జీవిస్తున్నారు. అందుకే నారా చంద్రబాబు నాయుడుగారు దళితుల ఓట్లతో గెలవటం కాదు, ఆ ఓటు వేసినవారి విలువ తెలుసుకోవాలి. అందుకనే దళిత, బహుజన వర్గాలు, మైనార్టీలు, లౌకికవాదులు భారత రాజ్యాంగాన్ని గౌరవించే లౌకిక శక్తులకే ఈసారి ఓటు వేయాలి. 2019లో తప్పక ఇటువంటి పరుష వ్యాఖ్యలు పలికేవారికి రాజకీయంగా సమాధానం చెప్పగలగాలి. ఓటు అమ్ముకోకూడదు. ఓటు చాలా విలువైంది. ఓటు జీవితమంత విలువైంది. ఓటును మద్యానికి, డబ్బుకు, ఇతర వస్తువులకు అమ్ముకోవడం వల్ల కొన్నవారికి బానిసలం అవుతున్నాం. వారు ఒక పార్టీలో గెలిచి మరొక పార్టీలో చేరినా వారినే ఎన్నుకొంటున్నాం. అందుకే ప్రజలను వారు నిందించగలుగుతున్నారు. ఈ విషయాలు తెలుసుకున్న రోజున ఇటువంటి వారి నోళ్ళు మూతపడతాయి. అప్పుడే ఆంధ్రదేశంలో రాజకీయ నూతన చైతన్యం వస్తుంది. అందరూ గౌరవించబడే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యం కలిగిన సమాజ రూపకల్పన జరుగుతుంది.

(సామాజిక తత్వవేత్త, నవ్యాంధ్రపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు),9849741695

జీవన the family

వాన చినుకు పూల సొగసు

వర్షం అంటే ఇష్టపడని వారెవరుంటారు? వానలో చక్కర్లు కొడితే.. కలిగే ఆనందం వేరు. ఈ సీజన్‌లో తెల్లటివి, ఒకే రంగు పూలడిజైన్‌లలో డ్రస్‌లు వేసుకుంటే వర్షపు మరకలు పడతాయి కదా! అందుకే సిల్క్ డ్రస్‌లను ఎంచుకుంటే ఉత్తమం. సాదాటాప్ .. ఫుల్ హ్యాండ్స్.. బాటమ్, చున్నీ పూల డిజైన్‌లో గల దుస్తులు ధరిస్తే మీరే.. స్పెషల్ అట్రాక్షన్ అవ్వడం ఖాయం. అందుకే వానాకాలాన రంగు డ్రస్‌లు ట్రై చేద్దాం పదండి!



'జీవన'పై మీ స్పందన

'జీవన' పేజీలు మీకెలా అన్పిస్తున్నాయి? ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారు? మీ కుటుంబసభ్యుల, మిత్రుల, బంధువుల స్పందన ఎలా ఉంది? 'ప్రజాశక్తి' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు మాకు తెలియజేయండి.

మా చిరునామా: జీవన, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం : 7-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2, ఇ మెయిల్ jeevanapageps@gmail.com ఫోన్ నెం. 9490099006 మీ ప్రశ్నలకు 12-6 గంటల వరకు ఫోనులో చెప్పవచ్చు. ఆదివారం సెలవు.

మీ కోసం

పైనాపిల్ రసాన్ని ముఖానికి రాసుకుని, ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకుంటే ముఖం కాంతివంతంగా ఉంటుంది.

మోచేతులు, మోకాళ్లు మెరిసేలా..!



ఎండ, ఒత్తిడి, రాపిడి వల్ల మోచేతులు, మోకాళ్లు నల్లగా మారతాయి. ఈ ప్రదేశాలూ కూడా మిగతా శరీరంలో కలిసిపోయేలా మారాలంటే ఇలా చేయండి.

అలొవెరా జెల్: అలొవెరా గుజ్జును రెండు చోట్లా పట్టించి అరగంట తర్వాత కడిగేసుకోవాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తూ ఉంటే కొద్ది రోజుల్లోనే మోచేతులు, మోకాళ్ల రంగు మిగతా శరీరంతో కలిసిపోతుంది.


పసుపు, తేనె, పాలు: పాలు బ్లీచ్‌లా పనిచేస్తే, తేనె చర్మానికి తేమను అందిస్తుంది. పసుపు క్రిమిసంహారకం. కాబట్టి ఈ మూడిరటిని కలిపి ప్యాక్ వేయాలి. పూర్తిగా ఆరాక కడిగేసుకోవాలి. ఇలా వారానికోసారి చేస్తూ ఉంటే మోచేతులు, మోకాళ్ల దగ్గరి చర్మం తేటగా తయారవుతుంది.

ఆలివ్ ఆయిల్, పంచదార: మోచేతులు, మోకాళ్ల నలుపు వదలాలంటే స్క్రబ్ చేయాలి. ఇందుకోసం ఆలివ్ ఆయిల్‌లో పంచదార కలిపి మోచేతులు, మోకాళ్లమీద సున్నితంగా స్క్రబ్ చేయాలి. తర్వాత సబ్బునీటితో కడిగేసుకోవాలి. ఇలా వారానికోసారి చేస్తూ ఉంటే ఈ ప్రదేశాలు శరీర రంగులోకి వస్తాయి.

బాదం పప్పు: బాదంలో విటమిన్ ఇ ఉంటుంది. కాబట్టి బాదం పప్పును మెత్తగా నూరి, దాంతో మోకాళ్లు , మోచేతులు రుద్దాలి. ఇలా చేస్తే మృతకణాలు తొలగి ఈ రెండు ప్రదేశాలూ శరీర రంగులోకి మారతాయి.

జీవిత వాస్తవాలను గ్రహించాలి

కొన్ని ఆనందాలు, మరికొన్ని విషాదాలు...కొన్ని ఆహ్లాదాలు...ఇంకొన్ని కష్టాలు ఇవన్నీ అందరి జీవితంలో సర్వసాధారణమే. మార్పు సహజమే. అయితే చాలా మంది అమ్మాయిలు తాము పుట్టి పెరిగిన వాతావరణంలో తల్లిదండ్రులు ఇచ్చే భద్రతకు అనుగుణంగా సమాజంలో అన్నీ ఆహ్లాదాలేనని, తమ జీవితంలో ఎల్లప్పుడూ సంతోషాలే ఉంటాయనే భ్రమల్లో ఉంటారు. అందుకు భిన్నమైన పరిస్థితులు ఎదురైతే, ఏదైనా సమస్య తలెత్తితే చాలా తీవ్రంగా స్పందించే గుణంతో ఉంటారు. ఇది సరైనది కాదు. జీవితంలో కష్టసుఖాలు కావడి కుండలు లాంటివనీ, సుఖం తర్వాత కష్టం, దాని తర్వాత సుఖం ఇలా ఆయా సందర్భాలను అనుసరించి వస్తుంటాయనే వాస్తవాన్ని తల్లిదండ్రులూ, పెద్దలూ వారికి తెలియజేయాలి.



ఏ రంగంలోనైనా, జీవితంలోనైనా శ్రమిస్తేనే మంచి ఫలితాలను అందుకోవడానికి వీలౌతుందని తెలపాలి. అదృష్టం కలిసొస్తే అన్నీ సమకూరిపోతాయని అనుకోవడం తప్పుడు భావన అని తెలియజేయాలి. ఇలాంటి అసత్యాలకు దూరంగా ఉండి చేసే పనిలో చిత్తశుద్ధి, అంకిత భావాన్ని చూపిస్తేనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని చెప్పాలి. అలా జీవితంలో శ్రమించి, సమాజానికి స్ఫూర్తిదాతలుగా నిలచినవారిని గురించి వారికి పరిచయం చేయాలి. వారి జీవితాల్లో ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని ఎలా అధిగమించారో తెలియజేసే పుస్తకాలు చదవాలి. పెద్దల అనుభవాల నుంచి స్ఫూర్తి పొందాలి. జీవితాన్ని యథాతథంగా స్వీకరించినప్పుడే వారు సొంతంగా అలోచనలు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పాలి. అలాంటప్పుడే కుటుంబంలోనూ, సమాజంలోనూ ఎలాంటి సమస్య ఎదురైనా తగిన మానసిక పరిణతితో అలోచించి సరైన పరిష్కారాన్ని ఎంచుకోగలరనే వాస్తవాన్ని తెలియజేయాలి.

ఎంచుకున్న రంగంలో మొదట అడుగు పెట్టినప్పుడు ఎన్నో రకాల సమస్యలు ఎదురుకావడం సహజమేనని గుర్తించాలి. వాటిని ఒక్కటొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగితేనే తగిన ఫలితాలుంటాయని తెలుసుకోవాలి. విత్తనం నాటిన రోజే మొక్క పుట్టి చెట్టుగా, మారి ఫలాలు ఇవ్వడం ఎక్కడా జరగదు. అందువల్ల సహనం, ఓపిక వంటివి జీవితానికి సుగుణాన్ని తీసుకొస్తాయని తెలపాలి. జీవితాన్ని భ్రమలతో కాకుండా వాస్తవాలతో తీర్చిదిద్దుకోవడంఎంతో అవసరం అనే విషయాన్ని ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకోవాలి.

- సమత, విజయవాడ.

ఇలా నూనె రాయండి!




ఆరోగ్యకరమైన, కాంతివంతమైన జుట్టు కోసం నూనె రాయడం తప్పనిసరి. అయితే నూనెలు రాసే పద్ధతులతో ప్రయోజనాలకంటే హాని ఎక్కువ కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. •దురుసుగా జుట్టుని రుద్దకూడదు. వెంట్రుకలు చాలా సున్నితమైనవి, అతిగా రుద్దడం వలన తెగిపోయి రాలిపోయే అవకాశం ఉంది. అలాగే, పైన చర్మమూ చాలా సున్నితంగా ఉంటుంది. అందువలన నూనె రాసినప్పుడు వెంట్రుకలను, తల పై చర్మాన్ని మృదువుగా, వలయాకారంలో నిమురుతూ ఆయిల్ మర్ధన చెయ్యాల్సి ఉంటుంది. అలా చేయకపోతే వెంట్రుకలు బలహీనమై రాలిపోయే ప్రమాదం ఉంది. •తలస్నానం చేసిన వెంటనే ఆయిల్ రాయడం కూడా ప్రమాదకరమైనదే. ఎందుకంటే వెంట్రుకల మొదళ్లు చాలా సున్నితంగా ఉండడమే కాకుండా, తడిగా ఉన్నప్పుడు కొంచెం ఒత్తిడికి రాలిపోయేంత మృదువుగా తయారవుతాయి. అందుకని తడిగా ఉన్నప్పుడు కాకుండా పూర్తిగా ఆరిన తర్వాతే ఆయిల్ పెట్టుకోవాలి. దువ్వుకోవాలి. •చాలామంది తలకురాసే నూనె అంటే కొబ్బరినూనె మాత్రమే అనుకుంటారు. ఇతర నూనెలను పట్టించుకోరు. కానీ వీటిలో కూడా చాలా వెరైటీలు ఉన్నాయి. పోషణకు కొబ్బరి, పెరుగుదలకు బాదం మంచివి. ఇంతేకాక, అమ్లా, శీకాకాయ్ లాంటి నూనెలు వివిధ రకాల జుట్టుకు సరైన పోషణ ను అందిస్తాయి. అందుకే సరైన నూనెను ఎంచుకోవడం చాలా అవసరం.

జీవన సౌరభం

ఒకసారి నమ్మకాన్ని వమ్ము చేసినవాడిని ఇంకెప్పుడూ నమ్మకు.

టీవీఎస్ తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ వస్తోంది?!

దేశీయ టూ వీలర్ల తయారీ దిగ్గజం టీవీఎస్ మోటార్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీ మీద దృష్టిసారించినట్లు గతంలో వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో తొలి ఎలక్ట్రిక్ స్కూటర్‌ను రూపొందిస్తున్నట్లు టీవీఎస్ ప్రతినిధులు ఓ ప్రకటనలో అధికారికంగా స్పష్టం చేశారు. దీంతో ఇండియన్ ఎలక్ట్రిక్ స్కూటర్ల విపణిలోకి ఈ సంస్థ ఎలక్ట్రిక్ స్కూటర్ ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. ప్రభుత్వమూ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, వినియోగపరంగా అనేక ప్రోత్సాహకాలను అందిస్తోంది. కాబట్టి భవిష్యత్తులో వ్యక్తిగత రవాణాలో ఎలక్ట్రిక్ టూ వీలర్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుంది. ఇప్పటికే టీవీఎస్‌కు మంచి సక్సెస్ సాధించి పెట్టిన జూపిటర్ స్కూటర్ ఆధారంగా దీనిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిసింది. అయితే, ప్రస్తుతం ప్రోటోటైప్ దశలో ఉన్న ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ప్రొడక్షన్ దశకు చేరుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ స్కూటర్‌లో వినియోగించే ఎలక్ట్రిక్ మోటర్, విడి పరికరాల సేకరణ, తయారీకి సంబంధించిన ప్రణాళికలను మీడియాతో పంచుకోవడానికి నిరాకరించారు. అయితే, వచ్చే ఏడాది జరగనున్న 2018 ఇండియన్ ఆటో ఎక్స్-పో వేదిక మీద టీవీఎస్ తమ సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆవిష్కరించే



అవకాశం ఉంది. టీవీఎస్ ఈ ఏడాది పండుగ సీజన్ నాటికి 125సీసీ సామర్థ్యంతో మరో కొత్త స్కూటర్‌ను ఇండియన్ మార్కెట్లో ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోందనే వార్తలూ వస్తున్నాయి. ఈ తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ ధర జూపిటర్ వంటి పెట్రోల్ ఇంధనంతో నడిచే స్కూటర్ కన్నా అధికంగానే ఉండనుంది. దేశవ్యాప్తంగా టూ వీలర్, ఫోర్ వీలర్ తయారీ సంస్థలు స్వతహాగా ఎలక్ట్రిక్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాయి.

'బైనాక్యులార్ విజన్' అంటే ఏమిటి ?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, గుంటూరు.
సెల్ : 9985288150

జ్ఞానేంద్రియాలు

మన చుట్టూ ఉన్న పరిసరాలలో మార్పులను గ్రహించే దేహంలోని భాగాలను జ్ఞానేంద్రియాలు అంటారు.

కళ్లు

ఇవి మానవ శరీరంలో అతి సున్నితమైన భాగాలు.

- దీని అధ్యయనం – ఆప్తమాలజీ
- ఈగ, బొద్దింక అనే కీటకాలలో సంయుక్త నేత్రాలు ఉంటాయి.
- చదివేటప్పుడు కంటికి, పుస్తకానికి ఉండాల్సిన దూరం – 30 సెంటీమీటర్లు
- టీవి చూసేటప్పుడు కంటికి, టీవికి ఉండాల్సిన దూరం – 2.5 సెంటీమీటర్లు
- అతి చిన్న కండరం కంటిలో ఉంటుంది. దాని పేరు **'నిమ్నబుజు కండరం'.**
- ప్రతిబింబం ఏర్పడడానికి పట్టే సమయం – 0.1 సెకన్
- కనుగుడ్డు కదల్చడానికి ఆరు కండరాలు సహాయపడతాయి. కన్ను గుర్తించగలిగే రంగుల సంఖ్య – 16
- కనురెప్పలు ఉండని జంతువులు – పాములు, చేపలు
- కన్నులు అనేవి నేత్రగర్తాలలో అమరి ఉంటాయి.
- కళ్లకు ఆరు గంటలు విశ్రాంతి అవసరం.
- నేత్ర గర్తంలో కన్నులు 2/3వ వంతు లోపలికి, 1/3వ వంతు వెలుపలికి ఉంటాయి.
- రెండు కళ్లతో ఒకే వస్తువును ఏకకాలంలో చూడటాన్ని **'బైనాక్యులార్ విజన్'** అంటారు.

ఉదా : పక్షులు, క్షీరదాలు

- రెండు కళ్లతో వేర్వేరు వస్తువులను చూడగలగడాన్ని **'మోనోక్యులార్ విజన్'** అంటారు.

ఉదా : చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు

- మొజాయిక్ దృష్టి – కీటకాలు
- టెలిస్కోపిక్ దృష్టి – కేవలం పక్షులకు మాత్రమే

నోట్ : పక్షుల కంటిలో పెక్టిన్ అనే నిర్మాణం ఉంటుంది.

- ఫ్రినోసోమా అనే సరీసృపం కంటి నుంచి శత్రువుల పైకి రక్తాన్ని చిమ్ముతుంది.

కంటిలో మూడు భాగాలు ఉంటాయి. (పొరలు)

1. దృఢస్తరం (లేదా) కార్నియా (లేదా) శుక్లపటలం
2. రక్తపటలం
3. నేత్రపటలం (లేదా) రెటీనా

1. దృఢస్తరం (లేదా) కార్నియా

- ఇది కంటిలోని మొదటి భాగం.
- దీనిని స్క్లేరోటిక్ పొర అంటారు.
- దీనిలో కుంభాకార కటకం (అభిసారి కటకం) లేదా సర్దుబాటు చేసుకోలేని కటకం ఉంటుంది.
- నేత్రదానం చేసేటప్పుడు కంటిలో సేకరించే భాగం – కార్నియా
- ఒక వ్యక్తి చనిపోయినప్పుడు ఆరు గంటల లోపు కార్నియాను సేకరిస్తారు.
- కార్నియా వెనుక భాగంలో కంటిపాప (ప్యూపల్) ఉంటుంది. ఇది కెమెరాలోని **'డయాఫ్రాం'** వలె పనిచేస్తుంది.
- కంటిపాప మధ్యలో చిన్న రంధ్రం ఉంటుంది. దీనినే తారక్ (లేదా) ఐరిస్ అంటారు.
- తారక్ వెనుక ద్వికుంభాకార కటకం (లేదా) స్పటిక కటకం (లేదా) సర్దుబాటు చేసుకునే కటకం ఉంటుంది.
- హర్మీందర్ దువా అనే భారతీయ శాస్త్రవేత్త కంటిలోని, కార్నియాకు సంబంధించిన ఒక కొత్త పొరను కనుగొని దానికి దువాన్ లేయర్ అని పేరుపెట్టారు. ఇది కార్నియాలోని ఐదు పొరలలోని కార్నియల్ స్ట్రోమా–డిస్సిమెట్స్ మెంబ్రేన్ పొరల మధ్య 15 మైక్రాన్ల మందంలో ఉంటుంది.
- కంటిపాపకు **'మెలనిన్'** రంగును ఇస్తుంది.
- కార్నియాను కప్పి **'కంజెక్టివా'** అనే పొర ఉంటుంది.

2. రక్తపటలం

- ఇది కంటిలోని రెండో పొర.
- ఇది రక్తంతో నిండి ఉంటుంది.
- దీనిలో రక్తనాళాలు, రక్త కణాలు ఉంటాయి.
- రక్తపటలం ముందు భాగాన్ని **'పరితారక'** అంటారు.
- పరితారక నుంచి శైలికా కండరాలు ఏర్పడతాయి. ఇవి సంకోచ, వ్యాకోచాలు జరపడం వల్ల కటకం ముందుకు, వెనుకకు కదులుతుంది. కావున దూరంగా ఉండే వస్తువులనైనా, దగ్గరగా ఉండే వస్తువులనైనా మానవుడు స్పష్టంగా చూడగలడు.

3. నేత్రపటలం (లేదా) రెటీనా


- ఇది కంటిలోని మూడో పొర.
- దీనిని కంటిలోని జ్ఞాన భాగంగా పిలుస్తారు.
- రెటీనా నుంచి వార్తలను మెదడుకు చేరవేసేవి **'దృక్‌నాడులు'**
- ఈ పొరలో రెండు రకాల కణాలుంటాయి.

ఎ. దండకణాలు (లేదా) రాడ్స్
బి. శంఖు కణాలు (లేదా) కోన్స్

- దండ, శంఖు కణాల సంఖ్య – 14 కోట్లు
- దండ, శంఖు కణాల నిష్పత్తి – 15 : 1

ఎ. దండకణాలు (లేదా) రాడ్స్

- ఇవి ఎక్కువ సంఖ్యలో ఉంటాయి.
- ఈ కణాలు **'రొడాప్సిన్'** అనే రంగును కలిగి ఉంటాయి.
- ఇవి తెలుపు, నలుపు దృశ్యాలను చూడటానికి మాత్రమే సహకరిస్తాయి.
- రాత్రి సమయాల్లో సంచరించే జీవులలో (నిశాచర జీవులు) ఈ కణాలు దృష్టికి సహాయపడతాయి.
- రేచీకటి గల వ్యక్తులలో ఈ కణాలు ఉండవు.



- ఎ విటమిన్ లోపిస్తే రాడ్ కణాలు రోడాప్సిన్‌ను ఉత్పత్తి చేయవు. కావున రేచీకటి వస్తుంది.
- అత్యధికంగా రాడ్ కణాలు కలిగిన జీవులు – గుడ్లగూబ

బి. శంఖుకణాలు (లేదా) కోన్స్

- ఇవి తక్కువ సంఖ్యలో ఉంటాయి.
- ఈ కణాలు **'అయోడాప్సిన్'** (విజువల్ పర్పుల్) అనే రంగు పదార్థాన్ని కలిగి ఉంటాయి.
- ఈ కణాలు ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగులను గుర్తించడానికి సహాయపడతాయి. ఈ రంగులను ప్రాథమిక రంగులు అంటారు.
- కలర్ టీవీలో కనిపించే రంగులు కూడా ఈ మూడు రంగులే.
- వర్ణాంధత్వం గల వ్యక్తులలో శంఖుకణాలు ఉండవు.
- కంటిలో రెటీనాపై ఏ ప్రాంతంలో అయితే వస్తువు ప్రతిబింబం ఏర్పడుతుందో ఆ ప్రాంతాన్ని **'ఎల్లో స్పాట్'** అంటారు.
- దండ కణాలు, శంఖు కణాలు లేని ప్రాంతాన్ని **'అంధచుక్క'** అంటారు.
- కంటికింది రెప్పల మూల భాగంలో లాక్రిమల్ గ్రంథులు (లేదా) అశ్రుగ్రంథులు (లేదా) కన్నీటి గ్రంథులు ఉంటాయి. ఇవి కన్నీటిని స్రవిస్తాయి.
- కన్నీటిలోని లవణం Nacl కనుక రుచికి ఉప్పుగా ఉంటుంది.
- కన్నీటిలో ఉండే ఎంజైమ్ – లైసోజోమ్ (ఇది సూక్ష్మజీవనాశినిగా పనిచేస్తుంది).
- కంటిలో నిమేషక పటలం, కనురెప్పలు అనేవి అవశేష అవయవాలు.

కంటికి సంబంధించిన వ్యాధులు

1. ట్రైకోమా

- ఇది కార్నియాకు సంబంధించిన వ్యాధి. ఇది **'కెలామీడియా', 'టకామాస్టిన్'** అనే బ్యాక్టీరియాల వల్ల వస్తుంది. కావున కళ్లు ఎర్రబడి నీరు కారతాయి.

2. కండ్లకలక (లేదా) కంజెక్టివైటిస్

- ఈ వ్యాధిని పింక్ (లేదా) మద్రాస్ ఐ అని పిలుస్తారు. ఇది **'ఎడినో వైరస్'** వల్ల వచ్చే అంటువ్యాధి. కళ్లు ఎర్రబడి నీరుకారి కంటి నుంచి పచ్చని ఉసులు వస్తాయి. ఇది గాలి ద్వారా అందరికీ వ్యాపిస్తుంది.

3. అస్టిగ్మాటిజం (అసమదృష్టి)

ఇది పుట్టుకతో వచ్చే వ్యాధి.

- వీరికి వస్తువులు వక్రాలుగా కనబడతాయి.
- కార్నియా నిర్మాణంలో లోపం వల్ల ఈ వ్యాధి వస్తుంది.
- ఈ వ్యాధిని సరిచేయడానికి 'స్తూపాకార కటకం' (సిలిండ్రికల్ లెన్స్) ఉపయోగిస్తారు.

4. అల్బునిజం

- ఇది జన్యు సంబంధమైన వ్యాధి. ఈ వ్యాధిగల వ్యక్తులు ఎక్కువ కాంతిని లేదా వెలుతురును చూడలేరు.

5. హ్రస్వదృష్టి (మయోపియా)

- ఈ వ్యాధిగల వ్యక్తులు దూరపు వస్తువులను మాత్రమే చూడలేరు. కారణం – దూరపు వస్తువుల ప్రతిబింబం రెటీనా ముందు భాగంలో పడుతుంది.
- ఈ వ్యాధిని సరిచేయడానికి 'పుటాకార (అపసారి) కటకం'ను ఉపయోగిస్తారు.

6. దీర్ఘదృష్టి (హైపర్ మయోపియా)

- ఈ వ్యాధిగల వ్యక్తులు దగ్గరి వస్తువులు మాత్రమే చూడలేరు. కారణం – వస్తువుల ప్రతిబింబం రెటీనా వెనుక భాగంలో పడుతుంది.
- ఈ వ్యాధిని సరిచేయడానికి 'కుంభాకార కటకం'ను ఉపయోగిస్తారు.

7. ట్రైస్ బయోఫియా

- ఏ వస్తువులనూ సరిగా చూడలేకపోవడం.
- ఏ వస్తువులైనా మసకగా కనిపిస్తాయి.
- ఇది వృద్ధాప్యంలో కలుగుతుంది.
- దీని నివారణకు **'ద్వినాభిత్వ కటకం'** (బయో–ఫోకల్ లెన్సెస్)ను ఉపయోగిస్తారు.

8. మెల్లకన్ను (స్ట్రాబిస్మాస్)

- కంటి కండరాలు పరిమాణానికి మించి పెరగడం వల్ల **'మెల్లకన్ను'** వస్తుంది.
- చూపులో లోపం ఉండదు. కానీ కంటి కండరాలు కిందకు వాలిపోతాయి. ఆపరేషన్ ద్వారా సరిచేయవచ్చు.

9. వర్ణాంధత్వం (కలర్ బ్లైయిండ్‌నెస్)

- ఈ వ్యాధి ఉన్నవారు ఎరుపు, ఆకుపచ్చ రంగులను గుర్తించలేరు. ఈ రెండు రంగులు నలుపు రంగులో కనిపిస్తాయి.
- ఇది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి. ఈ వ్యాధిని నివారించడం సాధ్యం కాదు.


10. శుక్లాలు (కాటరాక్ట్)

- ఇది ముసలి వారికి వస్తుంది.
- కనుగుడ్డును కప్పుతూ తెల్లటి పొర ఏర్పడుతుంది. కావున ఎత్తులు, గుంతలు గుర్తించలేరు. ఆపరేషన్ ద్వారా ఈ పొరను తొలగిస్తారు.

11. గ్ల్యూకోమ

- కంటిపైన సూక్ష్మజీవులు దాడి చేయడం వల్ల మానసిక ఒత్తిడి ఉండి నిద్రలేకపోవడం వల్ల కంటిలోని ద్రవంపై ఒత్తిడి పెరిగి నీరు కారుతుంది.

12. గ్లూకోమా : కళ్లు పొడిబారడం.



ముక్కు

దీని అధ్యయనాన్ని **'రైనాలజీ'** అంటారు. ఇది వాసనను గ్రహించడానికి సహాయపడుతుంది.

- ఇది **'మృధులాస్తి'** అనే మెత్తని ఎముకతో నిర్మితమై ఉంటుంది.
- పక్షులలో ఘ్రాణశక్తి తక్కువగా ఉంటుంది. కాని కివి పక్షిలో మాత్రం ఎక్కువగా ఉంటుంది.
- పాములలో వాసనలను గ్రహించడానికి **'జాకబ్‌సన్స్ అంగం'** సహాయపడుతుంది.
- కుక్క మానవుని కంటే 40 రెట్లు అధికంగా వాసన గ్రహిస్తుంది.

నాలుక

దీని అధ్యయనాన్ని **'లారింజాలజీ'** అంటారు.

- చేపలలో నాలుక ఉండదు. కాని జిహ్వా గ్రాహకాలు చర్మంపై ఉంటాయి.
- సరీసృపాలలో (తొండ, బల్లి) ఈ నాలుక అనేక చుట్టలు తిరిగి ఉంటుంది.
- పాములలో నాలుక రెండుగా చీలి ఉండి శబ్దగ్రాహకంగా పనిచేస్తుంది.
- నాలుక అనేది రెండు దవడల మధ్య ఉన్న కండర నిర్మిత భాగం.
- నాలుక మొత్తం **'రుచి గుళికల'**తో నిర్మితమై ఉంటుంది.
- నాలుక ముందు భాగం – ఉప్పు, తీపి
- నాలుక పక్క భాగాలు – పులుపు
- నాలుక లోపలి భాగం – చేదులను తెలియజేస్తాయి

నాలుకలో నాలుగు భాగాలు ఉంటాయి. అవి..

1. పైలిఫాం (లేదా) తంతుయుత భాగం – అనగా నాలుకపై విస్తరించిన భాగం.
2. ఫంగిఫాం – నాలుక అంచుభాగం.
3. సర్కమ్ వ్యాలెట్ – ఇది నాలుక లోపలి భాగం.
4. పోలియేట్ – ఇది నాలుక పర ఆధారభాగంలో ఉంటుంది. ఇది మానవునిలో లోపించి ఉంటుంది. ★

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

భూసంస్కరణలు - భూగరిష్ఠ పరిమితుల చట్టం



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

భూసంస్కరణల్లో అన్నింటి కన్నా ప్రధానమైనది భూ కమతాల గరిష్ఠ పరిమితిని నిర్ణయించడం. భూమి పరిమితమైన వనరు. కానీ దానిని ఆశించేవారి సంఖ్య అపరిమితంగా ఉంది. వ్యవసాయ ప్రధానమైన భారతదేశంలో అత్యధికుల జీవనాధారమైన భూమి తక్కువమంది చేతిలో కేంద్రీకృతమై ఉండటంవల్ల అసమానతలు పెంచిపోషించినట్లు అవుతుంది. భూ సంస్కరణల ముఖ్యమైన లక్ష్యాల్లో సాంఘిక న్యాయం సాధించాలంటే భూకమతాల పంపకాల్లోని అసమాతలను తొలగించి భూ యాజమాన్యపు హక్కులను పునః పంపిణీ చేయడం ద్వారా కౌలుదారులు భూస్వాముల చేతిలో దోపిడీకి గురికాకుండా చూడడం, దున్నేవాడికే భూమిపై యాజమాన్యపు హక్కులను కల్పించాలనే లక్ష్యాలలో భూ గరిష్ఠ పరిమితి చట్టాలు అమలయ్యాయి.

భూగరిష్ఠ పరిమితి నిర్ణయించడం వల్ల అనేక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. రాజ్యాంగంలోని 39వ అధికరణ ప్రకారం భౌతిక వనరులు అనగా భూమి, నీరు, గాలి మొదలైన వనరుల యాజమాన్యం వికేంద్రితమవుతుంది. కౌలుదార్లకు, రైతు కార్మికులకు సామాజిక భద్రత పెంపొందించడం ద్వారా వ్యవసాయ అభివృద్ధిని పెంచి సమాజంలోని సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించవచ్చు. గ్రామీణాభివృద్ధి జరిగే అవకాశం ఏర్పడుతుంది.

మన రాష్ట్రంలో గరిష్ట భూపరిమితికి సంబంధించి మూడు చట్టాలను చేశారు.

1. 1955 భూగరిష్ఠ పరిమితిచట్టం

హైదరాబాద్ కౌలుదారుల చట్టానికి 1954లో సవరణ తీసుకొచ్చారు. 1955 నుంచి ఇది అమలవుతుంది. దీనిననుసరించి వ్యవసాయ ఖర్చులు తీసివేయగా నికరంగా 800 రూపాయలు ఆదాయం లభించే కమతాలను కుటుంబ కమతంగా నిర్ణయించారు. గరిష్ఠ పరిమితిగా 4 1/2 కుటుంబ కమతాలుగా నిర్ణయించారు. అంతేగాక భవిష్యత్తులో సంపాదించే కమతాలకు గరిష్ఠ పరిమితిని మూడు కుటుంబ కమతాలుగా నిర్ణయించారు. ఇలా నిర్ణయించిన తర్వాత ఈ మిగిలిన భూమిని భూమిలేని పేదవారికి పునఃపంపిణీ చేస్తారు.

మొదట ఈ చట్ట సంస్కరణలు ఖమ్మం జిల్లాలో అమలవుతాయి. అయితే ఈ చట్టం అమలుకాకుండా భూస్వాములు న్యాయస్థానాలను ఆశ్రయిస్తే ఉత్తర్వులు పొందడంతో అమలు కార్యక్రమం నిలిపివేస్తారు.

2. 1961 భూగరిష్ఠ పరిమితి చట్టం

ఆంధ్రప్రదేశ్ భూ పరిమితి చట్టం 1961 జూన్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా మాగాణి భూమి ఐదు తరగతులుగా, మెట్టభూమి మూడు తరగతులుగా విభజించారు. ప్రతి కుటుంబానికీ నాలుగున్నర రెట్లు అనగా 27 ఎకరాల నుంచి 324 ఎకరాల భూమిని బట్టి కేటాయించారు. భవిష్యత్తులో దీనిని మూడు రెట్లుగా అనగా 18 నుంచి 216 ఎకరాలుగా నిర్ణయించారు. కటుంబంలో ఐదుగురు సభ్యులకు మించితే ఆ కుటుంబానికి అదనపు భూమిని ఆరు నుంచి 72 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. భూమిశిస్తు, పంట ఆధారంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమికి నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించారు.

1961 గరిష్ఠ భూపరిమితి చట్టం ప్రకారం కింది పేర్కొన్న విధంగా భూపరిమితిని నిర్ణయించారు.

భూ తరగతి గరిష్ఠ పరిమితి	
మాగాణి	ఎకరాలు
ఎ	27
బి	36
సి	45
డి	54
ఇ	108
మెట్ట	
ఎఫ్	162
జి	216
హెచ్	324

ఈ చట్టం ఐదుగురు సభ్యులుండే కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోకుండా ఒక్కొక్క సభ్యుడినీ ఒక్కొక్క యూనిట్‌గా తీసుకోవడం వల్ల వేలాది ఎకరాల భూమిని అట్టే పెట్టుకోవడానికి భూస్వాములకు అవకాశం ఏర్పడింది. అంతేగాక ఈ చట్టం అమలు ఆలస్యం అవడం వల్ల భూస్వాములు బినామీ పేర్లతో నమోదు చేయించుకున్నారు. దీనికితోడు మూడో వంతు భూమి పశువుల మేతకు అట్టిపెట్టుకోవచ్చు. దేవాలయ భూములు చెరకు, కాఫీ, తేయాకు, రబ్బరు వంటి పంటలు పండించే భూములు చట్టపరిధిలోకి రాకపోవడం వల్ల వేలాది ఎకరాల భూమి అలాగే మిగిలిపోయింది.

3. 1973 భూ గరిష్ఠ పరిమితి చట్టం

1961వ చట్టం 1973 వరకూ అమలులో ఉంది. అయితే 1961 చట్టంలోని అనేక లోపాల వల్ల సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. అదే కాలంలో హరిత విప్లవం ప్రారంభం కావడంవల్ల వ్యవసాయ సంబంధాల్లో అనేక మార్పులు, సవాళ్లు ఉత్పన్నమయ్యాయి. ఈ సవాళ్లను పరిష్కరించడానికి కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలను సూచించింది. ఈ సూచనలకు అనుగుణంగా శాసనసభ 1972లో ఒక బిల్లును ఆమోదించింది. 1973 జనవరి 1న అది చట్టమయ్యింది. జై ఆంధ్రా ఉద్యమం కారణంగా ఈ చట్టం అమలు వాయిదా పడింది. చివరికి 1975 జనవరి 1 నుంచి అమలులోకి వచ్చింది.

భార్య, భర్త, ముగ్గురు మైనర్ పిల్లలతో మొత్తం ఐదుగురు సభ్యులున్న కుటుంబాన్ని ఒక యూనిట్‌గా ఈ చట్టం పేర్కొంది.మేజర్ అయిన కుమారులను, కుమార్తెలను వివాహితులా, అవివాహితులా అనే దానితో సంబంధం లేకుండా ప్రత్యేక కుటుంబంగా పేర్కొన్నారు. ఐదుగురికి మించిన కుటుంబంలో ఒక్కో సభ్యునికీ 1/5వ వంతు గరిష్ఠ పరిమితిని పెంచుకోవచ్చు. అయితే కుటుంబ కమతానికి రెండు రెట్లకు మించరాదు. భూవినియోగం, పంటలతీరు, సాగునీటి సౌకర్యాలు వంటి అంశాల ఆధారంగా ప్రామాణిక కమతాలను నిర్ణయించారు. ఒక యూనిట్‌కు గరిష్ఠ పరిమితిని నిర్ణయించడానికి మాగాణి భూమిని ఆరు తరగతులుగా, మెట్టను ఐదు తరగతులుగా విభజించారు.



భూ తరగతి గరిష్ఠపరిమిత ఎకరాలు		
మాగాణి	రెండు పంటలు	ఒక్క పంట
ఎ	10	15
బి	12	18
సి	13.5	20
డి	15	22.5
ఇ	16.5	25
ఎఫ్	18	27
మెట్ట		
జి		35
హెచ్		40
ఐ		45
జె		50
కె		54

ఈ చట్టం ద్వారా పొందిన భూమిని 50 శాతం షెడ్యూలు కులాలు షెడ్యూలు తెగలవారికి కేటాయించాలి. మిగిలిన 50 శాతం భూమిలో 2/3 వంతు వెనుకబడిన తరగతులవారికి మిగిన 1/3 వంతు ఇతరులకు పంపిణీ చేయాలి. మిగిలిన భూమిని తేల్చడానికి రెవెన్యూ డివిజన్లలో ల్యాండ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఈ చట్టం పేర్కొంది.

భూమి కేటాయించిన వ్యక్తులు మాగాణికి ఎకరాకు 1500 రూపాయలు, మెట్టకు 375 రూపాయలు వాయిదాల రూపంలో చెల్లించాలి.

మత సంబంధమైన సంస్థలకు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, పరిశోధన సంస్థలను ఈ చట్ట పరిధి నుంచి మినహాయించారు. కాఫీ, తేయాకు, రబ్బరు వంటి పంటలకు చెందిన భూములను ఈ చట్టపరిధి నుంచి మినహాయించారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలకు చెందిన భూములు, భారీనీటి ప్రాజెక్టులు, విద్యుత్ కేంద్రాలు, వంటి నిర్మాణాలకు ప్రభుత్వం స్వాధీనం చేసుకునే భూములకు ఈ చట్టం వర్తించదు.

ఈ చట్టం ఫలితంగా 10,05,902 ఎకరాలు మిగులు భూమిగా తేలింది. ఈ మిగులు భూమిని వ్యవసాయ కూలీలకు, దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన తరగతులకు పంపిణీ చేశారు. పంపిణీ చేయగా మిగిలిన భూమి కోర్టులలో పెండింగ్ కేసుల రూపంలో ఉంది.

ఈ చట్టం కూడా మిగిలిన చట్టాలవలే పూర్తిగా అమలుకు నోచుకోలేదు. చట్టం అమలు చేయడానికి, క్షేత్రస్థాయిలో తగినంత సిబ్బంది లేకపోవడంవల్ల సంపూర్ణంగా అమలుకు నోచుకోలేదు. ఈ చట్టం ద్వారా సేకరించిన భూమి వ్యవసాయ యోగ్యంకాని బీడుభూములే. చట్టంలోని లోపాలను భూస్వాములు తమకు అనువుగా మార్చుకుని బినామీ పేర్లతో మార్చుకుని చట్ట పరిధి నుంచి సులువుగా తప్పించుకున్నారు.

పైన పేర్కొన్న విధంగా అనేక రకాల భూ సంస్కరణ చట్టాలు తీసుకొచ్చినప్పటికీ ఆశించినంతగా ఫలితాలు చేకూరలేదు. తరచుగా న్యాయస్థానాల జోక్యం, అమలులో చిత్తశుద్ధి లోపించడం వంటి కారణాలవల్ల ఈ చట్టాలు సమర్థవంతంగా అమలు కావడంలేదని పేర్కొనాలి. ★

ఉద్యోగాలు

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 1,300 ఖాళీలు

ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)లో 1300 అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్–2/ ఎగ్జిక్యూటివ్ (ఏసీఐఓ–2 (ఈఎక్స్ఈ)) పోస్టుల భర్తీకి భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. దీనిద్వారా అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్–2/ ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్–2017ను నిర్వహించనుంది.

మొత్తం ఖాళీలు : 1300 (అన్‌రిజర్వుడ్–951 + ఓబీసీ 184 + ఎస్సీ–109 + ఎస్టీ–56). ఇందులోనే రిజర్వేషన్ల వారీ ఎక్స్–సర్వీస్‌మెన్ కేటగిరీకి 130 పోస్టులు కేటాయించారు.

నోట్ : వికలాంగులకు పోస్టులు రిజర్వ్ చేయలేదు. కాబట్టి వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.

వేతనం : రూ.9,300–రూ.34,800+ గ్రేడ్ పే రూ.4,200.

అర్హతలు : ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన విద్య ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం అభిలషణీయం.

వయోపరిమితి : 18–27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : రాత పరీక్షలు (టైర్–1, టైర్–2), ఇంటర్వ్యూ.

పరీక్షల విధానం : టైర్–1 రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో ఒక్కో భాగం నుంచి 25 ప్రశ్నల చొప్పున నాలుగు భాగాల నుంచి మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు. తప్పుగా గుర్తించిన సమాధానానికి 0.25 చొప్పున నెగిటివ్ మార్కు ఉంటుంది. ఇందులోని నాలుగు భాగాలు.. జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్/ అనలిటికల్ ఎబిలిటీ, ఇంగ్లీష్ ల్యాంగ్వేజ్. టైర్–1 రాతపరీక్ష వ్యవధి గంట, టైర్–2 రాతపరీక్ష డిస్క్రిప్షన్ విధానంలో ఉంటుంది. ఇందులో ఇచ్చిన అంశాల్లోంచి వ్యాసం(ఎస్సే) రాయాలి. ఇది 30 మార్కులకు, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ అండ్ ప్రెసీస్ రైటింగ్ 20 మార్కులకు .. మొత్తం 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. వ్యవధి గంట. టైర్–1, టైర్–2లో వచ్చిన మార్కుల ఆధారంగా 100 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ మూడింటిలోనూ కనబర్చిన ప్రతిభ ఆధారంగా నియామకం చేపడతారు.

టైర్-1 రాతపరీక్ష కేంద్రాలు (తెలుగు రాష్ట్రాల్లో) : హైదరాబాద్, విజయవాడ.

దరఖాస్తు ఫీజు : రూ.100, ఎస్సీ/ ఎస్టీ/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులకు చివరి తేదీ : సెప్టెంబర్ 2, 2017.

వెబ్‌సైట్ : www.mha.nic.in

డబ్బు బడాబాబులకు.. జబ్బు ప్రజలకా?

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు
- కాలుష్య బాధిత గ్రామాల్లో పర్యటన



నెల్లూరు జిల్లా ఇందుకూరుపేటలో కాలుష్యంతో నిండిపోయిన కాల్వలను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి - ముత్తుకూరు / ఇందుకూరుపేట

పరిశ్రమలు ఏర్పాటుచేసి బడా బాబులు డబ్బులు సంపాదించుకుంటూ.. కాలుష్యాన్ని మాత్రం రైతులకు, ప్రజలకు పంచుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు, ఇందుకూరుపేట మండలాల్లో కాలుష్య బాధిత గ్రామాలను ఆయన ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులను, ప్రజలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆయన ముత్తుకూరు మండలం, నేలటూరు దళితవాడకు వెళ్లారు. అక్కడ బహిరంగ సభలో



సభలో మాట్లాడుతున్న మధు

ప్రసంగించారు. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కాలుష్యానికి గురవుతున్న సైనాపురం, నేలటూరు దళితవాడ, మామిడిపూడి, ముసునూరువారిపాలెం, పిడతాపోలూరు, మండపం, వరకవిపూడి గ్రామాల ప్రజలు ఈ సభకు హాజరయ్యారు. తమను పునరావాస ప్రాంతాలకు తరలించాలని ఆయనకు మొర పెట్టుకున్నారు. కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నామని తమ ఆవేదనను వెళ్లబోసుకున్నారు. మధు మాట్లాడుతూ.. థర్మల్ ప్రాజెక్టులు రాకముందు ఈ మండలాల పరిధిలో సుమారు 110 గ్రామాలు పచ్చని పొలాలతో, గొర్రెలు, బర్రెలతో కళకళలాడేవని తెలిపారు. ఆహ్లాదకరంగా ఉండేదన్నారు. ఎన్‌సిసి, టిపిసిఐఎల్, ఎపిజెన్‌కో ప్రాజెక్టుల యాజమాన్యాలకు కట్టబెట్టేందుకు.. నేలటూరు పంచాయతీ పరిధిలో 14 వందల ఎకరాల భూమి ఉంటే అందులో 1,250 ఎకరాలను ప్రభుత్వం బలవంతంగా సేకరించిందని విమర్శించారు. భూములిచ్చిన వారికి పరిహారం, ఉపాధి చూపిస్తామని హామీ ఇచ్చి నేడు నెరవేర్చలేదన్నారు. దాంతో వారు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఇందుకూరుపేట మండలంలో సుమారు 35 వేల ఎకరాలలో ఆక్వా సాగు ఉందన్నారు. దాంతో వ్యర్థ జలాలను పంటకాల్వల్లో కలుపుతున్నారనీ, ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఇందుకూరు పేట మండలం గ్రామాల్లో పాములవారిపాలెం, జగదేవీపేట ప్రాంతాల్లో పర్యటించారు. రొయ్యల సాగువల్ల విడుదలయ్యే వ్యర్థ జలాలతో చిన్న, సన్నకారు రైతులు నష్టపోతున్నామని అక్కడి ప్రజలు ఆయనకు విన్నవించారు. దాంతో ఆయన మాట్లాడుతూ.. ఆక్వా కంపెనీలు వ్యర్థ జలాలను నిలిపి వేయకపోతే 24న సాయి మెరైన్ హేచరీ, స్టార్, ఫైవ్‌స్టార్ పరిశ్రమలను ముట్టడించి ప్రజల చేత ఆ పైపులను మూయించేస్తామని హెచ్చరించారు.

విజయనగరంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి సమావేశాలు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగరంలో వచ్చే నెల తొమ్మిదో తేదీ నుంచి 11వ తేదీ వరకూ మూడురోజుల పాటు జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాము కోరారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణపై ఈ సమావేశాల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఆదివారం స్థానిక యువజన వసతి గృహంలో ఆహ్వాన సంఘం ఏర్పాటుపై ఎస్ఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు చేస్తోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కార్పొరేట్ శక్తుల చేతుల్లో విద్యారంగాన్ని పెట్టేందుకు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో సెల్ఫ్ ఫైనాన్స్ ఇండిపెండెంట్ స్కూల్ యాక్ట్-2017ను టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ సమావేశాలకు జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు సహకరించాలని కోరారు. అనంతరం 40 మందితో ఆహ్వాన సంఘాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సురేష్ ప్రకటించారు.



విశాఖలో దబోల్కర్‌ను స్మరిస్తూ నినాదాలు చేస్తున్న నాస్తిక వాదులు

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా దబోల్కర్ కృషి మరువలేనిది

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

మహారాష్ట్రలో ఆంధ్ర శ్రద్ధ నిర్మూలన సంస్థ పేరుతో ప్రజలను చైతన్యం చేస్తూ మూఢనమ్మకాల నిర్మూలనకు చట్టం చేయడానికి నరేంద్ర దబోల్కర్ కృషి చేశారని ఎయు విశ్రాంత ప్రొఫెసర్ కెపి.సుబ్బారావు తెలిపారు. భారత నాస్తిక సమాజం ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహారాష్ట్ర సంఘ సంస్కర్త, ప్రముఖ హేతువాది డాక్టర్ దబోల్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ దబోల్కర్‌ను మత ముష్కరులు హత్య చేయడం బాధాకరమన్నారు. ఆయనను హత్య చేసి నాలుగేళ్లవుతున్నా నిందితులందరినీ అరెస్టు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఎయు ప్రొఫెసర్ సి.మంజులత మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి పాటుపడుతున్న హేతువాది, మేధావులు, సైన్స్ ప్రచారకులపై మతోన్మాద దాడులు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతు రుణమాఫీ ఒకే విడతలో చేయండి

31న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల రిత్యా రైతుల రుణమాఫీ మొత్తాన్ని ఒకే విడతలో ఖాతాల్లో జమచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ అమలు, కరువు సహాయక చర్యలను చేపట్టాలని ఈ నెల 31న జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రుణమాఫీకి 8,06,722 మంది రైతులు అర్హులన్నారు. వీరికి రూ.2,72,893 కోట్లు చెల్లించనున్నట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు బాండ్ల రూపంలో చెల్లించినది కేవలం రూ.1400 కోట్లు మాత్రమే అన్నారు. వరుసగా పంటలు దెబ్బతిని అప్పుల్లో కూరుకుపోయిన జిల్లా రైతాంగాన్ని కాపాడేందుకు మిగిలిన రూ.1250 కోట్ల మాఫీ మొత్తాన్ని ఒకే సారి చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండో విడత రుణమాఫీ బాండ్లకి ఇప్పటికీ నగదు రాలేదన్నారు. ఈ సంవత్సరం మార్చిలో అమలు కావాల్సిన మూడో విడత రుణమాఫీ గురించి ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదన్నారు. సకాలంలో రుణమాఫీ సొమ్ము ఇవ్వకుంటే రైతులు మరింత నష్టాల ఊబిలో కూరుకుపోతారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ అనంతపురం జిల్లా కార్యదర్శి జగదీశ్

నదులను అనుసంధానం చేయండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా అభివృద్ధి కోసం గోదావరి, కృష్ణా నదులను పెన్నాకు అనుసంధానం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు వికె.ఆదినారాయణ రెడ్డి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సిపిఐ ఆధ్వర్యంలో అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. 'జిల్లా నీటి వనరులు- సాగు నీరు' అనే అంశంపై వక్తలు ప్రసంగించారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్‌ఎం.బాషా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్, డిసిసి అధ్యక్షులు కోటా సత్యనారాయణ, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కరువు పరిస్థితులను తెలియజేసేందుకు అక్టోబరు 10న అఖిలపక్ష పార్టీల ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసేందుకు వెళ్తున్నామన్నారు. నదీ జలాలతోనే జిల్లాలో శాశ్వత కరువును నిర్మూలించవచ్చని చెప్పారు. ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అభివృద్ధిని కాంక్షించే అన్ని పార్టీల నాయకులు వారి జెండాలు, అజెండాలను పక్కన పెట్టి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

'వంశధార' నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం

పాలకొండ ఆర్‌డిఒ రెడ్డి గున్నయ్య



హిరమండలంలో తహశీల్దార్‌కు సమస్యలను విన్నవిస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- హిరమండలం (శ్రీకాకుళం)

వంశధార జలాశయంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని శ్రీకాకుళం జిల్లా పాలకొండ ఆర్‌డిఒ రెడ్డి గున్నయ్య అన్నారు. హిరమండలం తహశీల్దార్ కార్యాలయంలో బ్యారేజీ సెంటర్ నిర్వాసితులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. దళారుల మాటలు నమ్మి నిర్వాసితులెవరూ మోసపోవద్దని సూచించారు. బ్యారేజీ సెంటర్‌లోని నిర్వాసితులకు ఇళ్లతో పాటు దుకాణాలకు స్థలాలు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలూ వద్దన్నారు. దీనిపై నిర్వాసితులు మాట్లాడుతూ తాము ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదన్నారు. తమకు ప్రభుత్వపరంగా రావాల్సినవి త్వరితగతిన అందిస్తే గ్రామాన్ని వెంటనే ఖాళీ చేస్తామని స్పష్టం చేశారు. జలాశయ నిర్మాణంతో ఉపాధి కోల్పోయామని, అందరికీ వ్యాపార దుకాణాల కోసం సముదాయాలను కేటాయించాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ ఎం.కాశీప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకుంటే ఊరుకోం

బస్సుయాత్రలో ముప్పాళ్ల నాగేశ్వరరావు



విశాఖ సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, తగరపువలస, విశాఖ

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకుంటే ఊరుకోబోమని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చైతన్య యాత్ర పేరుతో చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల బస్సు యాత్ర విశాఖ జిల్లా పెందుర్తి, ఆనందపురం, తగరపువలస మీదుగా ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు చేరుకుంది. తగరపువలసలోని చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పేదల కష్టార్జితాన్ని అగ్రిగోల్డ్ మింగేసిందన్నారు. ఇటీవల కాలంలో 142 మంది బాధితులు కంపెనీ వైఖరి వల్ల ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యానికి టిడిపి ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నా స్పందించకపోవడం దారుణమన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సభలను జయప్రదం చేయాలి

రాష్ట్ర అధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-నెల్లూరుసిటీ

భవన నిర్మాణ కార్మికుల దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈనెల 28 నుంచి 30 వరకు విజయవాడలో జరిగే సభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసే యోచనలో ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రూ.13 వందల కోట్ల నిధులు ఉన్నాయని చెప్పారు. వాటిని అనవసరమైన వాటికి ఖర్చు చేస్తున్నారన్నారు. ఆ నిధుల నుంచి కార్మికులకు నెలకు రూ.2 వేల పెన్షన్, ఇంటికి రూ.5 లక్షలు, వారి పిల్లల చదువుల కోసం రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మూలం రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గురవయ్య, ఎస్.కె.చాన్‌బాషా, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసులు, ప్రసాద్, నాయకులు పి.సూర్యనారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.

ఒబిసి సాధనకు 15న విశాఖలో బహిరంగ సభ

శిష్ట కరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

ఒబిసి సాధనకు శిష్ట కరణాలు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముందని శిష్ట కరణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. అందులో భాగంగా వచ్చేనెల 15న విశాఖలోని శిల్పారామంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని బిఇటి పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన ఆ సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం శిష్ట కరణాలను బిసి జాబితాలో చేర్చిన తర్వాత అనేకమంది పేదలు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఒబిసి జాబితాలో చేర్చితే భావితరాల వారు మరిన్ని ప్రయోజనాలు పొందేందుకు అర్హులవుతారని తెలిపారు. తొలుత శిష్ట కరణ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.వి.జగన్నాథరావు పట్నాయక్ మృతికి సంతాపం తెలిపారు. పట్నాయక్ చేసిన సేవలపై ప్రచురించిన చైతన్య దీపిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మల్లేశ్వరరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిఒ 64ను రద్దు చేయాలని వ్యవసాయ కళాశాల విద్యార్థుల వినూత్న ధర్నా

ప్రజాశక్తి - ఎస్వీయూ క్యాంపస్

ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 64ను రద్దు చేయాలని కోరుతూ ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఒంటికాలుపై నిలబడి వినూత్న రీతిలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పూర్ణ, కార్తీక్ మాట్లాడుతూ.. జీవో నం. 16ని అమైండ్‌మెంట్ 1తో యధాతథంగా అమలు చేయాలన్నారు. పొరుగు రాష్ట్రాలకు అవసరమైన ఐసిఎఆర్ అక్రిడేషన్ ఆంధ్రప్రదేశ్‌కు అక్కర్లేదా? అని ప్రశ్నించారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేలా ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏదేదో చేసేస్తున్నట్లు ఆర్భాటం చేస్తోందే తప్ప నిజంగా తమకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇతర రాష్ట్రాలలో వ్యవసాయ కోర్సులు చేసిన వారికి ఇక్కడ ఉద్యోగాల్లో పెద్దపీట వేయడం శోచనీయమని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖలో ఎంతో మంది నకిలీ ధృవపత్రాలను చూపించి ఉద్యోగాలను పొందారని, అటువంటి వారిని వెంటనే విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీవో నంబర్ 64ను రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోర్టుసిటీగా కాకినాడ

టిడిపి సీనియర్ ఎంఎల్‌ఎ గోరంట్ల

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడను పోర్టుసిటీగా అభివృద్ధిపర్చేందుకు ప్రణాళికలు రూపొందించామని టిడిపి సీనియర్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సిని ప్రకటించామని చెప్పారు. కన్సల్టెంట్ స్కేల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రూ.12,500 కనీస వేతనం ఇస్తున్నామన్నారు. రాబోయే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో టిడిపి మేయర్ పీఠం కైవసం చేసుకోవడం ఖాయమని చెప్పారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ట్రావిస్ సిన్నయ్య
2. నికోలవ్ కుదషవ్
3. రాఫెల్ నాదెల్
4. ఉత్కల్ కళింగ
5. అపాచి ఎహెచ్-64-ఇ

బాలుడి మృతదేహంతో ధర్నా



బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా చేస్తున్న విజయవాడలోని న్యూఆర్‌ఆర్ పేట వాసులు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ)

విజయవాడలోని 52వ డివిజన్ న్యూరాజ రాజేశ్వరీపేటలో జ్వరంతో చనిపోయిన కుంటా యశ్వంత్(4) కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ న్యూఆర్‌ఆర్‌పేట వాసులు సిపిఎం ఆధ్వర్యంలో బాలుడి మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. జ్వరంతో బాలుడు చనిపోయినా కనీసం శానిటరీ ఇన్‌స్పెక్టర్ కూడా రాకపోవడంతో నగరపాలక సంస్థ అధికారుల తీరుపై, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము నివాసముంటున్న ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉందని, దోమలు కుట్టడం వల్ల వచ్చిన జ్వరంతోనే చనిపోయాడని బాలుడి తల్లిదండ్రులు సోనియా, ధనుంజయ కన్నీరు మున్నీరయ్యారు. యశ్వంత్ మృతదేహాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు న్యూఆర్‌ఆర్ పేటలోని అతని నివాసం వద్ద సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. యశ్వంత్ మరణం ప్రభుత్వ హత్యేనన్నారు. బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అలుపెరగని పోరాట నాయకుడు పాండే


ఆరో వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

దేశంలోని అన్ని రంగాల కార్మికుల అభ్యున్నతి కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం సల్పిన నాయకుడు మధుకర్ కాశీనాథ్ పాండే అని వక్తలు కొనియాడారు. మధుకర్ కాశీనాథ్ పాండే ఆరో వర్ధంతి సందర్భంగా సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. బిఆర్‌టిఎస్ రోడ్డులోని సిఐటియు నగర కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పాండే 70 ఏళ్లపాటు ట్రేడ్ యూనియన్‌లో పని చేశారని తెలిపారు. సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించి కార్మికుల శ్రేయస్సు కోసం తపించారని కొనియాడారు. దేశంలోని ఉక్కు పరిశ్రమలు, బొగ్గు గనుల్లో పని చేసే కార్మికులకు ప్రత్యేకంగా ఫెడరేషన్లు ఉండేవని తెలిపారు. ఆయా రంగాల్లోని కార్మికుల సమస్యలు వచ్చినప్పుడు మేనేజ్‌మెంట్‌తో చర్చించటానికి ఇతర సంఘాలూ పాండేని ఆహ్వానించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కార్మికుల హక్కులను కాపాడుకోవటం కోసం నవంబరు 9, 10, 11 తేదీల్లో ఢిల్లీలో కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించనున్నాయని చెప్పారు.

దేశంలో పేట్రేగిపోతున్న మతోన్మాదం

- ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలి
- బహిరంగ సభలో ఎఐఎఫ్‌టియు(ఎన్) జాతీయ అధ్యక్షులు గుర్రం విజయ్‌కుమార్ పిలుపు
- ఒంగోలులో తరిమెల నాగిరెడ్డి భవనం ప్రారంభం



ఒంగోలులో తరిమెల నాగిరెడ్డి భవనాన్ని ప్రారంభిస్తున్న రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

దేశంలో మతోన్మాదం పేట్రేగిపోతోందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యంగా పోరాడాలని ఎఐఎఫ్‌టియు(ఎన్) జాతీయ అధ్యక్షులు గుర్రం విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఈమనిపాలెంలో నిర్మించిన తరిమెల నాగిరెడ్డి భవనాన్ని రైతుకూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా భవనం ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహించారు. రైతుకూలి సంఘం జిల్లా కోశాధికారి డివిఎన్ స్వామి అధ్యక్షతన జరిగిన సభలో గుర్రం విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభలో ఝాన్సీ మాట్లాడుతూ.. చట్టసభలను కూడా పోరాట వేదికలుగా ఉపయోగించుకున్న మార్క్సిస్టు, లెనినిస్టు మేధావిగా నాగిరెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య మాట్లాడుతూ.. నాగిరెడ్డి భవనం ప్రజా ఉద్యమాలకు కేంద్రం కావాలన్నారు. దేశంలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేవారిని బిజెపి మతోన్మాదులు హత్య చేస్తున్నారని దుయ్యబట్టారు. సిపిఐ నగర కార్యదర్శి యు.ప్రకాశరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు, జగన్‌లు మోడీకి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని దుయ్యబట్టారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భూస్వామ్యం, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద విధానం ఈ మూడు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కోటేశ్వరరావు, రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి లలితకుమారి, జెడ్‌పి చైర్మన్ ఈదర హరిబాబు, జిల్లా అభివృద్ధి కమిటి అధ్యక్షులు చుండూరి రంగారావు, సుపరిపాలన వేదిక నాయకులు టి.గోపాలరెడ్డి, షంషేర్ అహ్మద్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే కారణమా?

- నలుగురు అధికారులపై వేటు
- ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదం



న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లో శనివారం జరిగిన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి సంబంధించి సీనియర్ డివిజనల్ ఇంజనీర్‌తో సహా నలుగు అధికారులు ఆదివారం సస్పెండయ్యారు. కాగా ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య 22కు చేరుకుంది. ప్రమాదం నేపథ్యంలో ఉత్తర రైల్వేకు చెందిన జనరల్ మేనేజర్ ఆర్‌కె కుల్ శ్రేష్ఠ, రైల్వే బోర్డు మెంబర్ (ఇంజనీరింగ్) ఆదిత్య మిట్టల్, డివిజనల్ రైల్వే మేనేజర్ (ఢిల్లీ) ఆర్ఎన్ సింగ్‌లపై రైల్వేబోర్డు వేటు వేసింది. దీంతో పాటు ఉత్తర రైల్వేలకు చెందిన చీఫ్ ట్రాక్ ఇంజనీర్‌ను బదిలీ చేసింది.

ఉత్కల్ ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమా?!

ఉత్తరప్రదేశ్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని విశ్లేషకులు అభిప్రాయ పడుతుండగా అధికార వర్గాలు కూడా అదే భావనలో ఉన్నాయి. ఆ మార్గంలోని రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు జరుగుతున్నాయని, దానిని గుర్తించక పోవడం వలనే ప్రమాదం జరిగిందని వారు పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోనే ఉన్న ఖతౌలి స్టేషన్ మాస్టర్‌ను దీనిపై ప్రశ్నించగా ట్రాక్‌పై మరమ్మతులు జరగుతున్న విషయం తనకు తెలియదని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి పూరి-హరిద్వార్ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన సంగతి తెలిసిందే. ప్రమాదం జరిగే సమయానికి రైలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోంది.. తాము సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించినప్పుడు అక్కడ మరమ్మతులకు ఉపయోగించే పరికరాలు కనిపించాయని ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో రైల్వే బోర్డు ట్రాఫిక్ విభాగం సభ్యులు మహ్మద్ జంషెడ్ తెలిపారు అక్కడ ఒక ఆడియో క్లిప్పు కూడా లభించిందని, అందులోని సంభాషణపై దర్యాప్తు జరపాల్సి ఉందని ఆయన చెప్పారు.

రైల్వే ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు మాట్లాడుతూ మరమ్మతుల విషయమై సంబంధిత స్టేషన్ అధికారులకు సమాచారమిచ్చామని తెలిపారు అ ట్రాక్‌పై 20 నిమిషాలపాటు రైళ్ళు నడవకుండా చూడాలని వారిని కోరినట్లు తెలిపారు. మరమ్మతులు ప్రారంభించడానికి ముందు అటుగా వెళ్ళిన రెండు రైళ్ళు చాలా నిదానంగా వెళ్ళాయన్నారు. ఖతోలి స్టేషన్ సూపరింటెండెంట్ రాజేందర్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ సాంకేతిక సమస్యల గురించి తమకు సమాచారం లేదన్నారు. రైల్వే మంత్రి సురేష్ ప్రభు దీనిపై దర్యాప్తుకు ఆదేశించినట్లు చెప్పారు.

ఐదేళ్ళలో 586 రైలు ప్రమాదాలు

అధికారిక గణాంకాల మేరకు గడిచిన ఐదేళ్ళలో జరిగిన 586 రైలు ప్రమాదాలలో 53 శాతం ప్రమాదాలు బోగీలు పట్టాలు తప్పడం వల్ల జరిగినవేనని అధికారులు తెలిపారు. భద్రతా చర్యలు తీసుకుంటున్నామని రైల్వే అధికారులు ఎంతగా చెప్పినప్పటికీ ప్రమాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. 2014 నవంబరు నుంచి చూస్తే 20 రైలు ప్రమాదాలు జరిగాయి. వీటిల్లో స్వల్ప ప్రమాదాలే ఎక్కువ. అత్యంద హృదయ విదారకమైన ప్రమాదం నవంబరు 20, 2016న కాన్పుర్ సమీపంలో జరిగింది. ఇండోర్-పాట్నా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన సంఘటనలో 150 మంది మృతి చెందగా 150 మందికి పైగా గాయాలయ్యాయి.

మరుగుదొడ్డి లేకపోతే విద్యుత్ కోత!

రాజస్థాన్ విద్యుత్తు శాఖ అధికారుల అత్యుత్సాహం

చాలా కఠినంగా వ్యవహరించారు : కలెక్టర్

జైపూర్ : బహిరంగ మల విసర్జన నిర్మూలన కార్యక్రమంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించిన ఘటన రాజస్థాన్‌లోని ఓ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. 'అడగామన మిషన్' కార్యక్రమంలో భాగంగా భిల్వారా జిల్లాలోని గంగితల గ్రామానికి వెళ్లిన అధికారులు మరుగుదొడ్డి లేని ఇళ్లకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తామని గ్రామస్తులను హెచ్చరించారు. 15 రోజుల్లోగా మరుగుదొడ్డి నిర్మించాలని, లేనియెడల చెప్పింది చేస్తామని పేర్కొన్నారు. అయితే గ్రామస్తులు ఈ హెచ్చరికలపై ఆందోళన చేపట్టడంతో ఈ విషయం కలెక్టర్ వద్దకు చేరింది. దీనిపై తక్షణమే స్పందించిన బిల్వారా కలెక్టర్ ముక్తానంద్ అగర్వాల్ విద్యుత్తు శాఖ అధికారుల ఆదేశాలను రద్దు చేశారు. దీనిపై వివరణ కోరగా సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్(ఎస్‌డిఎం) కర్తార్ సింగ్ ఆశీతల మేరకే గ్రామస్తులను హెచ్చరించినట్లు అధికారులు వివరణ ఇచ్చారు. 15 రోజుల గుడువు అనంతరం విద్యుత్తు సరఫరా నిలిపివేయాలని డిస్కమ్ అధికారులను కర్తార్ సింగ్ ఆదేశించినట్లుగా విచారణలో వెలుగులోకి వచ్చింది. పలుమార్లు సూచనలు, హెచ్చరికలు, జరిమానాలు విధించినప్పటికీ కేవలం 19 శాతం గ్రామస్తులు మాత్రమే మరుగుదొడ్లు నిర్మించారని, అందుచేతనే విద్యుత్తు సరఫరా నిలిపివేయాలని ఆదేశించామని కర్తార్ సింగ్ పేర్కొన్నారు. అయితే జిల్లా సీనియర్ అధికారులు రంగంలోకి దిగడంతో ఆయన వెనక్కి తగ్గారు. అడగామన మిషన్ కార్యక్రమంలో భాగంగా గంగితల గ్రామంలో పర్యటిస్తున్న కర్తార్ సింగ్ దృష్టిలో బహిరంగంగా మలవిసర్జన చేస్తూ ఆరుగురు గ్రామస్తులు పడ్డారు. అయితే భవిష్యత్తులో మరెప్పుడూ అలా చేయమని హామీ ఇవ్వాలంటూ ఆయన ఆ ఆరుగురిపై ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే అందుకు వారు అన్యమనస్కంగా అంగీకరించడంతో రూ.10 వేల విలువైన బెయిల్ ఒప్పంద పత్రంపై బలవంతంగా సంతకాలు తీసుకుని వారిని విడుదల చేశారు. ఈ ఘటన తరువాతనే విద్యుత్తు సరఫరా నిలిపివేయాలంటూ డిస్కమ్ ఎస్‌డిఎం ఆదేశించినట్లు మరికొంతమంది పేర్కొన్నారు.

ఇక ఆన్‌లైన్‌లోనే జెఇఇ పరీక్ష

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మకమైన ఐఐటి (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో ప్రవేశాల కోసం నిర్వహించే జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలు వచ్చే ఏడాది నుంచి పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండనున్నాయి. పరీక్షలు నిర్వహించే జాయింట్ అడ్మిషన్ బోర్డు ఆదివారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఐఐటి కళాశాలల్లో ప్రవేశాల కోసం పోటీ పడే విద్యార్థులు ముందుగా జెఇఇ మెయిన్స్ పరీక్షలు రాయాలి. వారిలో క్వాలిఫై అయిన వారికి అనంతరం జెఇఇ అడ్వాన్స్ పరీక్షలు జరుగుతాయి. ఇప్పటి వరకు మెయిన్ పరీక్ష ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండింటిలో నిర్వహిస్తున్నారు. అయితే జెఇఇ అడ్వాన్స్ పరీక్షలు కూడా ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంది. ఏటా 13 లక్షల మంది విద్యార్థులు మెయిన్స్ పరీక్షలు రాస్తుంటారు. వీరిలో ఆన్‌లైన్‌లో పరీక్షలు రాసేవారి సంఖ్య 10 శాతం కంటే తక్కువగా ఉంటుంది. వీరిలో రెండు లక్షల మంది అడ్వాన్స్‌డ్ పరీక్ష కోసం అర్హతలు సాధిస్తారు. తాజా నిర్ణయంతో అందరు విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే పరీక్ష రాయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించడం, పారదర్శకతను పెంచడంతో పాటు పేపర్ లీకేజీకి ఆస్కారం ఉండదని మానవ వనరుల శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవగాహన కోసం మూడు రోజుల ముందుగానే నమూనా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

కేంద్రంతో ఒడిశా 'హిందీ' లడాయి

కేంద్ర మంత్రి హిందీ లేఖకు ఒరియాలో జవాబు

న్యూఢిల్లీ: బలవంతంగా హిందీ రుద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న యత్నంపై ఒడిశాలో మరోసారి వ్యతిరేకత వ్యక్తమైంది. కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమార్ పూర్తిగా హిందీలో రాసిన లేఖకు బిజెడి లోక్‌సభ ఎంపీ తథాగత సత్పతి ఒడియా భాషలో ఇచ్చిన జవాబు మరోసారి హిందీ వ్యతిరేక ఉద్యమానికి ఆజ్యం పోసింది. జిల్లా స్థాయిలో నిర్వహించిన 'భారత్2022' కార్యక్రమానికి సత్పతిని ఆహ్వానిస్తూ ఆగస్టు 11న నరేంద్ర సింగ్ తోమార్ లేఖ రాశారు. అయితే అది పూర్తిగా హిందీలో ఉండటంతో "నాకు హిందీ రాదు" అని జవాబిస్తూ సత్పతి ఒడియాలో లేఖ రాశారు. ఆ తరువాతి రోజు కేంద్ర మంత్రి పంపించిన లేఖను ట్విట్టర్‌లో పోస్టు చేశారు. అనంతరం "నాకు హిందీ రాకపోవడంతో ఈ లేఖ సారాంశమేంటో నాకు ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు" అని శుక్రవారం ట్వీట్ చేశారు. "హిందీయేతర భాషలు మాట్లాడేవారిపై కేంద్ర మంత్రులు ఎందుకు బలవంతంగా హిందీని రుద్దుతున్నారు? అధికార భాషల నిబంధనలను అనుసరించి మా రాష్ట్రం 'సి' కేటగిరీలో ఉంది కాబట్టి దయచేసి ఒడియా లేదా ఇంగ్లీషు భాషలో లేఖలు పంపించండి" అని మరో ట్వీట్ చేశారు. ఇటీవల కర్ణాటక, తమిళనాడులో కూడా హిందీ వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే. డిఎంకె కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ కేంద్ర ప్రభుత్వం తమపై హిందీని బలవంతంగా రుద్దుతోందంటూ విమర్శించిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్రం స్పందిస్తూ అటువంటి ఉద్దేశం లేదని వివరణ ఇచ్చిన కొద్ది రోజుల్లోనే ఒడిశాలో మరోసారి హిందీ వివాదం తెరపైకి రావడం విశేషం.

నేడు బిజెపి ముఖ్యమంత్రుల సమావేశం



న్యూఢిల్లీ : బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని నరేంద్రమోడీలు సోమవారం సమావేశం కానున్నారు. 13 మంది ముఖ్యమంత్రులు, ఆరుగురు ఉప ముఖ్యమంత్రులు పలువురు కేబినేట్ మంత్రులు ఈ సమావేశానికి హాజరుకానున్నారని ఆ పార్టీ ముఖ్యనేతలు ప్రకటించారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది మూడో ముఖ్యమంత్రుల సమావేశం కాగా బీహార్‌లో జెడి(యు)ను కలుపుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సమావేశం. కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడం, రాష్ట్రాల్లో అభివృద్ధి ప్రధాన ఎజెండాగా చర్చించనున్నారు. 2019 ఎన్నికలకు అమిత్ షా ప్రణాళిక సిద్ధం చేసిన తర్వాత ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2014 ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉండి జారవిడుచుకున్న 120 స్థానాల్లో విజయాలపై కూడా చర్చించనున్నట్లు బిజెపి వర్గాలు తెలిపాయి. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అమలు చేస్తున్న పలు పథకాలపై ఈ సమావేశంలో వివరించనున్నారు.

దద్దరిల్లిన ఉత్తర బెంగాల్

24 గంటల్లో మూడు బాంబు పేలుళ్లు



కోల్‌కతా : ఉత్తర బెంగాల్ వరస బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. 24 గంటల వ్యవధిలోనే మూడు బాంబు పేలుళ్లు సంభవించాయి. ముందుగా డార్జిలింగ్‌లో బాంబు పేలుడు జరగ్గా, తరువాత రెండు పేలుళ్లు కలిమ్‌పాంగ్ పోలీస్ స్టేషన్ ముందు జరిగాయి. కేవలం గంటలోపే ఈ రెండు పేలుళ్లు జరిగాయి. తొలి పేలుడు శనివారం రాత్రి 10.30 గంటలకు, రెండో సంఘటన 11.30 గంటలకు సంభవించింది. ఈ పేలుళ్లలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రంగా గాయలయ్యాయి. మృతి చెందిన వ్యక్తిని రాకేష్ రౌత్ అనే పౌర స్వచ్ఛంద సంస్థ కార్యకర్తగా గుర్తించారు. ఇద్దరు పోలీసు అధికారులు కూడా ఈ పేలుడులో గాయపడ్డారు. బాంబుల పేలుడు తీవ్రత ఎక్కువగా ఉందని, ఈ ప్రాంతంలో అలజడిని సృష్టించడానికే ఈ పేలుళ్లు జరిపివుంటారని పోలీసు అధికారులు తెలిపారు. డార్జిలింగ్‌లో జరిగిన బాంబు పేలుడు ఉదయం 12.50 గంటల ప్రాంతంలో చౌక్‌బజార్‌లో జరిగింది. 'ఇది చాలా తీవ్రమైన పేలుడు. పేలుడు పదార్థాలు 30 నుంచి 40 మీటర్ల దూరంలో లభించాయి' అని పోలీసులు తెలిపారు. ఈ పేలుడుపై సదర్ పోలీస్ స్టేషన్‌లో గూర్ఖా జనముక్తి మోర్చా (జిజెఎం) అధినేత బిమాల్ గురుంగ్‌తో సహా అనేక మంది నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే గుర్ఖాలాండ్‌కు అనుకూలంగా లేని వ్యక్తులే ఈ బాంబు దాడులు జరిపారని జిజెఎం నేతలు ఆరోపిస్తున్నారు.

బీహార్‌లో వరద బీభత్సం

పాట్నా : బీహార్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. వరదల కారణంగా రాష్ట్రంలో శనివారం నాటికి 202 మంది మృతిచెందారు. 18 జిల్లాల్లో 1.21 కోట్ల మందికిపైగా వరద ప్రభావానికి గురయ్యారు. 4.22 లక్షల మంది ప్రజలను 1,336 పునరావస శిబిరాలకు తరలించారు. కేంద్రానికి చెందిన 28 సహాయక బృందాలు, రాష్ట్రానికి చెందిన 16 సహాయక బృందాలు, 2,228 మంది సైనిక సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి.

పోలీసులపై చెయ్యి చేసుకున్న సైనికులు

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఇద్దరు పోలీసులను సైనికులు కొట్టిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఒక పౌరుడ్ని సైనికులు వేధిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన సైనికులు వారిపై చెయ్యి చేసుకున్నారు. సైనికులు ఒక పౌరుడికి చెందిన మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్న సమయంలో అతనిని వదిలి పెట్టాలని పోలీసులు కోరారు. ఇది నచ్చని వారు దాడికి దిగినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సైనికుల దాడిలో ఒక పోలీసుకు గాయలయ్యాయి. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే సీనియర్ పోలీసు అధికారులు ఈ సంఘటనను తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నించారు. సైనికులకు, పోలీసులకు మధ్య స్వల్ప ఘర్షణ మాత్రమే జరిగిందని, చెయ్యి చేసుకోవడం లాంటి సంఘటనలు జరగలేదని వారు తెలిపారు.

గోరఖ్‌పూర్ విషాదం ప్రభుత్వ తప్పిదమే : రాహుల్

కప్పిపుచ్చుకునేందుకు యత్నించొద్దని వ్యాఖ్య



లక్నో: గోరఖ్‌పూర్ విషాదానికి ప్రభుత్వ తప్పిదమే ప్రధాన కారణమని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. బిఆర్‌డి ఆసుపత్రిలో వరుసగా చిన్నారుల మరణాలకు దారి తీసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించొద్దని యోగి ప్రభుత్వానికి సూచించారు. గోరఖ్‌పూర్‌లో శనివారం పర్యటించిన రాహుల్ గాంధీ బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ "నేను కలిసిన వాళ్లలో ఎక్కువమంది ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరతతోనే పిల్లలు మరణించారని చెప్పారు. చావుబతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్న పిల్లలకి అంబూ బ్యాగ్స్‌తో కొన్ని గంటలపాటు ఆక్సిజన్‌ను అందించామని మరికొందరు చెప్పారు. దీన్ని బట్టి ప్రభుత్వమే ఈ విషాదాన్ని సృష్టించినట్లు స్పష్టమౌతోంది" అని తెలిపారు. బిఆర్‌డి వైద్య కళాశాల ఆసుపత్రిని ఇటీవల పర్యటించిన నేపథ్యంలో అక్కడ సౌకర్యాలను మెరుగుపర్చాలని మోడీకి మీడియా ద్వారా సందేశం పంపించామని, అయితే ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని రాహుల్ విమర్శించారు. "మోడీజీ ఎప్పుడూ నవభారత నిర్మాణం గురించి మాట్లాడుతారు. కానీ ఇటువంటి భారత్ మాకొద్దు. పేద పిల్లలకు సైతం అద్భుతమైన వైద్యం అందించి, వాళ్ల తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం నింపే ఆసుపత్రులున్న దేశం కావాలి" అని వ్యాఖ్యానించారు. ఒక్క బిఆర్‌డి ఆసుపత్రిలోనే గత పది రోజుల్లో 71 మంది చిన్నారులు మరణించిన సంగతి తెలిసిందే.

అసమానతలపై పోరులో వెనుకబడిన దక్షిణాసియా

తాజా అధ్యయనంలో వెల్లడి

ముంబయి: సామాజిక అసమానతల నిర్మూలనకోసం జరిగే పోరాటంలో దక్షిణాసియా దేశాలు అత్యంత వెనుకబాటులో వున్నాయని తాజా అధ్యయనంలో వెల్లడయింది. కమిట్‌మెంట్ టు రెడ్యూస్ ఇనీక్వాలిటీ ఇండెక్స్ (సిఆర్ఐ ఇండెక్స్) అనే సంస్థ దాదాపు 152 దేశాలలో నిర్వహించిన ఈ అధ్యయనంలో దక్షిణాసియా దేశాలు అట్టడుగు స్థానంలో నిలిచాయి. దక్షిణాసియాలోని ఎనిమిది దేశాలలో ఆరు దేశాలకు ఈ సర్వేలో అట్టడుగు స్థాయి నుండి 20 స్థానాలు దక్కాయి. ఇది అత్యంత దురదృష్టకరమైన అంశమని ముఖ్యంగా ప్రపంచ జనాభాలో ఐదో వంతు మంది నివశిస్తున్న దక్షిణాసియా దేశాలలో పేదరికంపై పోరు కనిష్ట స్థాయిలో వుందని సిఆర్ఐ తన సర్వే నివేదికలో వివరించింది. అసమానతలతో తగ్గింపునకు ముఖ్యంగా పేదరిక నిర్మూలన, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాల సాధన అవసరమని ఈ నివేదిక స్పష్టం చేసింది. అసమానతల నిర్మూలనలో భారత్ స్థానం ఈ జాబితాలో అట్టడుగు 20 దేశాలలో చోటు చేసుకోవటం అత్యంత విచారకరమని, భారత్‌లో అసమానతలను తొలగిస్తే అత్యధిక ప్రయోజనాలుంటాయని ఈ నివేదిక వివరించింది. ఈ అధ్యయనంలో పాల్గొన్న ఆక్స్‌ఫామ్ సిబ్బంది రూపొందించిన అంచనాల ప్రకారం భారత్ కనీసం మూడో వంతు అసమానతలను నిర్మూలిస్తే 17 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడతారని తెలుస్తోంది. అభివృద్ధి కోసం భారత్ చేపడుతున్న చర్యలలోని బలహీనత దాని విధానాల రూపకల్పన, అమలు స్థాయిలోనే బయటపడు తున్నదని సిఆర్ఐ ఈ నివేదికలో వివరించింది. భారత్‌లో విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రతా రంగాలలో ప్రభుత్వ వ్యయం అత్యంత తక్కువ స్థాయిలో వుందని వెల్లడించింది. భారత్‌లో పన్ను విధానాన్ని పరిశీలిస్తే ఇది పత్రాలపై అత్యంత ప్రగతి శీలకంగా కన్పించినప్పటికీ, అమలులో అంత స్థాయిలో పన్ను వసూళ్లు రావటం లేదని వివరించింది. ఇక కార్మిక రంగానికి సంబంధించి అధికశాతం మంది కార్మికులు ఇంకా వ్యవసాయ, అసంఘటిత రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారని, ఇక్కడ సంఘటిత రంగంలో కార్మికుల సంఖ్య అత్యంత తక్కువగా వుందని తెలిపింది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 152 దేశాలలో సిఆర్ఐ నిర్వహించిన ఈ అధ్యయనంలో భారత్‌కు 132వ స్థానం దక్కటం గమనార్హం. నేపాల్, మాల్దీవులు తప్ప దక్షిణాసియాలోని ఇతర దేశాలన్నింటిలో పరిస్థితి ఇంతకన్నా ఘోరంగా వుందని సిఆర్ఐ నివేదిక తెలిపింది.

టి-90 యుద్ధ ట్యాంకుల ఆధునీకరణ

న్యూఢిల్లీ : రష్యా రూపొందించిన టి-90 యుద్ధ ట్యాంకులకు మరింత పదును పెట్టే పనిలో భారత సైన్యం నిమగ్నమైంది. తన దాడుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో భాగంగా టి-90 యుద్ధ ట్యాంకులకు మూడో తరం (థర్డ్ జనరేషన్) మిస్సైల్ వ్యవస్థను అదనంగా చేర్చి మరింత ఆధునీకరణ చేపట్టే పనిలో పడింది. ప్రస్తుతం టి-90 యుద్ధ ట్యాంకులు ఐఎన్‌విఎఆర్ మిస్సైల్ వ్యవస్థను కలిగి ఉన్నాయి. అయితే దీని స్థానంలో థర్డ్ జనరేషన్ మిస్సైల్ వ్యవస్థను యుద్ధ ట్యాంకులకు జత చేసే ప్రయత్నాన్ని చేపట్టినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. యుద్ధ ట్యాంకులకు సమకూరుస్తున్న థర్డ్ జనరేషన్ మిస్సైల్ వ్యవస్థ పరిధి (డెప్త్ ఆఫ్ పెనిట్రేషన్(డిఓపి)) 800 నుంచి 850 మిల్లీమీటర్ల వరకు ఉంటుంది. పగలు గాని, రాత్రి గాని 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఇది ఛేదించగలుగుతుంది. అంతేకాకుండా టి-90 యుద్ధ ట్యాంకులకు మోడ్యులర్ ఇంజన్‌ను ఏర్పాటు చేసే మరో ప్రాజెక్టుపై కూడా సైన్యం పనిచేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.



అమెరికాలో నేడు సూర్యగ్రహణం

99 ఏళ్ల తర్వాత తొలిసారి



వాషింగ్టన్: అమెరికా వినీలా కాశం నేడు ఓ అద్భుతానికి వేదిక కానుంది. 99 ఏళ్ల తర్వాత అమెరికా భూభాగంపై సంపూర్ణ సూర్య గ్రహణం కనిపించ నుంది. దీంతో శాస్త్రవేత్తలు కొత్త పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల 46 నిమిషాలకు(భారత కాలమాన ప్రకారం రాత్రి తొమ్మిది గంటల 16 నిమిషాలకు) పసిఫిక్ సముద్రంలో మొదలుకుని సాయంత్రం ఆరు గంటల 48 నిమిషాల వరకూ(అర్థరాత్రి 12 గంటల 52 నిమిషాలు) వరకూ సుమారు 2 గంటల 44 నిమిషాల పాటు గ్రహణం ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. అమెరికా భూభాగంలో ఒరెగాన్ నుంచి వికర్ణంగా ఉండే ప్రాంతాల మీదగా ఛార్లెస్‌టన్, దక్షిణ కరోలినా వరకూ సంపూర్ణ గ్రహణం కనిపించనుందని అధికారులు వెల్లడించారు. మరోవైపు కెనడా, మధ్య అమెరికా, దక్షిణ అమెరికాలోని ఉత్తర భాగం ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణం ఏర్పడనుందని పేర్కొన్నారు.

చివరిసారిగా 1918లో అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడిందనీ, మళ్లీ 2034లో మరోసారి ఏర్పడనుందని చెప్పారు. ఈ గ్రహణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు నాసా వెల్లడించింది. దీని కోసం భారీగా సాంకేతిక పరికరాలను, బెలూన్లు, అంతరిక్షనౌకలను ఏర్పాటుచేసింది. మరోవైపు గ్రహణం సందర్భంలో అక్వేరియంలోని జలచరాలు, ప్రత్యేక ప్రాంతాల్లోని జంతువులు, వస్తువుల్లో సంభవించే మార్పులపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయనున్నారు. దీంతో ఖగోళ శాస్త్ర చరిత్రలో ఆగస్టు 21, 2017కు ఓ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే నేరుగా సూర్యగ్రహణాన్ని చూడొద్దని, ప్రత్యేక అద్దాల ద్వారా చూడాలని వారు సూచించారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

న్యూఢిల్లీ : ప్రభుత్వ ఆస్పత్రిలో మురికికాలువలు శుభ్రం చేస్తూ పారిశుధ్య కార్మికుడు మృతిచెందిన సంఘటన ఢిల్లీలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రిషి పాల్ (40) తో పాటు బిసాన్ (30), కిరన్‌పాల్ (25), సుమిత్ (30)లు లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ ఆస్పత్రిలో మురుగు కాలువలు శుభ్రంచేస్తూ విషయావులు పీల్చి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఈ ఘటనలో రిషిపాల్ మృతిచెందాడు. మరో ముగ్గురికి చికిత్స చేస్తున్నట్లు ఢిల్లీ అగ్నిమాపకశాఖ అధికారి తెలిపారు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో జరిగింది. ఢిల్లీలో ఇలాంటి మృతి సంభవించడం ఈ నెల రోజుల కాలంలో ఇది పదోసారి.



యుపి వరదలకు 69 మంది మృతి

20 లక్షల మందిపై ప్రభావం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో సంభవించిన వరదలు 69 మంది ప్రాణాలను బలిగొన్నాయి. రాష్ట్రంలోని 24 జిల్లాల్లో 20 లక్షల మంది వరద ప్రభావానికి గురయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,523 గ్రామాలు ముంపునకు గురయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంభవించిన వరద పరిస్థితిపై ఆదివారం ప్రభుత్వం గణాంకాలతో కూడిన నివేదికను విడుదల చేసింది. తూర్పు ఉత్తరప్రదేశ్‌పై వరదలు తీవ్ర ప్రభావాన్ని చూపాయి. దాదాపు 39, 783 మంది పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. నేపాల్ నుంచి నీరు దిగువన ఉన్న ఉత్తరప్రదేశ్‌కు ప్రవహిస్తుండటం, రాష్ట్రంలో కూడా నిరంతరాయంగా భారీ వర్షాలు పడటంతో రాష్ట్రంలోని నదులు పొంగి ప్రవహించి, లోతట్టు ప్రాంతాలను ముంచి వేశాయి.ఎన్‌డిఆర్ఎఫ్, పిఎసి జవాన్లు రంగంలోకి దిగి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారు.సైనిక హెలికాప్టర్లు కూడా సేవలు అందిస్తున్నాయి. నేపాల్ నుంచి దిగువకు వస్తున్న నీరు, నిరంతరం కురుస్తున్న వర్షాలు సహాయ కార్యక్రమాలకు ఆటంకంగా మారాయని వారు పేర్కొన్నారు.

ప్రత్యేక దళాలకు ఎసి జాకెట్లు : పారికర్

పనాజీ : ప్రత్యేక దళంలోని సైనికులకు ఎయిర్ కండీషన్డ్ (ఎసి) జాకెట్లు అందించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఈ విషయాన్ని కేంద్ర మాజీ రక్షణ మంత్రి, గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ తెలిపారు. 'ప్రత్యేక ఆపరేషన్‌లో పాల్గొనే సైనికుల శరీరాలు వెంటనే వేడెక్కుతాయి. దీంతో వారు అసౌకర్యానికి గురవుతారు. అందుకే వారికి సౌకర్యంగా వుండేందుకు ఏసీ జాకెట్లను అందించాలని భావిస్తున్నాం. అందుకు సంబంధించిన ట్రయల్స్ జరుగుతున్నాయి' అని ఆదివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులకు పారికర్ తెలిపారు. అయితే వీటి తయారీకి ఎలాంటి పదార్థాలు వాడుతున్నారు, ఎలాంటి సాంకేతిక వినియోగిస్తున్నారనే విషయాలను పారికర్ వెల్లడించలేదు. ప్రత్యేక దళాల సైనికులు అధిక ఉష్ణోగ్రతల ప్రాంతంలోనే ఎక్కువ గంటలు పనిచేయాల్సి వుంటుంది. అమెరికాలో సైనికులు ఈ ఏసి జాకెట్ల వాడకాన్ని ఎప్పటి నుంచో ప్రారంభించారు. అలాగే ఎల్‌సిఎ తేజాస్ యుద్ధ విమానాలు గురించి కూడా పారికర్ మాట్లాడారు. ఈ యుద్ధవిమానాలు ప్రపంచంలోనే ఉత్తమైనవిగా పేరుతెచ్చుకున్నాయని, అయితే ఇవి కేవలం 3.5 టన్నుల బాంబులు మాత్రమే మోసే సామర్థ్యాన్ని కలిగివుండటమే సమస్యగా వుందన్నారు. పారికర్ భారత రక్షణ శాఖ మంత్రిగా 2014 నుంచి 2017 వరకూ పనిచేశారు. తరువాత గోవాకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా వచ్చారు.

ఢిల్లీ విమానాశ్రయం మూసివేత

న్యూఢిల్లీ : ఢిల్లీ విమానాశ్రయాన్ని ఆదివారం సాయంత్రం సుమారు 40 నిమిషాల పాటు మూసివేశారు. ల్యాండింగ్ ప్రదేశంలో డ్రోన్ లాంటి వస్తువును చూశానని ఎయిర్ ఆసియాకు చెందిన ఒక పైలట్ ఫిర్యాదు చేయడంతో విమానాశ్రయంలో వున్న మూడు రన్‌వేల్లోనూ అధికారులు సర్వీసులు ఆపివేశారు. ఢిల్లీ పోలీసులు తనిఖీలు పూర్తి చేసిన తరువాత మళ్లీ సేవలను పునర్దురించారు. ఈ తనిఖీల కారణంగా అనేక విమానాల రాకపోకలకు ఆలస్యమయింది. లక్నో, అహ్మదాబాద్ విమానాలను దారి మళ్లించారు. ఢిల్లీ విమానాశ్రయంలో రోజుకు 1200కు పైగా విమానాలు ప్రయాణం చేస్తాయి.

అక్రమాలకు కేంద్రాలుగా గోశాలలు

లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం



రాయ్‌పూర్: గోరక్షకులమని చెప్పుకుంటూ ప్రజలపై దాడులు చేస్తున్న కాషాయ నేతల ఆధ్వర్యంలో నడుస్తున్న గోశాలల్లో ఆవుల ఆకలిచావులు నానాటికీ విస్తరిస్తున్నాయి. ఇప్పటి వరకూ రాజ్‌పూర్‌లోని గోశాలలో మాత్రమే ఆవుల చావులు వెలుగు చూసినప్పటికీ ఇప్పుడు బిజెపి నేత ఆధ్వర్యంలోని మరో రెండు గోశాలల్లో ఆవుల మరణ మృదంగం మోగుతోంది. బిజెపికి చెందిన జాముల్ నగర్ పంచాయిత్ ఉపాధ్యక్షుడు హరిష్ వర్మ ఆధ్వర్యంలోని గోశాలలో దాదాపు 200 ఆవులు నీరు, ఆహారం అందక మరణించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే గోశాలలో మరో 30 ఆవులు ఆకలితో ప్రాణాలు కోల్పోయాయి. దుర్గ్ జిల్లా రానో గ్రామంలోని మయూరి గోశాలలోనూ, గోడ్‌మర్రా గ్రామంలోని పూల్‌చంద్ గోశాలలోనూ శనివారం నాడు ఇటువంటి దృశ్యాలేకన్పించాయి. ఈ మూడు గోశాలలనూ నిర్వహిస్తున్న వర్మను తాము శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. రాజ్‌పూర్ గోశాలకు అందాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయనందువల్లే ఆవులు ఆకలిచావుల బారిన పడుతున్నాయని వర్మ చెబుతున్నాడు. జంతు పరిరక్షణా చట్టం, నమ్మక ద్రోహం అభియోగాలతో వర్మపై మూడు కేసులు నమోదు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారులు చెప్పారు. ఈ మూడు గోశాలలనూ హరిష్‌వర్మ నిర్వహిస్తున్నట్లు తమకు తెలిసిందని, అతడిని ఇప్పటికే అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని ఐజిపి దీపాంశు కబ్రా చెప్పారు. పూల్‌చంద్, మయూరి గోశాలల నిర్వహణలో ప్రమేయం వున్న ఇతరులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.

ప్రభుత్వ నిధుల దుర్వినియోగం

ఈ మూడు కేసుల్లోనూ కన్పిస్తున్న నిర్లక్ష్యము, నమ్మక ద్రోహం వంటి ఆరోపణలు సర్వసాధారణమే అయినప్పటికీ ఇక్కడ ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కూడా కన్పిస్తోంది. గోవుల పరిరక్షణకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఛత్తీస్‌గఢ్ గోసేవా ఆయోగ్ సంస్థ నుండి ఈ మూడు గోశాలలకూ ఏటా లక్షలాది రూపాయల నిధులు అందుతున్నాయి. తాము అందచేస్తున్న ఈ నిధులు గోశాలల నిర్వహణ, పశుదాణా కొనుగోలు, నీరు, ఔషధాల సరఫరా వంటి వాటికి వినియోగించాల్సి వుంటుందని అధికారులు చెప్పారు. ఈ సంస్థ పోలీసులకు అందచేసిన అధికారిక లెక్కల ప్రకారం షగున్ గోశాల 2011లో ఏర్పాటు చేసినప్పటి నుండి ఇప్పటి వరకూ రు.93 లక్షల నిధులను అందుకుంది. ఇక 2014, 2015ల్లో ఏర్పాటు చేసిన పూల్ చంద్, మయూరి గోశాలలకు వరుసగా రు.50 లక్షలు, రు.22.64 లక్షల నిధులు అందాయి. ఈ నిధుల వ్యయంపై పర్యవేక్షణ వుండదా అన్న ప్రశ్నకు ఆయోగ్ అధ్యక్షుడు విశ్వేశ్వర్ పటేల్ బదులిస్తూ తాము గత ఏడాది జులైలో ఈ మూడు గోశాలలను తనిఖీ చేశామని, ఆ సందర్భంలోనే అనేక అక్రమాలు కనుగొన్నామని వివరించారు. సౌకర్యాల లేమి, పరిమితికి మించిన ఆవుల వంటి అక్రమాలపై తాము వివరణ కోరామని, ఇప్పటి వరకూ జవాబివ్వకపోవటంతో తాము నిధులను నిలిపివేసి, చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశామని ఆయన చెప్పారు. తమ నుండి నిధులు అందుకుంటున్న ఈ గోశాలలు తమ సొంతంగా కూడా నిధులను ఖర్చుచేయాల్సి వుంటుందన్నారు. తాము ఇప్పుడు ఈ గోశాలలకు వైద్యుల బృందాలను, పశువుల మేతను, ఔషధాలను పంపుతున్నామని, అందుకు కొంత సమయం పడుతుందని ఆయన చెప్పారు. అక్కడి ఆవులను ఇతర ప్రదేశాలకు తరలించే అంశాన్ని కూడా తాము పరిశీలిస్తున్నామని, ఇందులో కొన్ని సమస్యలున్నాయని అన్నారు. ఆవుల మరణాలపై నివేదిక కోరిన రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి కార్యాలయం, అక్రమాలున్నట్లు తేల్చిన నివేదిక ఆధారంగా దుర్గ్, బెమెటరా జిల్లాల అధికారులను సస్పెండ్ చేసింది.



న్యూజిలాండ్ ఎన్నికలు
అసమానతలే ప్రతిపక్ష అస్త్రం

వెల్లింగ్టన్: దేశంలో కొనసాగుతున్న అసమానతలను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామని న్యూజిలాండ్ ప్రతిపక్ష నేత జెసిండా ఆర్డర్న్ ప్రకటించారు. వచ్చే నెలలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ఆమె ఆదివారం ఇక్కడ అధికారికంగా ప్రారంబించారు. సెంట్రల్ లెఫ్ట్ లేబర్ పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల అనంతరం ఆమె ఎన్నికల బరిలోకి అడుగు పెట్టటం విశేషం. గత దశాబ్ద కాలంగా న్యూజిలాండ్‌లో అధికారంలో కొనసాగుతున్న ప్రస్తుత ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందన్న ఊహాగానాల మధ్య ఆర్డర్న్ తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వేతనాల పెంపుదల శాస్త్రీయ పద్ధతిలో లేకపోవటంతో పెరుగుతున్న జీవన వ్యయంతో పేద, గొప్ప మధ్య తారతమ్యం నానాటికీ పెరిగిపోతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పటిష్టమైన ఆర్ధిక వ్యవస్థ ప్రాధాన్యత గురించి తానెన్నడూ ప్రశ్నించలేదని, అయితే ప్రధాన పార్టీల మధ్య కొనసాగుతున్న విభేదాలను తాము విజయ సంకేతాలుగా వినియోగించుకుంటామని చెప్పారు.

ఉగ్రవాద కార్యకలాపాలను అనుమతించొద్దు..!
పాక్‌ను హెచ్చరించిన అమెరికా

ఇస్లామాబాద్ : పొరుగు దేశాలకు వ్యతిరేకంగా తమ భూభాగం నుండి ఉగ్రవాద కార్యకలాపాలను ఎంత మాత్రమూ అనుమతించవద్దని అమెరికా పాకిస్తాన్‌కు గట్టిగా సూచించింది. ఇటీవల పాకిస్తాన్‌లో పర్యటించిన అమెరికా సెంట్రల్ కమాండ్ కమాండర్ జనరల్ జోసెఫ్ ఓటెల్ పాక్ ప్రభుత్వానికి ఈ మేరకు సూచించినట్లు తెలుస్తోంది. కమాండర్ హోదాలో ఆయన పాక్‌లో పర్యటించటం ఇది మూడోసారి కావటం విశేషం. ఆయన ఈ పర్యటనలో ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ, రక్షణ మంత్రి ఖుర్రం దస్తగిర్, త్రివిధ దళాధిపతుల సంయుక్త కమిటీ ఛైర్మన్ జుబేర్ హయత్, సైన్యాధిపతి జనరల్ కమర్ జావేద్ బజ్వాలతో భేటీ అయ్యారు. పొరుగుదేశాలకు వ్యతిరేకంగా పాక్ భూభాగం నుండి ఉగ్రవాద దాడులను అనుమతించవద్దని ఈ నేతలందరికీ ఆయన సూచించినట్లు ఇక్కడి అమెరికా రాయబార కార్యాలయం వివరించింది. ప్రాంతీయ భద్రత, సుస్థిర తల కోసం అమెరికా పాక్ మధ్య సైనిక సంబంధాలను బలోపేతం చేయాల్సిన అవసరం గురించి ఆయన పాక్ నేతలతో చర్చించినట్లు వివరించారు.

జాత్యహంకార హింసాకాండపై
బోస్టన్‌లో వెల్లువెత్తిన నిరసన

బోస్టన్: గతవారం అమెరికాలో వర్జీనియా రాష్ట్రం ఛార్లెట్స్ విల్లేలో జరిగిన శ్వేతజాత్యహంకారుల హింసాకాండకు నిరసనగా బోస్టన్ నగరంలో శనివారం నాడు వేలాది మంది ప్రజలు 'ఫ్రీ స్పీచ్ ర్యాలీ' పేరిట భారీ ప్రదర్శన నిర్వహించారు. బోస్టన్ కామన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన సభా స్థలిలో కొంత మంది వక్తలు ప్రసంగిం చారు. పోలీసులు ముందు జాగ్రత్తగా నిరసనకారులకు, వారి ప్రత్యర్థులకు వేర్వేరు స్థలాలు ఏర్పాటు చేయటంతో నగరంలో మరోసారి 'చార్లట్స్ విల్లె' లాంటి హింసాకాండ జరిగే ప్రమా దం తప్పింది. బోస్టన్ కామన్ పార్క్‌లో జరిగిన 'ఫ్రీ స్పీచ్' సమావేశానికి దాదాపు 40 వేల మంది ప్రజలు హాజరైనట్లు పోలీసులు అంచనా వేశారు. ఈ సమావేశానికి భద్రతా ఏర్పాట్ల కోసం అధికారులు దాదాపు 500 మంది పోలీసు లను నియమించారు. పార్క్‌కు దారి తీసే రోడ్లపై పెద్ద యెత్తున బారికేడ్లు, భారీ ట్రక్కులు అడ్డుగా వుంచి కారు దాడుల నుండి రక్షణ కల్పించేందుకు ప్రయత్నించారు. గత వారం ఛార్లెట్స్ విల్లె, ఐరోపాలలో జరిగిన తరహా దాడులు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీ భద్రత మధ్య జరిగిన పోటీ ర్యాలీలో కేవలం 100 మంది లోపే పాల్గొన్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ సమావేశంలో వక్తల ప్రసంగాలకు నిరసన కారుల కేకలు, నినాదాలతో పాటు ఇరువైపులా ఏర్పాటు చేసిన భారీ భద్రత కూడా తీవ్ర అంతరాయం కలిగించటంతో నిర్దేశిత సమయానికి గంట ముందు దీనిని ముగించారు. సమావేశం నుండి వెళ్లే వారిని చుట్టుముట్టిన నిరసనకారులు వారిపైకి వాటర్ బాటిల్స్ విసురుతూ నిరసన వ్యక్తం చేశారు. నిరసన కారుల్లో కొంత మంది నలుపు రంగు దుస్తుల్లో ముఖానికి ముసుగులు



శ్వేతజాత్యహంకారుల ప్రదర్శనలో హింసాకాండకు వ్యతిరేకంగా బోస్టన్‌లో భారీ ర్యాలీ (ఇన్‌సెట్‌లో) పోలీసుల జులుం

వేసుకు రాగా, ఇద్దరు వ్యక్తులు 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అన్న ట్రంప్ నినాదంతో కూడి టోపీలు ధరించారు. గత వారం ఛార్లెట్స్ విల్లెలో చెలరేగిన హింసాకాండ దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. అధ్యక్షుడు ట్రంప్ ఇరువర్గాలలో ఎవరినీ ఖండించకుండా అందరిపైనా ప్రశంసలు కురిపించటంతో రాజకీయ విభేదాలకు అతీతంగా ట్రంప్‌పై విమర్శలు వెల్లువెత్తాయి.

ట్రంప్ ప్రశంసలు

బోస్టన్ సమావేశంలో అహంకారానికి, విద్వేషానికి వ్యతిరేకంగా ప్రసంగించిన వారిని తాను అభినందిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా చీలిపోయిన దేశ ప్రజలు త్వరలోనే ఒక్కటవుతారని తాను ఆశిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కొన్నిసార్లు ఉపశమనం కలిగించటానికి నిరసన వ్యక్తం చేయాల్సి వుంటుందని, స్వాంతన కలిగిన తరువాత మనం గతం కన్నా పటిష్టంగా తయారవుతామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో పోలీసులపైకి వాటర్ బాటిల్స్ విసిరి ఘర్షణకు దిగేందుకు ప్రయత్నించిన 33 మందిని అరెస్ట్ చేసినట్లు బోస్టన్ పోలీసు విభాగం వెల్లడించింది.

డ్యుటెర్టె 'డ్రగ్ వార్'పై రగులుతున్న ఫిలిప్పైన్స్

మనిలా: దేశంలో కొనసాగుతున్న మాదకద్రవ్యాల దందాపై ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టె చేపట్టిన 'డ్రగ్‌వార్'పై ఆ దేశ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది జూన్‌లో డ్యుటెర్టె అధికారం చేపట్టిన నాటి నుండి ఇప్పటి వరకూ దాదాపు 12,500 మంది ప్రజలు ఈ వార్‌లో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అధికశాతం మంది చిన్న తరహా డ్రగ్ వినియోగ దారులు లేదా విక్రయదారులే. అయితే తమ అధికారులు ఆత్మరక్షణకు జరిపిన కాల్పుల్లో దాదాపు 3,500 మంది చనిపోయారని పోలీసులు చెబుతున్నారు. మిగిలిన వారంతా పోలీసు మద్దతుదారులు, లేదా పోలీసుల చేతుల్లోనే ప్రాణాలు కోల్పోయారని మానవ హక్కుల ఉద్యమ కారులు ఆరోపిస్తున్నారు. కానీ పోలీసులు ఈ ఆరోపణలను తిరస్కరిస్తున్నారు. ఇదిలా వుండగా 'డ్రగ్స్‌పై పోరు చేయండి కానీ మనుషులపై కాదు' అన్న నినాదాలు రాసిన టీ-షర్ట్‌లు ధరించిన వందలాది మంది అధ్యక్షుడి డ్రగ్‌వార్‌పై నిరసన వ్యక్తం చేశారు. అధ్యక్షుడు మాదక ద్రవ్యాలపై తలపె ట్టిన పోరుకు అనేక మంది ప్రజలు మద్దతునిస్తున్నప్పటికీ ఈ పోరులో అమాయ కులు మరణించటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి



వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఉధృత మైన 'డ్రగ్స్‌పైవార్'లో దాదాపు 90 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ తాజా హత్యలపై స్పందించిన కొందరు కేథలిక్ బిషప్‌లు వీటిని తీవ్రంగా ఖండించారు. మృతుల కోసం ప్రార్ధనలు జరపాలంటూ మత విశ్వాసులకు వారు పిలుపునిచ్చారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం సోషల్ మీడియా పోస్ట్‌ల్లో ప్రతిఫలిస్తుండ టంతో కొన్ని పౌర సమాజ గ్రూపులు, వామపక్ష కార్యకర్తలు ఈ హత్యలపై నిరసనలకు పిలుపునిచ్చారు. పోలీసు కాల్పుల్లో మృతుల సంఖ్య ఆకస్మికంగా పెరుగుతున్న తీరుపై స్పందించిన ఫెడరల్ ప్రభుత్వ న్యాయశాఖ దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు ప్రకటించింది.


బంగ్లాదేశ్ ప్రధానిపై హత్యాయత్నం కేసు
పదిమందికి మరణశిక్ష

ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాపై 17 ఏళ్ల క్రితం హత్యాయత్నం చేసిన కేసులో పదిమందికి మరణశిక్ష విధిస్తూ ఇక్కడి న్యాయస్థానం ఆదివారం నాడు తీర్పు వెలువరించింది. ఈ కేసులో మరో వ్యక్తికి యావజ్జీవిత జైలు శిక్షతో పాటు తొమ్మిది మందికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. మరణశిక్ష విధించిన వారిని ఉరితీయటం లేదా ఫైరింగ్ స్క్వాడ్ కాల్పులు ద్వారా కానీ హతమారుస్తారు. 2000 సంవత్సరం జులై 20న ఢాకా పోలీసులు నగరంలోని షేక్ లుట్ఫర్ ఐడియల్ కాలేజ్ నుండి 76 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ పేలుడు పదార్థాలను అప్పట్లో ప్రధానిగా వున్న షేక్‌హసీనాను హతమార్చేందుకు ఉద్దేశించినవేనని గుర్తించినపోలీసులు పేలుడు పదార్థాల చట్టం కింద 2001 ఏప్రిల్ 8న 16 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన హర్కతుల్ జిహాద్ అల్ ఇస్లామీ బంగ్లాదేశ్ అధినేత ముఫ్తి అబ్దుల్ హన్నన్‌ను గత ఏప్రిల్ 12న కశింపూర్ జైలులో ఉరి తీశారు. ముగ్గురిని హత్యచేయటంతో పాటు బ్రిటిష్ మాజీ హైకమిషనర్‌ను గాయపర్చిన మరో కేసులో ఇతడికి న్యాయస్థానం మరణశిక్ష విధించింది.

అమెరికా-ద.కొరియా సైనిక విన్యాసాలపై
ఉ.కొరియా ఆగ్రహం

ప్యాంగ్యాంగ్ : సోమవారం నుండి ప్రారంభం కానున్న అమెరికా-ద.కొరియా సైనిక విన్యాసాలపై ఉ.కొరియా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే తమ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై అమెరికా ఆజ్యం పోస్తోందని ఉ.కొరియా మండిపడింది. గత నెలలో రెండు ఖండాంతర క్షిపణి ప్రయోగాలు నిర్వహించిన ఉ.కొరియాపై 'నిప్పుల వర్షం' కురిపిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలుజారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై దీటుగా స్పందించిన ఉ.కొరియా తాము అమెరికా భూభాగమైన గువాం వైమానిక స్థావరానిన లక్ష్యంగా చేసుకుని క్షిపణి ప్రయగాలకు రంగం సిద్ధం చేశామని, తమ అధినేత కిమ్ జోంగ్ ఉన్ అనుమతి వచ్చిన వెంటనే ప్రయోగిస్తామని హెచ్చరించింది. అయితే ఈ ప్రయోగాలు అమెరికా తదుపరి చర్యలపై ఆధారపడి వుంటాయని తెలిపింది. ఉ.కొరియాతో కొనసాగుతున్న ఈ హెచ్చరికలు, ప్రతి హెచ్చరికల మధ్య సోమవారం నుండి ద.కొరియాతో కలిసి ఉల్చి ఫ్రీడమ్ గార్డియన్ పేరుతో అమెరికా సైనిక విన్యాసాలు ప్రారంభించనుంది.

విచారణకు షరీఫ్ కుటుంబీకులు గైర్హాజరు



లాహోర్ : పనామా పత్రాల లీకేజ్ కేసులో పదవీ చ్యుతుడైన పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆయన కుటుంబ సభ్యులు తమపై జరుగుతున్న విచారణలో ఆదివారం నాడు నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో (ఎన్ఎబి) ముందు గైర్హాజరయ్యారు. మనీలాండరింగ్, అవినీతికుంభకోణాల వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న నవాజ్ షరీఫ్ కుటుంబ సభ్యులు విచారణకు గైర్హాజరు కావటం ఇది రెండోసారి. ఇతర దేశాలలో వున్న సంస్థలతో ప్రధానంగా లబ్ది పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న షరీఫ్ కుమార్తె మర్యం కేసులో విచారణకు ఆదివారం నాడు తమ ముందు హాజరు కావాలని షరీఫ్, ఆయన అల్లుడు రిటైర్డ్ కెప్టెన్ సఫ్దర్‌లకు ఎన్ఎబి వేరుగా సమన్లు జారీ చేసింది.

అణుఒప్పందం అమలు మా ప్రాధాన్యత
ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ



టెహ్రాన్ : తాము ఆరుదేశాల కూటమితో కుదుర్చుకున్న అణుఒప్పందానికి అమెరికా తూట్లు పొడవకుండా రక్షించుకోవటమే ఇప్పుడు తమ ముందున్న ప్రాధాన్యతాంశమని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహాని చెప్పారు. శనివారం ఆయన పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ ఈ ఒప్పందాన్ని కాపాడుకోవటమే తమ ప్రభుత్వ విదేశాంగ మంత్రి ముందున్న ప్రధాన కర్తవ్యమని, దీనికి తూట్లు పొడిచేందుకు అమెరికా, ఇతర శత్రుదేశాలు చేస్తున్న ప్రయత్నాలను విజయవంతం కానివ్వబోమని స్పష్టం చేశారు.

ఈ ఒప్పందాన్ని రక్షించుకోవటం అంటే ఇరాన్ శత్రువులకు ఎదురొడ్డి నిలవటమేనన్నారు. అమెరికా తాజా ఆంక్షలు విధించేప్రయత్నం చేస్తే తాము ఈ అణు ఒప్పందం నుండి విరమించుకుంటామని రౌహానీ గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ దేశ ప్రగతికి ఈ ఒప్పందం అతి ముఖ్యమని ఆయన అన్నారు. ఈ ఒప్పందం ద్వారా గాడి తప్పిన ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పట్టాలెక్కటంతో పాటు అనేక ఉద్యోగావకాశాలు ఏర్పడతాయన్నారు. ఆర్థిక కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనటం ద్వారా విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం వంటి వాటిని ఆకర్షించటానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విదేశాంగ మంత్రిత్వశాఖదేనన్నారు.

మొదటి పేజీ తరువాయి

కోరంగిలో అరుదైన వన్యప్రాణులు

గుర్తించారు. ఒక్కో జంతువుకు ఒక్కో ప్రత్యేకవాసన (మలమూత్రాల ఆధారంగా ఫిర్మోన్స్) ఉంటుంది. ఈ వాసనను ఆయా జాతుల జంతువులు మాత్రమే గుర్తిస్తాయి. దీన్నే ఫిర్మోన్స్ అంటారు. శాస్త్రవేత్తలు నీటికుక్కలు, చేపలపిల్లి ఆచూకీ కోసం ఫిర్మోన్లను ఆధారంగా చేసుకుని పరిశోధనలు చేశారు. చేపల చెరువులు, రొయ్యల చెరువుల వద్ద నీటి కుక్కలు, ఫిషింగ్ క్యాట్ల ఫిర్మోన్స్‌ను సేకరించారు. ఈ అరణ్యం సమీపంలో ఇసుక దిబ్బలను ఏర్పాటు చేసి వాటిపై ఫిర్మోన్లను పెట్టారు. కృత్రిమ ఆవాసాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ట్రాప్ కెమెరాలను ఉంచారు. రాత్రి సమయంలో సంచరించే ఈ వన్యప్రాణులను ట్రాప్ కెమెరాల సాయంతో ఐదు చోట్ల గుర్తించారు. కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు చేసి వాటిని కోరంగి అడవులకు మళ్లించే ప్రయత్నం చేస్తున్నామని అటవీశాఖ వన్యప్రాణి విభాగం డిఎఫ్ఒ ప్రభాకర్ 'ప్రజాశక్తి'కి చెప్పారు.

మృత్యు మార్గాలు

అధికారులు చెబుతున్నారు. దాబాల వద్దే లారీలను ఆపడం, డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడం వల్ల వాహనాలను తిరిగి హైవేలోకి నడిపే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నట్లు వివరిస్తున్నారు. హైవేల పక్కన వాహనాల్ని నిలిపేందుకు కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే నిలుపుకోవాలని సూచిస్తున్నారు. మొత్తం ప్రమాదాల్లో జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలు దేశ వ్యాప్తంగా 28.4 శాతం ఉండగా రాష్ట్రంలో జాతీయ రహదారుల ప్రమాదాల శాతం 36.5గా ఉంది. దేశవ్యాప్తంగా మరణిస్తున్న వారి సంఖ్య 35 శాతం ఉండగా రాష్ట్రంలో 39.8 శాతంగా ఉంది.

ఆదరణ లేని అప్‌కాస్ట్

స్వయంగా అప్‌కాస్ట్‌కి వెళ్లినా అక్కడేమీ లేవు. ఉన్న పరికరాలు, ప్రాజెక్టు నమూనాలపై వివరించి చెప్పే బోధన సిబ్బంది ఒక్కరు కూడా లేరు. దీంతో బయటి నుంచి పాఠశాలల వారు కూడా రావడం మానుకున్నారు. గ్రహణాలపై ఉన్న అపోహలను తొలగించేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలసి ఈ విభాగం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతుండేది. ప్రఖ్యాత శాస్త్రవేత్తల జయంతుల సందర్భంగా జిల్లాల వారీగా వివిధ పోటీలు నిర్వహించేవారు. ఇప్పుడు విజయవాడలోని అప్‌కాస్ట్ రాష్ట్ర కార్యాలయం సందర్శకులు లేక వెలవెలబోతోంది. గతంలో రోజుకు దాదాపు అయిదు వందల మంది సందర్శించేవారు ఇప్పుడు కేవలం కార్తీక మాసంలో విహార యాత్రల కోసం మొక్కుబడిగా సందర్శకులు వస్తున్నారు. దీన్ని రాష్ట్రస్థాయి కేంద్రంగా అన్ని వసతులు కల్పించి, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, సందర్శకులకు కావాల్సిన కనీస వసతులను కల్పించేలా అభివృద్ధి చేయాలని పలువురు సైన్స్ ప్రచార కార్యకర్తలు కోరుతున్నారు.

నిధుల కోత

ఎపి సైన్స్ సెంటర్‌కు అభివృద్ధికి ప్రభుత్వం 2015-16 బడ్జెట్‌లో రూ. 58.4 లక్షలు కేటాయిస్తే, గతేడాది రూ 57.18 లక్షలకు ఆ నిధులను తగ్గించింది. ఈ ఏడాది కేవలం రూ.8.18 లక్షలు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో అప్‌కాస్ట్ రాష్ట్ర కార్యాలయం ఉండేది. రాష్ట్ర విభజనానంతరం ప్రభుత్వ కార్యాలయాలన్నింటిని విజయవాడ, గుంటూరుకు మార్చిన తరువాత విజయవాడలో ఉన్న ప్రాంతీయ కార్యాలయాన్నే రాష్ట్ర కార్యాలయంగా మార్చారు. కానీ తగిన చర్యలు చేపట్టలేదు.

ఈ కౌన్సిల్ విభజన అంశాల్లోని పదో షెడ్యూల్‌లో ఉండటంతో పూర్తి స్థాయిలో హైదరాబాద్‌లోని పలు పరికరాలు, పుస్తకాలు ఇక్కడకు రాలేదు. సిబ్బంది కూడా ఏపికి వచ్చేందుకు సుముఖంగా లేక ఒక్కరు కూడా రాలేదు. దీంతో రాష్ట్ర కార్యాలయంగా మార్చిన తరువాత కూడా ప్రాంతీయ కార్యాలయంలో మాదిరి ఇక్కడ ఆరుగురే సిబ్బంది ఉన్నారు. విద్యార్థులెవరైనా సందర్శనకు వచ్చినా ఆ ప్రాజెక్టులను వివరించేందుకు ఆయా పాఠశాలల నుంచే టీచర్లను తెచ్చుకోమంటున్నామని ఈ సిబ్బంది తెలిపారు.

రాజధానికి తగినట్లుగా అభివృద్ధి చేయాలి

గతంలో సైన్స్ కార్యక్రమాల నిర్వహణలో అప్‌కాస్ట్ జెవివితో కలసి పనిచేసేది. గత కొంత కాలంగా సైన్స్ కార్యక్రమాలను చేపట్టడం లేదు. కేవలం ' ఇన్‌స్పైర్ ' కార్యక్రమంలో మాత్రమే ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించడంలో అప్‌కాస్ట్ విఫలమైంది. తిరుపతిలో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో కూడా అప్‌కాస్ట్ ప్రమేయం పెద్దగా ఎక్కడా కనిపించలేదు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజియం తరహాలో విజయవాడలోని అప్‌కాస్ట్‌ను అభివృద్ధి చేయాలి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పట్ల ఆసక్తి కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలి.

- శ్రీనివాస్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి

నేటితో ప్రచారానికి తెర

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల కోడ్ రాకముందే రెండుసార్లు పర్యటించి నాలుగురోజులు మకాం వేసి టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందారెడ్డికి మద్దతుగా వ్యూహరచన చేశారు. ప్రచారం సందర్భంగా శని, ఆదివారాలల్లో రెండ్రో జులు పర్యటించారు. వీధివీధినా తిరగడంతోపాటు పలు సమావేశాల్లో పాల్గొని మద్దతునివ్వాలని ఓటర్లను కోరారు. ఆదివారం నాడు పలు సంఘాల ప్రతినిధులతో సమావేశమైనారు. సాయంత్రం హైదరాబాద్‌కు బయలుదేరారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఏకంగా 13 రోజుల పాటు నంద్యాలలో బసచేశారు. నియోజకవర్గంలో విస్తృతం గా పర్యటించారు.ఇంటింటికీ తిరిగి వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఓట్లు అడిగారు. 2014 ఎన్నికల్లో ధరావత్తు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ కూడా తాజా ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపింది. పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి కూడా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ప్రచార పర్వంలో టిడిపి, వైసిపిలు చూపిన దూకుడు పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. రెండు పార్టీలు పోటీపడి ఓటర్లను ప్రలోభ పెట్టాయి.

రూ.1.08 కోట్లు సీజ్

నంద్యాల ఉప ఎన్నికలలో భాగంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పంపిణీ చేస్తున్న నగదును పెద్ద ఎత్తున అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటిదాకా రూ.1.08కోట్లు వరకు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఒక్కరోజే రూ.58లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రూ.6లక్షలను పోలీసులు సీజ్ చేశారు. రైతు నగర్ చెక్‌పోస్టు, అయ్యలూరు మెట్ట ప్రాంతాల్లో వాహనాల తనిఖీలలో అక్రమ నగదును గుర్తించి పట్టుకున్నారు.

నోట్లరద్దుతో వారికి నిధుల కొరత
మావోయిస్టు, వేర్పాటువాదులపై అరుణ్ జైట్లీ

ముంబయి: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి పెద్ద నోట్లరద్దు చర్యను సమర్థించుకున్నారు. బిజెపి ముంబయి విభాగం అధ్యక్షుడు ఆశిష్ షెలార్ నిర్వహించిన 'నవభారత ప్రతిజ్ఞ' కార్యక్రమంలో మాట్లాడుతూ నోట్లరద్దు ప్రభావంపై మాట్లాడారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని మావోయిస్టులకూ, జమ్మూకాశ్మీర్‌లోని వేర్పాటువాదులకు పెద్ద నోట్లరద్దుతో నిధుల కొరత ఏర్పడిందని ఆయన అన్నారు. ఉగ్రవాద ప్రభావిత ప్రాంతంలో సైన్యంపై రాళ్లురువ్వే యువకుల సంఖ్య గణనీయంగా తగ్గడమే దీనికి ఆధారమని పేర్కొన్నారు. గతంలో కొన్ని వందలమంది ఆ తరహా ప్రదర్శనల్లో పాల్గొనేవారని, కానీ నోట్లరద్దు అనంతరం ఆ సంఖ్య 25కి పడిపోయిందని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలోకి పెద్ద మొత్తంలో డబ్బు వచ్చి చేరిందని చెప్పుకొచ్చారు. రక్షణ, గ్రామీణ, మౌలిక నిర్మాణాలపై ఎక్కువ నిధులు ఖర్చు పెట్టాలన్నదే బిజెపి ప్రభుత్వ నవభారత ప్రతిజ్ఞ అని వ్యాఖ్యానించారు. ప్రపంచస్థాయి సంస్థలు నిర్మించుకోవాలని, గోరఖ్‌పూర్ వంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం కాకూడదని జైట్లీ పేర్కొన్నారు. 7 నుంచి 7.75 శాతం వృద్ధి రేటుతో మోడీ ప్రభుత్వం సంతృప్తి చెందదని, వృద్ధి రేటును పెంచేందుకు మరిన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటామని ఆయన అన్నారు.

సర్వేలు నిషేధం!

(మొదటి పేజీ తరువాయి)

వేస్తారంటూ అడగడం చట్టవిరుద్ధమన్నారు. సర్వేల పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరించడం వంటి చర్యలకు దిగుతున్నట్లు ఫిర్యాదులందాయని, అందుకే సర్వేలు, ఒపీనియన్ పోల్స్‌ను నిషేధించామన్నారు. సర్వేలు ప్రసారం చేసే టివి ఛానళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నంద్యాలలో జరిగే పోలింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23వ తేది సాయంత్రం వరకు ఎలాంటి సర్వేలు, ఒపీనియన్ పోల్స్ నిర్వహించొద్దని, ప్రసారం చేయొద్దని సూచించారు. ఫిర్యాదులపై ఎన్నికల సంఘం ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలను భన్వర్‌లాల్ తోసిపుచ్చారు. ఎన్నికల సంఘానికి అన్ని పార్టీలూ సమానమేనని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం పార్టీ ఫిర్యాదులు కూడా అందాయని, వాటిని జిల్లా కలెక్టర్‌కు పంపించామన్నారు. ఫిర్యాదులపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని కోరామన్నారు. స్థానిక డిఎస్పీని ఎన్నికల విధుల నుంచి తప్పించడంపై స్పందిస్తూ...వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కంటే ముందే తమకు ఫిర్యా దులందాయని, ఆరోపణలు నిర్ధారణ కావడంతోనే ఆయన ను ఎన్నికల విధుల నుంచి తప్పించామన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నా మన్నారు. కేంద్ర బలగాలతో పాటు, ఆర్మ్‌డ్ ఫోర్స్‌ను రంగంలోకి దించుతున్నట్లు ఆయన తెలిపారు .అంతకుముందు టిడిపి ఎంపీలు కొనకళ్ల నారాయణ, కేసినేని నానిలు భన్వర్‌లాల్‌తో భేటీ అయ్యారు. ఉప ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై చర్చించారు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని, వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి చెందిన సాక్షి మీడియా ఏక పక్షంగా వార్తా కథనాలిస్తోందని, తక్షణం వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులపై స్పందిస్తున్న తరహాలోనే టిడిపి ఇచ్చిన ఫిర్యాదులపై కూడా స్పందించాలని కోరారు.

జగన్‌ను వెంటనే అరెస్టు చేయాలి: ఎంపిలు కొనకళ్ల, కేసినేని

అనంతరం ఎంపిలు కొనకళ్ల నారాయణ, కేసినేని నాని మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నిబంధనల్ని ఉల్లంఘించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతోందన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిని ఉద్దేశిస్తూ "ఉరి తీయాలి", " కాల్చి చంపాలి" అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయన్నారు. రాయలసీమ లాంటి ప్రాంతంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. జగన్ ప్రసంగాలపై ఫిర్యాదును ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదని, అదే శిల్పా మోహన్‌రెడ్డి ఈ-మెయిల్ పెట్టగానే సర్వేలపై బ్యాన్ విధించిందన్నారు. అన్నారు.

ఐటీ రిటర్న్స్‌పై గందరగోళమెందుకు..?

- ప్రధాని, ఆర్థికమంత్రి , ఆర్థిక సర్వే లెక్కల్లో తేడాలెందుకు..?
- పెద్దనోట్ల రద్దు తర్వాత తడబడుతున్న ప్రభుత్వ పెద్దలతీరు దేనికి సంకేతం..?

న్యూఢిల్లీ: పెద్దనోట్ల రద్దు తర్వాత ఆదాయం పన్ను చెల్లింపులు అనూహ్యంగా పెరిగాయంటూ ప్రభుత్వ వర్గాలు చెబుతున్న పూటకో లెక్కతో జనం మదిలో పలు సందేహాలు అలాగే మిగిలి ఉన్నాయి. కొత్తగా(అదనంగా) గతేడాదితో పోలిస్తే ఈసారి ఐటీ రిటర్న్‌లు పెరిగాయని చెబుతున్న మాటల్లో ఏది నిజమో..? ఏది అబద్ధమో..? తేల్చుకోలేని పరిస్థితి. అదనపు ఐటీ రిటర్న్‌ల విషయంలో ఇటీవల విడుదలైన ఆర్థిక సర్వే 5.4 లక్షలుగా తేల్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో 56 లక్షలని చెప్పారు. ఆర్థికమంత్రి 91 లక్షలుగా తేల్చారు. ఇదే అంశంపై రాజ్యసభలో 33 లక్షలని చెప్పారు. వీటిలో ఏది నిజం..? ఏది అబద్ధం..? తేల్చుకునేదెలా..?

ప్రధానమంత్రికైనా, ఆర్థిక మంత్రిత్వశాఖకైనా ఆదాయం పన్ను విషయంలో అధికారిక లెక్కలు ఇచ్చేది కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ). ఈ గందరగోళానికి తెరదించేలా సీబీడీటీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే ప్రభుత్వ పెద్దల హడావుడి ప్రకటనల వెనుక అసలు ఉద్దేశమేమిటో అర్థమవుతుంది. ముందుగా ప్రధాని ప్రకటనపై సీబీడీటీ ఇచ్చిన వివరణ ఇలా ఉన్నది..2017 ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 5 వరకు ఐటీ రిటర్న్‌ల సంఖ్య 2.79 కోట్లు. ఇదే కాలానికి గతేడాది(2016లో) 2.23 కోట్లు. తేడా 56 లక్షలు. అంటే గతేడాదితో పోలిస్తే ఈ కాలానికి 56 లక్షలమంది అదనంగా చేరారన్నది లెక్క.. అయితే, ఇందులో చెప్పుకోదగిందేమీలేదు. ఎందుకంటే ఐటీ రిటర్న్‌లు ప్రతిఏటా పెరుగుతూనే ఉన్నాయి. ఇదే కాలానికి చూస్తే 2015లో ఐటీ రిటర్న్‌ల సంఖ్య 2 కోట్లు. ఆ తర్వాతి ఏడాది(2016లో) 23 కోట్లు పెరిగాయి కదా..!

ఇక ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చెప్పిన 91 లక్షల విషయానికొస్తే..2016-17 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా చూస్తే అదనంగా తోడైన ఐటీ రిటర్న్‌ల సంఖ్య అది. ఆర్థిక సర్వేలో చెప్పిన 5.4 లక్షలన్నది నోట్ల రద్దు జరిగిన 8, నవంబర్,2016 నుంచి 2017, మార్చి వరకు అదనంగా చేరిన ఐటీ రిటర్న్‌లు అన్నది వివరణ.

అయితే, ఈ లెక్కలకు సంబంధించి కాస్త గతంలోకి వెళితే మోడీ ప్రభుత్వంలోని పెద్దలు ఇంతగా దేశ ప్రజల్ని గందరగోళంలోకి ఎందుకు నెడుతున్నారో అర్థమవుతుంది. మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ హయాంలోనూ ఐటీ రిటర్న్‌లు అనూహ్యంగా పెరిగాయని సీబీడీటీ గణాంకాలే చెబుతున్నాయి. 2006-07లో కేవలం 4 లక్షలు మాత్రమే ఉన్న ఐటీ రిటర్న్‌ల సంఖ్య 2007-08లో 22 లక్షలకు పెరిగింది. అంటే 450 శాతం పెరిగాయి. ఆ తర్వాతి ఏడాది 2008-09లో 48.5 లక్షలకు ఆ సంఖ్య చేరింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 120 శాతం పెరుగుదల. 2009-10లో 52.5 లక్షలుండగా, 2010-11లో 91.56 లక్షలుగా నమోదైంది. అంటే 74 శాతం పెరుగుదల. ఆ తర్వాతి ఏడాది 2011-12లో 164.12 లక్షలు. అంటే 79 శాతం పెరుగుదల. యూపీఏ చివరి ఏడాది 2013-14లో 2 కోట్ల 97 లక్షలకు ఐటీ రిటర్న్‌ల సంఖ్య చేరిందన్నది గమనార్హం. ఇప్పుడు మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ హయాంలో అనూహ్యమైన పెరుగుదల ఏమీ నమోదు కాలేదని ఈ అధికారిక లెక్కల్ని పరిశీలిస్తే ఎవరికైనా అర్థమవుతుంది.

ఒక్కటీ రాలేదు...!

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్‌లో చర్చలు కొనసాగించాల్సిన అవసరం లేదన్న అభిప్రాయానికి వచ్చారు. ఇదే విషయాన్ని అంతర్గతంగా రూపొందించిన నివేదికలోనూ పేర్కొన్నారు.

వీటితో ప్రారంభదశలోనే

యూరోపియన్ ఎడ్యుకేషన్-రీసెర్చ్ కౌన్సిల్, జెట్రో, సౌదీ ఆరామ్కో, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్, స్పైస్ జెట్ సింగపూర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు వంటి సంస్థలతో చర్చలు ప్రారంభదశలో ఉన్నాయి. వీటితో భవిష్యత్‌లోనూ చర్చలు నిర్వహించవచ్చన్నది అధికారుల అంచనా! ఇక దావోస్ కేంద్రంగా నిర్వహించిన సంస్థల్లో మైక్రోసాఫ్ట్, వీసా, మిత్సూయ్ గ్లోబల్, సిస్కో సిస్టమ్స్, ప్రీమియర్ టీ, ట్రిటెక్ ఎజి, ఎయిర్ బస్, ఇన్ఫోసిస్, వాషింగ్టన్ యూనివర్సిటీ వంటి సంస్థలతో నిర్వహించిన చర్చలు ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన సంస్థలు చర్చల సందర్భంలా ఒకలా, ఆ తరువాత మరోలా వ్యవహరిస్తున్నాయన్న అభిప్రాయం ఉన్నతస్థాయి వర్గాల్లో వ్యక్తమవుతోంది.

4.13 లక్షల 'తెల్ల కార్డులు' కట్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీకి చెందిన వారి కార్డులు మాత్రం పునరుద్ధరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై కొందరు లబ్దిదారులు నిలదీయగా, మృతి చెందిన వారి పేర్లు మాత్రమే కార్డుల నుంచి తొలగించామని, అర్హులైన వారి కార్డులు రద్దయి ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకుంటే పునరుద్ధరిస్తామని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

పల్స్ సర్వే ఆధారంగా రాష్ట్రంలో రద్దు చేసిన తెల్లరేషన్ కార్డులు

జిల్లా	రద్దు చేసిన కార్డుల సంఖ్య
అనంతపురం	46380
కర్నూలు	23823
కడప	19843
చిత్తూరు	49505
నెల్లూరు	17451
ప్రకాశం	24929
గుంటూరు	44164
కృష్ణా	37683
పశ్చిమగోదావరి	32667
తూర్పుగోదావరి	53949
విశాఖపట్నం	24766
విజయనగరం	14471
శ్రీకాకుళం	23951
మొత్తం	**413582**

ఐదేండ్లలో 298 మంది భారతీయులకు పాక్ పౌరసత్వం

న్యూఢిల్లీ : ఐదేండ్లలో 298 మంది భారతీయులకు పౌరసత్వం కల్పించినట్టు పాకిస్తాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది. భారత్‌తో సత్సంబంధాలను కోరుకుంటున్నందుకే అర్హులైన పౌరులకు పౌరసత్వం కల్పిస్తున్నట్టు పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ పేర్కొన్నది. 2012లో 48 మందికి, 2013లో 75 మందికి, 2014లో 76 మందికి పౌరసత్వం కల్పించినట్టు తెలిపింది.

ప్రమోషన్‌కు కొత్త ట్రెండ్


ఎన్టీఆర్

ఈ మధ్య సినిమా ప్రారంభం నుంచి విడుదలయ్యే వరకూ ప్రతి షాట్‌నూ, ప్రతి పిక్‌ను ప్రచారానికే ఉపయోగించేస్తున్నారు. సామాజిక మాధ్యమాలు విస్తృతమయ్యాక ఇది మరింత ఎక్కువైంది. ఇప్పుడున్న యువ హీరోలంతా తమ అభిమానులకు చేరవయ్యేందుకు నిత్యం ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి వాటిల్లో టచ్ లో ఉంటున్నారు. ఆడియన్స్‌ను థియేటర్లకు తీసుకొచ్చేందుకు ఒక్కొక్కరు ఒక్కో ట్రెండ్ ఫాలో అవుతున్నారు. మెగాఫ్యామిలీకి చెందిన నటులు తమ చిత్రాల ఆడియోను విడుదల చేయకుండా దాని స్థానంలో ప్రీ రిలీజ్ వేడుకలను నిర్వహించడం మొదలు పెట్టింది. అవి బాగానే సక్సెస్ అయ్యాయి. బాలయ్య సినిమా 'పైసా వసూల్' టీజర్ రిలీజ్‌కు ఆ పేరుతో పిలువకుండా స్టంపర్ అనే కొత్త నామకరణం చేశారు. ఇలా ఏదొక విధంగా అభిమానులకు చేరవయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల రానా హీరోగా చేసిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాన్ని ఎలాగైనా సక్సెస్ సాధించాలి, ప్రచారానికి పెద్ద పీటవేయాలని త్రీడీ టెక్నాలజీ తరహాలో కొత్త సాంకేతికతను తీసుకొచ్చింది చిత్రబృందం. ఈ విధానం ద్వారా వాస్తవంగా అక్కడ లేకుండా రానా, కాజల్‌లతో ఫ్యాన్స్ ఫొటో దిగే అవకాశం కల్పించారు. ఇది కలిసొచ్చింది. ప్రచారానికి బాగా ఉపయోగపడడం, చిత్రం సబ్జెక్ట్ జనాలకు కనెక్ట్ కావడంతో ప్రేక్షకాదరణ లభిస్తోంది.

ఇప్పుడు ఎన్టీఆర్ సొంత బ్యానర్ ఎన్టీఆర్ ఆర్ట్స్‌లో కళ్యాణ్ రామ్ నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'జై లవ కుశ'. బాలీవుడ్, హాలీవుడ్ టెక్నీషియన్స్‌ను ఈ చిత్రానికి ఉపయోగిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో వీఎఫ్ఎక్స్‌కు ఖర్చు చేస్తున్నారు. అందుకే ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎన్టీఆర్, ప్రమోషన్ పద్ధతుల్లోనూ సరికొత్త టెక్నాలజీలను ఆశ్రయిస్తున్నారు. సోషల్ మీడియాలో ఓ కొత్త పంథాను పరిచయం చేస్తున్నాడు. సల్మాన్ ఖాన్ చేసిన 'ట్యూబ్ లైట్' సినిమా రిలీజ్ సందర్భంగా ఈ కండల వీరుడు తన ఫొటోనే ఎమోజీగా సోషల్ మీడియాలో రిలీజ్ చేసి సరికొత్త ట్రెండ్‌కు నాంది పలికాడు. తాజాగా విజయ్ తన కొత్త 'మెర్సల్' తెలుగులో 'అదిరింది' స్టిల్ ను కూడా ఎమోజీగా రిలీజ్ చేసి ఆకట్టుకున్నాడు. ఎన్టీఆర్ కూడా ఇదే బాటలో నడిచేందుకు రెడీ అవుతున్నాడు. 'జై లవ కుశ' సినిమాలోని మూడు క్యారెక్టర్లకు సంబంధించిన మూడు ఎమోట్ ఐకాన్స్(త్రీడీ స్టయిల్‌లో మూడు చిత్రాలు కన్పించేలా) ను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడు. అయితే ఇలా ప్రత్యేక ఎమోట్ ఐకాన్స్‌ను రిలీజ్ చేసేందుకు ట్విట్టర్ సంస్థను ఆశ్రయించాడని తెలిసింది. టాలీవుడ్‌లో తరహా ప్రచారాన్ని ప్రారంభించిన తొలి నటుడిగా ఎన్టీఆర్ రికార్డ్ సృష్టించబోతున్నాడు.


టెక్నాలజీతో రానా, కాజల్‌తో ఫొటో దిగిన ఓ అభిమాని

ఛాన్స్‌లన్నీ వీళ్లవే


సమంత

చిత్రసీమలో కథానాయకలు శాశ్వతం... కథానాయికలే అశాశ్వతం...వీళ్లు నిత్యం మారుతూ ఉంటారు. ఒక్కొక్కరు ఒక్క సినిమా మాత్రమే చేయొచ్చు. మరొకరు రెండు మూడు చేయొచ్చు. కానీ ఎవరో ఇద్దరు ముగ్గురు తప్ప నాలుగైదేళ్లు చిత్రసీమను ఏలిన నాయికలు ఉండరు. ఒక వేళ ఉన్నా తెలుగు నుంచి తమిళ్‌కు, తమిళ్ నుంచి మలయాళానికి వెళు తుంటారు. తెలుగులో కూడా కొత్తవాళ్లకే ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. కారణాలు ఏవైనా ఉన్న వాళ్లే విడుదలవుతున్న నాలుగైదు చిత్రాల్లోనూ కథానాయికలై ఉంటారు. అలా ఇప్పుడు తెలుగు సినిమాల్లో ఎక్కువ అవకాశాలు పొందుతోన్నది రాశీ ఖన్నా, కీర్తి సురేష్, సాయి పల్లవి, నివేదా థామస్, సమంత, లావణ్య త్రిపాఠి మాత్రమే.


రాశీ ఖన్నా

తెలుగు సినిమాల్లో మొన్నటి వరకూ రకుల్ ప్రీత్ సింగ్, రెజీనా, రాశీ ఖన్నా వంటి వారు చిత్రాలే ఎక్కువగా విడుదలయ్యేవి. ఇప్పుడు ఇందులో సమంత, రాశీ ఖన్నా తప్ప మిగిలిన వారు తమిళ్, కన్నడ, మలయాళ భాషా చిత్రాలకు ప్రాధాన్యమిస్తున్నారు. అలా అనేకంటే అక్కడ దర్శకులే వీరికి అవకాశాలు ఇస్తున్నారు అంటే బాగుంటుంది. ఇక్కడ చిత్రాల్లో చేసినా ఎక్కడో ఒకటో రెండో. రకుల్ ప్రస్తుతం తెలుగులో 'స్పైడర్' ఒక్కదాంట్లోనే చేస్తోంది. తమిళ్, హిందీ చిత్రాలతో బిజీగా ఉందీమె. రెజీనా అంతే...మిగిలిన వారి పరిస్థితి ఈ మాదిరిగానే ఉంది.

ప్రస్తుతం సమంత తెలుగు, తమిళ్ సినిమాలను ఎక్కువగా చేస్తోంది. అందరి కంటే తెలుగు సినిమాలను ఎక్కువగా అంగీకరించిందీ ఈ భామ. డిసెంబర్‌లో వివాహం పెట్టుకుని కూడా చేతినిండా చిత్రాలు పెట్టుకుంది. 'రాజుగారి గది 2', రంగస్థలం 1985', సావిత్రి బయోపిక్ 'మహానటి' సినిమాల్లో చేస్తోంది. ఇవి కాకుండా తమిళ్‌లో మరో మూడు భారీ చిత్రాల్లోనే నటిస్తోంది. ఈ కథానాయికకు తెలుగు, తమిళ్‌లో మంచి డిమాండ్ ఉందని స్పష్టమవుతోంది.

నివేదా థామస్, రాశీ ఖన్నా, లావణ్య త్రిపాఠి ఈ జాబితాలో తర్వాత స్థానంలో ఉందని చెప్పొచ్చు. 'జెంటిల్ మన్' చిత్రంతో తెలుగు చిత్రసీమలోకి ఎంట్రీ ఇచ్చింది నివేదా. మొదట్లో తనకు అవకాశాలు రాకపోయినా ఇప్పుడు బాగానే వస్తున్నాయి. ఇటీవల నానితో చేసిన 'నిన్ను కోరి' మంచి సక్సెస్‌ను అందించింది. ప్రస్తుతం 'జులియట్ లవర్ ఆఫ్ ఇడియట్', ఎన్టీఆర్ ప్రతిష్టాత్మక చిత్రం 'జై లవ కుశ'లో చేస్తోంది.

రాశీ ఖన్నా హవా ఇంకా కొనసాగుతుందనే చెప్పాలి. ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులే పడుతున్నాయి. ఈ అమ్మడు తెలుగు, తమిళ్, మలయాళంలో చిత్రాలను చేస్తోంది. కేవలం తెలుగులోనే రవితేజతో 'టచ్ చేసి చూడు', ఎన్టీఆర్‌తో 'జై లవ కుశ', ఇవి కాకుండా 'సాచి' చేస్తోంది. వీటితో పాటు మలయాళంలో ఒకటి, తమిళ్‌లో మూరో మూడు సినిమాలో నటిస్తోంది.

కీర్తి సురేష్ 'నేను శైలజ' చిత్రం రంగప్రవేశం చేసినా ఇప్పుడు 'మహానటి' వంటి ప్రతిష్టాత్మక చిత్రంలో చేస్తోంది. దీంతో పాటు పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమాలో ఈమె కథానాయిక.

సాయి పల్లవి మలయళంలో 'ప్రేమమ్' చేసి మొదటి చిత్రంలోనే ఉత్తమ నటి అవార్డును కైవశం చేసుకుంది. ఇప్పుడు తెలుగులో తన స్టయిల్‌లో వచ్చిన 'ఫిదా'కు కూడా ప్రేక్షకాదరణ లభించింది. ఈ చిత్రం మొత్తం ఈ డాక్టర్ అమ్మ పాత్ర చుట్టే తిరుగుతుండడంతో నటనకు ఆస్కారం లభించింది. తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తమిళ్‌లో 'కారు', తెలుగులో నానితో ఎంసీఏ(మిడిల్ క్లాస్ అబ్బాయి)లోనూ చేస్తోంది. నటన కంటే తన డాక్టర్ కావాలనుకున్న దానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానంటున్న ఈమె ఎన్ని సినిమాల్లో చేస్తుందో చూడాలి.

అను ఇమ్మానుయేల్‌కు కూడా భారీ ప్రాజెక్టు చిత్రాల్లో చేసే అవకాశం వచ్చింది. అల్లు అర్జున సరసన 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'లోనూ, ఎన్టీఆర్‌తో 'జై లవకుశ'లో నటిస్తోంది. ప్రస్తుతం మరో రెండు చిత్రాలు చర్చల్లో ఉన్నాయి.

లావణ్య త్రిపాఠి కూడా తెలుగు సినిమాల్లో ఎక్కువగా ఆఫర్లు లభిస్తున్నాయి. 'అందాల రాక్షసి'తో ప్రవేశించిన లావణ్యకు 'భలే భలే మగాడివోయ్' మంచి గుర్తింపునిచ్చింది ఇప్పుడు మూడు తెలుగు తెలుగు సినిమాలు చేస్తుండడం విశేషం. సాయి ధరమ్‌తో వినాయక్ దర్శకత్వంలో చేయబోయే చిత్రం, రామ్‌తో 'ఉన్నది ఒక్కటే జిందగీ', నాగచైతన్య హీరోగా చేస్తున్న 'యుద్ధం శరణం'లో లావణ్య కథానాయిక.

- కొప్పుశెట్టి దేవరాజు


కీర్తి సురేష్


అను ఇమ్మానుయేల్


నివేదా థామస్

చక్రపాణిగా ప్రకాష్ రాజ్



అలనాటి నటి సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'మహానటి'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. కీర్తి సురేశ్ టైటిల్ రోల్ పోషిస్తుంది. సమంత కీలక పాత్రలో కనిపించనున్నారు. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మొదట సావిత్రి చిత్రంలో టైటిల్ రోల్ ఎవరు చేస్తారన్న సస్పెన్స్‌కు కొన్నాళ్ల తర్వాత తెరదించారు. తర్వాత సావిత్రి చాలా మంది స్టార్స్‌తో నటించింది కదా అసలు ఈ సినిమాలో ఎంతమంది నటుల పాత్రలకు ప్రాధాన్యమిస్తున్నారన్న కూడా చర్చజరిగింది. ఇటీవల జెమిని గణేశన్ పాత్రలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అప్పటికే ఆయన చిత్రీకరణలో పాల్గొంటున్నాడు. ఈ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు.

సావిత్రి జీవితంలో అల్లూరి చక్రపాణి కూడా ముఖ్యమైన పాత్రనే పోషించారు. తెలుగు, తమిళ్ భాషా రచయిత, నిర్మాత, దర్శకుడు కూడా. ప్రధానంగా ఈయన తెలుగు సినిమాలకు ఎక్కువగా పని చేసిన వ్యక్తి. అప్పట్లో ఆసియాలోనే పెద్ద వాటిల్లో ఒకటైన విజయ ప్రొడక్షన్ వారి విజయ్ వాహిని స్టూడియోస్‌లో ఈయనొక భాగస్వామి కూడా. అంత ప్రసిద్ధ చెందిన వ్యక్తి క్యారెక్టర్‌ను ఎవరు పోషిస్తారన్నది ఇప్పటి వరకూ తెలియలేదు. చక్రపాణిగా విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ఆదివారం నుంచే ఆయన చిత్రీకరణలో పాల్గొంటున్నారట.

'టాయ్‌లెట్'కు శత కోటి

అక్షయ్ కుమార్ బాలీవుడ్ బ్యాంకర్‌గా పేర్కొంటున్నాయి విదేశీ మీడియా. దానికి కారణం ఒకటే...ఆయన చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించడమే. అదేదో మామూలుగా కాదు. రూ.10 నుంచి రూ.20 కోట్ల లోపు బడ్జెట్‌లో తీసిన చిత్రాలే వంద కోట్లు వసూలు చేస్తున్నాయి. అందుకే బాలీవుడ్ బ్యాంకర్ అయ్యారట ఈ యాక్షన్ హీరో. మొన్న విడుదలైన 'జాలీ ఎల్‌ఎల్‌బీ 2', దానికి ముందు వచ్చిన 'రుస్తోమ్', 'ఎయిర్‌లిఫ్ట్' చిత్రాలు బయ్యర్లకు వంద కోట్లకు పైనే తెచ్చిపెట్టాయి. ఇప్పుడు ఆయన చేసిన చిత్రం 'టాయ్‌లెట్ ఏక్ ప్రేమ్ కథ' కూడా వసూళ్ల విషయంలో శత కోటి దాటేసింది.





పెళ్లి చేసుకోవాలంటే వరుడు ముందు మరుగుదొడ్డి నిర్మించాలి...లేదంటే పెళ్లి రద్దే... మరుగుదొడ్డు లేదని కాపురానికి రాని భార్య...పోరాడి నిర్మించుకున్న టాయ్‌లెట్...దేశంలో వివిధ ప్రాంతాల్లో మరుగుదొడ్డు సమస్యపై వచ్చిన పోరాట వార్తలపై దర్శకుడు శ్రీనారాయణ్ సింగ్ దృష్టి పడింది. ఏంటీ విషయం అని దానిపై అధ్యాయనం చేశాడు. ఆ అన్వేషణ నుంచి వచ్చిన చిత్రమే 'టాయ్‌లెట్ ఏక్ ప్రేమ్ కథ'. ఇందులో అక్షయ్ కుమార్, భూమి పడ్నేకర్ జోడీగా నటించారు. మరుగుదొడ్లకు ప్రేమకథను జోడించి రూపొందించారు. మరుగుదొడ్డు కోసం పోరాడే మహిళగా భూమి పడ్నేకర్, ఆమె భర్తగా అక్షయ్ చేశారు. ఓ ఇంటి సమస్య...దేశ సమస్య అయింది. బహిరంగ మలవిసర్జన నిర్మూలన చేయాలన్న కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ చిత్రం కాసులు కురిపిస్తోంది. అదీ మామూలుగా కాదు. బాక్సాఫీస్ వద్ద శతకోటికి దాటేసింది. కేవలం ఎనిమిది రోజుల్లోనే ఈ కలెక్షన్లు వచ్చాయంటే ఆశ్చర్యమే. అక్షయ్ కుమార్ సినిమాల్లో వంద కోట్లు కలెక్ట్ చేసిన ఉత్తమ ఎనిమిది చిత్రాల్లో ఇది రెండో చిత్రమని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో విడుదలైన చిత్రాలన్నీ నిరాశ పరుస్తున్నాయి. షారుఖ్ నుంచి సల్మాన్ ఖాన్ వరకూ పెద్ద పెద్ద స్టార్స్ సినిమాలకే థియేటర్లలో ప్రేక్షకులు కరువయ్యారు. అటువంటి తరుణంలో సామాజిక నేపథ్యంలో తీసిని 'టాయ్‌లెట్' చిత్రం కలెక్షన్ల వర్షం కురిపించడంతో బయ్యర్లు ఖుషీగా ఉన్నారు. ఈనెల 11న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా 8 రోజుల్లో రూ.100.05 కోట్లు కలెక్షన్లు రాబట్టింది. కేవలం రూ.18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే దానికి నాలుగింతలు రాబట్టి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. మిశ్రమ సమీక్షలు వచ్చినప్పటికీ ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. రెండో వారంలోనూ నిలకడగా వసూళ్లు రాబడుతోంది.

మొదటి రోజు రూ. 13.10 కోట్లు, రెండో రోజు రూ.17.10 కోట్లు, మూడో రోజు రూ.21.25 కోట్లు, నాలుగో రోజు రూ. 12 కోట్లు, ఐదో రోజు రూ. 20 కోట్లు, ఆరో రోజు రూ.6.50 కోట్లు, ఏడో రోజు రూ. 6.10 కోట్లు, ఎనిమిదో రోజు రూ. 4 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈ విజయం కథానాయికగా చేసిన భూమి పడ్నాకర్‌కు కలసొచ్చిందనే చెప్పాలి. దాంతో పాటు దర్శకుడు నారాయణ్ సింగ్‌కు ప్లస్సే. అక్షయ్ కుమార్ గత ఏడాది నుంచి చేసిన 'ఎయిర్ లిఫ్ట్', 'రుస్తోమ్', జాలీ ఎల్ఎల్‌బీ 2...అన్నీ వంద కోట్ల క్లబ్‌లో చేరినవి కావడం విశేషం. టాయ్‌లెట్ కూడా ఆ క్లబ్ చేరిపోయింది. ఈ చిత్రానికి సీక్వెల్ కూడా తీస్తామని అక్షయ్ భార్య ట్వింకల్ ఖన్నా ప్రకటించింది.

ఎవరిపై 'దేవి' పగ?

నదియా ప్రధాన పాత్రలో రూపొందిన తమిళ చిత్రం 'తిరుక్కువరాధకాది'. సువర్ణ పిక్చర్స్ బేనర్‌పై తెలుగులో 'దేవి' పేరుతో విడుదల చేస్తున్నారు. సువర్ణ నిర్మాత. డి.తులసి దాస్ దర్శకుడు. పగ, ప్రతీకార నేపథ్యంలో హార్రర్ జోనర్‌లో ఈ సినిమా రూపొందింది. ప్రస్తుతం తెలుగులో అనువాద కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతోంది. 'దృశ్యం' తర్వాత నదియా పోలీస్ పాత్రలో నటించిన చిత్రమిది. దర్శకులు తులసీదాస్ సినిమాను ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. నదియా, కోవై సరళ, ఇనియా, ఆర్తి, సంగీత, అర్చన తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ : మనోజ్.ఆర్, సంగీతం : ఎం.జి.శ్రీకుమార్, ఎడిటర్ : కె.శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ : సంజీవ్ శంకర్.


నదియా


రామ్

అభిరామ్ గిటార్ ప్లేయర్

రామ్ హీరోగా 'నేను శైలజ' ఫేమ్ కిశోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉన్నది ఒక్కటే జిందగి'. హిట్ కాంబినేషన్ రిపీట్ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్‌ను రామ్ నిరంతరం సామాజిక మాధ్యమాల్లో పెడుతూ ఉంటాడు. ఇప్పుడు కూడా ఆ సినిమా తన పాత్రను పరిచయం చేస్తూ ఓ ఫొటోను ట్విట్టర్‌లో పోస్టు చేశాడు. ఈ చిత్రంలో ఆయన పాత్ర అభిరామ్‌ని అది తనకు ఎంతో ఇష్టమైన క్యారెక్టర్ అని కూడా పేర్కొన్నాడు. ఈ ఫొటోను బట్టి రామ్ సంగీత కళాకారుడి పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే రామ్ గిటార్ ప్లే చేస్తున్న ఫొటోనే పోస్టు చేశాడు. అయితే ఈ ఫిక్ మాత్రం స్టయిలిస్‌గా ఉంది. ఇందులో అనుపమ పరమేశ్వరన్, లావణ్య త్రిపాఠి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

రూపాయి

వాయిదా పద్ధతుల్లో వస్తువులు కొనడం అంటే చాలామందికి ప్రాణం లేచొస్తుంది. టీవి, కంప్యూటర్, వాషింగ్‌మిషన్, గ్రైండర్, చివరికి సెల్‌ఫోన్ ఇలా ఇంట్లోకి అవసరమయ్యే ప్రతి వస్తువూ ఇప్పుడు మార్కెట్లో వాయిదా పద్ధతుల ద్వారా కొనుగోలు చేసేందుకు అందుబాటులో సిద్ధంగా ఉంటున్నాయి. వ్యాపారవర్గాలూ ఖాతాదారుల్ని ఆకర్షించే క్రమంలో ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో ఖరీదైన వస్తువులు అందించేందుకు రకరకాల ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. అయితే ఇలా ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతుల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు.. అసలు ధర కంటే ఎక్కువ ధరను చెల్లించాలన్న విషయం మరచిపోకూడదు.



ఆరు నూరైనా.. వాయిదా తప్పొద్దు!

పేద, మధ్యతరగతికి చెందినవారే కాదు ధనికవర్గాలూ ఇన్‌స్టాల్‌మెంట్ అనేదానికి అలవాటుపడుతున్న రోజులివి. అయితే ఇన్‌స్టాల్‌మెంట్ లేదా వాయిదా పద్ధతులలో ఏదైనా మొదలుపెట్టే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి, లాభనష్టాలు బేరీజు వేసుకోవడం మంచిది. అందుకే ఇన్‌స్టాల్‌మెంట్ (వాయిదా చెల్లింపులు) విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? వాయిదా పద్ధతిలో వస్తువులు కొనేముందు ఏ విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి? ఎలాంటి ఆర్థిక ప్రణాళిక ఉండాలి? అనే విషయాలు నేటి 'రూపాయి' కథనంలో తెలుసుకుందాం!!



అసలు.. వడ్డీ. ఎంత?

నెలవారీగా చెల్లించే మొత్తంలో అసలుతోపాటు వడ్డీ ఎంత ఇమిడి ఉంది..? కాలపరిమితి మొత్తంగా చూస్తే, వడ్డీ రూపంలో ఎంత అధికంగా చెల్లిస్తున్నామనే విషయాలు ముందుగా తెలుసుకోవాలి. అసలు ధరతో చెల్లించే మొత్తాన్ని బేరీజు వేసుకోవాలి. వడ్డీ రూపంలో భారీగా చెల్లించాల్సి వస్తుందనిపిస్తే మాత్రం ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతికి వెళ్ళకుండా ఉంటేనే శ్రేయస్కరం.

వాయిదాలు తప్పితే..

ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతుల్లో ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు వాయిదా చెల్లించే తేదీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఉదాహరణకు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగస్తులు తమ జీతాలు దాదాపుగా ప్రతినెలా మొదటి తేదీన అందుకుంటారు. నెలనెలా చెల్లించాల్సిన వాయిదా చెల్లింపుల్ని నెలలో ఒకటి నుంచి ఐదో తేదీలోపుగా ఉండేలా చూసుకుంటే మంచిది. అలాకాకుండా నెల మధ్యలోనో, చివరిలోనో వాయిదా చెల్లింపుల తేదీ పెట్టుకుంటే ఆర్థిక సమస్యలతో వాయిదాలు తప్పే ప్రమాదం ఉంది. దీనివల్ల బ్యాంకులో చెక్‌లు బౌన్స్ అయ్యే ప్రమాదం ఉంది. చెక్ బౌన్స్ అయితే అటు బ్యాంక్‌లోనూ ఇటు వస్తువులకు ఫైనాన్స్ చేసిన కంపెనీలోనూ పర్సనల్‌గా బాడ్‌ట్రాక్ నమోదయ్యే అవకాశం ఉంది. క్రెడిట్ స్కోరూ ప్రమాదంలో పడొచ్చు. భవిష్యత్తులో సిబిల్ ఇబ్బందులు తలెత్తవచ్చు. ఒక్కసారి సిబిల్‌లో డిఫాల్టర్‌గా నమోదు అయితే.. అందులోంచి అంత సులభంగా బయటపడే అవకాశాలు ఉండవు. అందుకే నిర్ణీత తేదీకంటే ముందుగానే అకౌంట్‌లో సరిపడా డబ్బులు నిల్వ ఉండేలా జాగ్రత్త పడాలి.

వాహన రుణాల విషయంలో

ఈ రోజుల్లో వాహనాల కొనుగోళ్ళన్నీ దాదాపు వాయిదా పద్ధతుల్లోనే జరుగుతున్నాయి. నామమాత్రం సొమ్ము చెల్లిస్తే చాలు.. ఖరీదైన ద్విచక్ర వాహనం, కార్లను కొనుగోలు చేసేందుకు సులభ మార్గాలున్నాయి. అయితే అలా కొనుగోలు చేసిన వాహనాలపై అధికవడ్డీ అనేది చెల్లించక తప్పదు. రెండు, మూడు, ఐదేళ్ళ కాలపరిమితిలో.. తిరిగి చెల్లించే వాయిదా సొమ్ము మొత్తాన్నీ లెక్కకడితే అదనంగా చెల్లించాల్సింది, చెల్లించింది భారీ మొత్తంలోనే ఉంటుంది. అవన్నీ పరిశీలించి, లెక్కలు కట్టిన తర్వాతే వాహనాలు కొనుగోలు చేయడం మంచిది. నెలవారీ కంతులు చెల్లించడానికి అందుకు తగ్గ ఆర్థిక వెసులుబాటు ఉందా? లేదా? అనే విషయం ముందుగా ఆలోచించాలి. అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడే వాయిదా పద్ధతిలో వాహనం కొనుగోలు చేయడం ఉత్తమం.

చెల్లింపు తప్పితే

ఫైనాన్స్ (రుణం) ద్వారా కొనుగోలు చేసిన వాహనంపై.. ఆ రుణం మొత్తం చెల్లించేవరకూ ఫైనాన్స్ ఇచ్చిన కంపెనీయే యజమాని అవుతాడు. నెలనెలా చెల్లించాల్సిన వాయిదా సొమ్ము సకాలంలో చెల్లించకపోతే 'చెక్‌బౌన్స్'తో బ్యాంకు ట్రాక్ ప్రమాదంలో పడక తప్పదు. అలాగే రెండు మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్ పెండింగ్‌లో పడితే, ఆయా ఫైనాన్స్ కంపెనీలవారు వాహనాన్ని సీజ్ చేసే హక్కు కలిగి ఉంటారు. దీంతో అప్పటిదాకా చెల్లించిన సొమ్ము నష్టపోవడంతో పాటు, చట్టపరంగా కూడా చిక్కులు కొనితెచ్చుకునే పరిస్థితుల్నీ ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే వాయిదా పద్ధతిలో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు 'రిస్క్' అంశాల్నీ దృష్టిలో పెట్టుకుని అడుగు వేయాలి.





- వి. చైతన్య

సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్



సంప్రదాయ పొదుపు పథకాలు అంటే మొదటగా గుర్తొచ్చేవి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్లు. పెద్దగా వడ్డీ లెక్కలు తెలియకపోయినా పొదుపు చేయాలనే ఆలోచన ఉన్నవారికి ఇవి బాగా పరిచయమైనవే. ఇంచుమించు ఈ పథకాలను పోలిన మరో పొదుపు పథకమే 'సిప్'. ఇటీవల కాలంలో సిప్ పథకాల్లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య అన్ని వర్గాల్లోనూ పెరుగుతోంది. రికరింగ్, ఫిక్స్‌డ్ పథకాలకు సమాంతరంగా 'సిప్' పథకాలూ అంతే ఆదరణ పొందుతున్నాయి. అయితే సిప్‌లలో పెట్టుబడి పెట్టడం.. అంతకుతగ్గ లాభాలు పొందడం.. అంత తేలికైన విషయం కాదు. వాటిపై సరైన అవగాహన ఉండాలి. అప్పుడే సిప్‌లతో లాభసాటి అంటున్నారు ఆర్థికనిపుణులు. అసలు 'సిప్' పథకాలంటే ఏమిటి? వాటిని ఎలా ప్రారంభించాలి?

ప్రాచుర్యంలో ఉన్న పొదుపు పథకాల్లో మాత్రమే ఎక్కువమంది పెట్టుబడి పెడుతుంటారు. కొత్తగా వచ్చే పథకాలు, షేర్ ఆధారిత డిపాజిట్స్ వంటి వాటిల్లోకి తొంగి చూడాలంటే కొంతమంది భయపడతారు. కానీ, సంప్రదాయ పథకాల్లో వచ్చే వడ్డీ కంటే.. కాస్తంత మెరుగ్గా, పెట్టిన పెట్టుబడికి వచ్చే రాబడులూ వేగవంతం కావాలనే ఆలోచన చేసేవారికి కాస్తంత అనుకూలమైనవి సిప్ పథకాలని చెప్పొచ్చు. అయితే అందుకు తగ్గ అవగాహన కావాలి. ఒకవేళ నష్టం వచ్చినా భరించగలిగే శక్తి ఉండాలి.

సిప్ అంటే?


సిప్ అంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్. వీటిని ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందిస్తాయి. సిప్ పథకాలన్నీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా అసోసియేషన్ (యాంఫి) నియంత్రణలో ఉంటాయి. ఒకరకంగా చెప్పాలంటే సిప్ పథకమంటే కొంత రిస్క్ ఉంటుంది. అలాగని పెట్టే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఏమీ ఉండదు. షేర్లు, బంగారం వంటి సాధనాల్లో ఈ సిప్‌ల ద్వారా ఫండ్ సంస్థలు ఇన్వెస్ట్ చేస్తాయి.

పొదుపు చేయడం ఎలా?!

సిప్‌లలో కూడా నెలకి కొంత చొప్పున ఇన్వెస్ట్ చేయొచ్చు. ఆర్‌డీకి, వీటికి ఉన్న తేడా ఏంటంటే.. సిప్‌లలో మనం నెల నెలా కట్టే డబ్బుకి సరిపడా.. ఫండ్ సంస్థలు యూనిట్లు కేటాయిస్తాయి. ఆయా ఫండ్స్ నికర ఎస్సెట్ విలువ (ఎన్‌ఏవీ-నెట్ ఎస్సెట్ వాల్యూ) ను బట్టి మనకు లభించే యూనిట్ల సంఖ్య ఆధారపడి ఉంటుంది. ఆయా షేర్లు, బంగారం రేట్లలో హెచ్చుతగ్గులను బట్టి ఫండ్ నెట్ ఎస్సెట్ వాల్యూ సిప్ విధానంలో ఎన్‌ఏవీ తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ యూనిట్లు, అలాగే ఎన్‌ఏవీ ఎక్కువగా ఉన్నప్పుడు తక్కువ యూనిట్లు చేతికి వస్తాయి. అయితే, సిప్‌లలో నిర్దిష్టంగా ఇంత రాబడి వస్తుందని ఉండదు. కొన్ని సందర్భాల్లో లాభాలు తగ్గనూ వచ్చు.

కాలపరిమితి

జాతీయ బ్యాంకులతోపాటు కొన్ని మ్యూచ్‌వల్ ఫండ్ కంపెనీల్లో సిప్ పథకాలు ప్రారంభించవచ్చు. రోజువారీ చెల్లింపులు మొదలుకొని, వీక్లీ, నెలవారీ, మూడునెలలు, ఏడాది, మూడేళ్ళు, ఐదేళ్ళు కాలపరిమితిన చెల్లింపులు ఉంటాయి. సిప్‌లో పెట్టుబడి పెట్టిన డబ్బును ప్రధానంగా ఆయా కంపెనీలు షేర్ మార్కెట్.. బంగారం కొనుగోలు వంటి ఇతర లాభసాటి రంగాల్లో యూనిట్లుగా పెట్టుబడి పెట్టడం.. కారణంగా వాటిపై వచ్చే రాబడి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్స్ కంటే మెరుగ్గా ఉండే అవకాశం ఉంది. ఫిక్స్‌డ్, రికరింగ్ సేవింగ్స్ కంటే ఎక్కువ అంటే సాలీనా తొమ్మిది శాతం కంటే 12 నుంచి 15 శాతం వరకూ గ్యారంటీగా లాభాలు రావొచ్చు. ఒక్కొక్కసారి ఇంతకంటే ఊహించని లాభాలు పెరగొచ్చు. అలాగే షేర్‌మార్కెట్, బంగారం, డాలర్ ధరలు పడిపోతే, కనీస రాబడి ఉండక పోవచ్చు. అందుకు సిద్ధపడాలి. యూనిట్లు మెరుగ్గా ఉన్నప్పుడు లాభసాటిగా అమ్ముకోవచ్చు. ★



'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమా పథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006

చిన్నారి

పొదుపు కథ

కిందొక పలక.. పైనొక పలక.. పలకల నడుమ మెలికల పాము! ఏమిటది?

జోక్స్


అమ్మ : ఎందుకురా బబ్లూ ఏడుస్తున్నావ్ ?
బబ్లు : మరేమో.. మమ్మీ! మా క్లాస్ టీచర్ నెలరోజుల నుంచి జ్వరమని రావడంలేదు. ఇప్పుడేమో...
అమ్మ : ఏమైందో ఏడవకుండా చెప్పరా.. ఇంకా సీరియస్ అయిందా..?
బబ్లు : కాదు మమ్మీ రేపటి నుంచి టీచర్ మళ్ళీ క్లాసుకి వస్తున్నారంటా..!
అమ్మ : ఆ..!!??

ఉడుముపట్టు అంటే ?




ఉడుములు వరానిడే కుటుంబానికి చెందిన పెద్ద మాంసాహారులైన బల్లులు. వీటిలో అతిపెద్ద ఉడుము కొమొడొ డ్రాగన్. ఈ కుటుంబంలో ఉన్న ఒకే ప్రజాతి వరానస్. ఉడుము గాజులాంటి నున్నటి తలాలపై కూడా నిలువుగా పరిగెత్తగలదు. పై కప్పులకు పట్టుకుని స్థిరంగానూ ఉంటుంది. అదెలా సాధ్యమంటే వాటి పాదాల కింద ఉండే ప్రత్యేకమైన మెత్తల వల్ల. వీటిపై లక్షలాది వెంట్రుకలు, బొడిపెలు ఉంటాయి. వీటి మధ్య రాపిడి వల్ల దుర్భర స్థిర విద్యుత్ బలాలు ఉత్పన్నమై, అవి తలానికి అంటుకునిపోతాయి. ఇలా వేలాది బుడిపెలలో ఉత్పన్నమయ్యే బలం వల్ల ఉడుము గట్టి పట్టును కలిగి ఉంటుంది. నాలుగు పాదాల్లో కలిగే బలం దాదాపు 140 కిలోల బరువును కూడా లాగగలదు. అందుకే పూర్వం చెప్పేవారు శివాజీ పాలనలో.. సైనికులు ఉడుముల నడుముకు తాడు కట్టి.. వాటిని పట్టుకుని కోట గోడలు ఎక్కేవారని.. .పిల్లలూ ఇప్పుడు అర్థమైందా ఉడుంపట్టంటే! ★





గుర్తించండి !

పిల్లలూ.! పైనున్న చిత్రంలో బొమ్మ కింద ఉన్న నీడల్లో ఒక్కటి మాత్రమే సరైనది దాగుంది... అదేదో గుర్తించండి!



శిఖర్, కోహ్లీ చితక్కొట్టేశారు





శిఖర్ ధావన్ 132 నాటౌట్

తొలి వన్డే భారత్‌దే

9 వికెట్లతో శ్రీలంకపై జయభేరి

దంబుల్లా : శ్రీలంక పర్యటనలో భారత్ ఎదురులేని విజయాలతో దూసుకెళ్తోంది. ఇక్కడ దంబుల్లా వేదికగా ఆదివారం నాటి తొలి వన్డేలో విరాట్ సేన అదిరే ఆరంభంతో 9 వికెట్ల తేడాతో అలవోకగా ఘన విజయాన్ని సాధించింది. టాస్ గెలిచిన విరాట్ శ్రీలంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. భారత్ బౌలర్ల సమిష్టి రాణింపుతో శ్రీలంక 216కే కుప్పకూలింది. ఆ తర్వాత 217 లక్ష్యాన్ని కోహ్లీ (132), కోహ్లీ (82)తో అజేయంగా నిలిచి కేవలం 28.5 ఓవర్లలో 220 పరుగులతో విజయ ఢంకా మోగించారు. భారత్ జట్టులో మనీష్ పాండే, కులీదీప్ యాదవ్‌లకు తుది జట్టులోకి చోటు దక్కలేదు. ఇరుజట్ల మధ్య రెండో వన్డే పల్లెకలెలో ఈ నెల 24న జరగనుంది.

గబ్బర్ వీరవిహారం....

టెస్ట్ సిరీస్‌లో 358 పరుగులతో ఎదురులేని బ్యాట్స్‌మెన్‌గా శివమెత్తిన శిఖర్ దంబుల్లా వన్డేలో ఆకాశమే హద్దుగా చేలరేగిపోయాడు. 20 నెలలు తర్వాత ప్రపంచకప్ జట్టులో స్థానం దక్కాలంటే ఫిట్‌నెస్ నిరూపణకు ఇదే అవకాశం భావించి బౌండరీలతో కదం తొక్కి శతక్కొటాడు. అక్కడ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ సాధించగా, తొలి వన్డేలో అదిరే బ్యాటింగ్‌తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సాధించాడు. శిఖర్ . 36 బంతుల్లోనే 8 ఫోర్లు, ఓ సిక్స్‌తో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. 217 విజయ లక్ష్యంతో బరిలో దిగిన భారత్ తొలి వికెట్‌ను 23 పరుగుల వద్ద రోహిత్ 4 పరుగుల వద్ద రనౌట్ రూపంలో వెనుదిరిగాడు. ఈ క్రమంలో శిఖర్‌తో కలిసి సమన్వయంతో ఆడిన కోహ్లీ సునాయాస విజయాన్ని సాధించడంలో ప్రేరణగా నిలిచాడు. శ్రీ లంక బౌలర్లను తలో రకంగా బాదేసి చుక్కలు చూపించారు. మలింగా బౌలింగ్‌ను కోహ్లీ, శిఖర్ సమర్థవంతంగా ఎదుర్కొన్ని బౌండరీలు సిక్సర్లను సాధించడం విశేషం. కోహ్లీ, శిఖర్ సత్తా చాటడంతో భారత్ 14.3 ఓవర్లలో 100 పరుగులకు చేరుకుంది.21.5 ఓవర్లలో 150 పరుగులకు చేరుకుంది. ఈ క్రమలో ధావన్ కేవలం 71 బంతుల్లో 16 ఫోర్లు, రెండు సిక్స్‌లతో కెరీర్‌లో 11వ సెంచరీ చేశాడు. ఆ తర్వాత కోహ్లీ కూడా సరిగ్గా 50 బంతుల్లోనే(ఆరు ఫోర్లు) సాయంతో 44వ అర్ధ సెంచరీ పూర్తి చేశాడు.. ఈ క్రమంలో 26.3 ఓవర్లలో భారత్ 200 పరుగులను చేసింది. 28.5 ఓవర్‌లో డిసిల్వా వేసిన బంతిని కోహ్లీ బౌండరీకి తరలించడంతో తొలి విజయాన్ని నమోదు చేసింది. శిఖర్ ధావన్ 132 పరుగులు(90 బంతు ల్లో 20 ఫోర్లు, 3 సిక్స్), విరాట్ 82 (70 బంతుల్లో 10 ఫోర్లు,ఓ సిక్స్)తో వీరిద్దరు 197 పరుగుల భాగస్వామ్యంతో అజేయంగా నిలిచారు. దీంతో లంక బౌలర్ల ఖాతాలో ఒక్క వికెట్ చేరకపోవడం విశేషం.

అక్షర్ ఆరంభం అదుర్స్..

జడేజా స్థానంలో అనుహ్యంగా జట్టులో చేరిన అక్షర పటేల్ ఆరంభాన్ని ఘనంగా చాటుకున్నాడు. మెండీస్‌ను 36 వద్ద క్లీన్‌బౌల్డ్ చేయడంతో అప్పటి వరకు భారీ స్కోర్ దిశగా సాగిన లంక పతనాన్ని శాసించాడు. డిసిల్వాను 2 వద్ద, సందకన్‌ను 5వద్ద ఎల్‌బిగా పెవిలియన్‌కు పంపాడు.దీంతో 3/34 వికెట్లతో లంక ఇన్నింగ్స్ కుప్ప కూల్చడంలో కీలక పాత్ర పోషించాడు. బుమ్రా రెండు, జాదవ్ రెండు,చాహల్ 2 వికెట్లతో అతని అండగా నిలచారు. బుమ్రా ఫెరీరా, ఫెర్నాండోలను పరుగుల ఖాతా తెరకుండానే క్లీన్‌బౌల్డ్ చేశాడు.

ఎగిసి పడ్డ శ్రీ లంక...77కే 9 వికెట్లు...

టెస్ట్ సిరీస్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలన్న శ్రీలంక ఆశలు తొలి వన్డేలో విఫలం అయ్యాయి. బ్యాట్‌మెన్ ఎవ్వరు భారీ భాగస్వామ్యాలు నమోదు చేయలేక భారత్ బౌలర్లకు తలవంచారు. శ్రీలంక ఇన్నింగ్స్ ఎగిసిపడింది. ఓపెనర్ గుణ తిలకే 36 పరుగుల వద్ద తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ దశలో డిక్వెల్లా అర్ధ సెంచరీతో భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. అతను 74 బంతుల్లో 8 ఫోర్లతో 64 వద్ద ఔటయ్యాడు. దీంతో శ్రీలంక 139 వద్ద రెండో వికెట్‌ను కోల్పోయింది. మెండిస్ 36, కెప్టెన్ తరంగ 13 పరుగుల వద్ద ఔటయ్యారు. మ్యాథ్యూస్ ఇన్నింగ్స్ నిర్మించడానికి తన వంతు ప్రయత్నం చేసినప్పటికి మిడిల్ ఆర్డర్‌లో కపుదెగర 1, డిసిల్వా 2, ఫెరీరా, ఫెర్నాండ్ సున్నా, మలింగ 8 వద్ద ఔట్ కావడంతో శ్రీలంక పీకల లోతు కష్టాల్లో కూరుకుపోయింది. చివరకు మాథ్యూస్ 36 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చివరి 9 వికెట్లను 77 పరుగులకే కోల్పోవడం గమనార్హం.



పుణేరి ఘన విజయం

లక్నో : ప్రొ కబడ్డీ(పికెఎల్) ఐదో సీజన్‌లో భారీ పాయింట్లతో నువ్వానేనా అన్న రీతిలో సాగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ డబుల్ డిఫెండింగ్ ఛాంపియన్ పాట్నా పైరెట్స్‌పై 47-42తో ఘన విజయం సాధించింది. ఆదివారం నాడు బాబు బనారసి దాస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇరుజట్ల మ్యాచ్ అభిమానులకు జోష్ పంచింది. భారీ పాయింట్లతో ఇరుజట్ల వేగంగా ముందుకు సాగడం విశేషం. పాట్నా కెప్టెన్ ప్రదీప్ నర్వాల్ ఒంటి చేత్తో దాదాపుగా సగం పాయింట్లను జట్టు సమకూర్చినా ఇతర ఆటగాళ్లు చివరి మజిలిలో పాయింట్ల రాబట్టడంలో చేతులేత్తేశారు.

యూపిపై జైపూర్ జయభేరి

ఉత్తరప్రదేశ్,జైపూర్ జట్ల మధ్య సాగిన రెండో మ్యాచ్ తీవ్ర ఉత్కంఠ రేపింది. అనుభవంతో జైపూర్ చివరి మజిలిలో ఉత్తరప్రదేశ్‌ను అనుహ్యంగా 24-22తో ఓడించింది. మ్యాచ్ రెండు నిమిషాల్లో పూర్తి అయ్యే సమయానికి ఇరుజట్ల స్కోర్లు 19-19తో సమం అయ్యాయి. ఈ దశలో రైడ్‌కు వచ్చిన యోధ రైడర్ అనుహ్యంగా రెండు పాయింట్లను తీసుకురావడంతో 21-19తో ఆధిక్యంలోకి వెళ్లింది.

అందరి చూపు సింధు, శ్రీకాంత్‌పైనే

నేటి నుంచి ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంప్



గ్లాస్గో (స్కాట్లాండ్) : బాడ్మింటన్‌లో ప్రతిష్టాత్మకమైన ప్రపంచ ఛాంపియన్‌షిప్ సోమ వారం నుంచి వారం రోజుల పాటు క్రీడాభిమానులను కను విందు చేయనుంది. ఈ టోర్నీలో భారత్ నుంచి పటిష్టమైన టీమ్ బరిలో దిగుతోంది. టాప్-10లో ఉన్న భారత యువ షట్లర్లు పివి సింధు (నాలుగోసీడ్), శ్రీకాంత్ (8వ సీడ్)లపైనే అందరి చూపు ఉంది. ఈ సారి భారత్ నుంచి అత్యధికంగా 21 మంది షటర్లు, సింగిల్స్, డబుల్స్‌ల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ఛాంపియన్ షిప్‌లో ఇప్పటి వరకు సింధు రెండు కాంస్యాలను సాధించగా, 2015లో సైనా నెహ్వాల్ రజతంను సాధించింది. దీంతో ప్రధానంగా సింధుపైనే ఆశలు రేగుతున్నాయి. ఇటీవల కాలంలో సూపర్ సిరీస్‌ల్లో క్వార్టర్ ఫైనల్స్ వరకు చేరి కొంత ముందంజ వేస్తోంది.2013, 2014ల్లో కాంస్యాలను సాధించిన సింధు, 2016 లో చైనా ఓపెన్, ఆ తర్వాత రియో రజతం సాధించింది. సైనా నెహ్వాల్ ఇటీవల కాలంలో క్వార్టర్స్ దాటడమే గగనంగా మారింది. దీంతో సైనా నుంచి పెద్దగా ఎవ్వరు ఆశాజనకమైన ఫలితాన్ని ఆశించడం లేదు. ఈ టోర్నీలో వీరిద్దరి తొలి రౌండ్ బై లభించింది. సింధు రెండో రౌండ్‌లో కిమ్ హో (కొరియా) లేదా హోస్నీ (ఈజిప్టు)తోను, సైనా సాంబ్రనా(స్విస్), వోయటెస్క్ (ఉక్రెయిన్)తో తల పడే అవకాశం ఉంది. మరోవైపు ఈ ఏడాదిలో అనుహ్యంగా సూపర్ ఫామ్‌తో వరుసగా ఇండోనేషియా, ఆస్ట్రే లియా ఓపెన్ టైటిళ్ల సాధించి సమరోత్సాహంతో ఉన్న తెలుగు తేజం కిడాంబి శ్రీకాంత్ ప్రపంచ ఛాంప్‌లో అదే ఒరవడి దూసుకెళ్లాలన్న పట్టుదలతో ఉన్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్ సాధించిన తర్వాత నుంచి ఈ టోర్నీకి కఠోర శిక్షణ పొందాడు కూడా. దీంతో శ్రీకాంత్ పైన అందరి చూపు పడనుంది. పురుషుల విభాగంలో ప్రణీత్(15), జయరామ్‌లతో అనుహ్యంగా మెయిన్ డ్రాకు అర్హత సాధించిన సమీర్ వర్మలు ఇటీవల అడపా దడపా టోర్నీల విజయాలతో సత్తా చాటేందుకు పావులు కదుపుతున్నారు. మహిళల డబుల్స్‌లో అశ్విన్- సిక్కి, మేఘన- పూర్వీశరామ్, సంజనా సంతోష్- ఆర్తి సారా సునీల్, పురుషుల డబుల్స్‌లో మను- సుమిత్, చిరాజ్ సేన్-సాత్విక్, అర్జున్-రామచంద్రన్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్-అశ్విని, ప్రణయ్- సిక్కిరెడ్డిలు బరిలో దిగుతున్నారు.

సాక్షి, బజరంగ్ సత్తా చాటేనా?

నేటి నుంచి ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్



పారిస్ : ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్, ఆసియాన్ ఛాంప్ బజరంగ్ పూనియా ఇండియా సత్తా చాటేందుకు తమ పంచ్‌లకు పదును పెట్టారు. పారిస్‌లో సోమవారం నుంచి ప్రపంచ రెజ్లింగ్ ఛాంప్ ప్రారంభం కానుంది. మేలో జరిగిన ఆసియాన్ ఛాంప్‌లో 58 కేజీల విభాగంలో సాక్షి రజతం సాధించింది. ఇప్పుడు తాజాగా 60 కేజీల విభాగంలో పోరుకు సిద్ధమైన ఆమె పతకం సాధించాలని పట్టుదలతో ఉంది. బజరంగ్ పూనియా బుడాపెస్ట్‌లో 2013లో 60 కేజీల ఫ్రీ స్టయిల్ విభాగంలో కాంస్యం సాధించాడు. ఇప్పుడు స్వర్ణంపైనే గురి పెట్టాడు. ఫ్రీ స్టయిల్‌లో అమిత్ ధనాంకర్ (70 కేజీ), ప్రవీణ్ రాణ్రా(74), సాక్షి మాలిక్ భర్త సత్యవర్త్ కడియాన్ (97), గ్రీకు రోమన్ విధానంలో గేయేందర్ (59), యోగేష్ (71), గురుప్రీత్ సింగ్(75), హర్‌ప్రీత్ సింగ్(80), రవీంద్ర ఖత్రీ (85), హర్‌దీప్(98), నవీన్(130కేజీ)ల విభాగాల్లో బరిలో దిగుతున్నారు. మహిళ విభాగంలో వినేష్ ఫోగట్(48), షీతల్ (53), లలితా(55), పూజా దండ(58), శిల్పి (60), నవజోత్ కౌర్(69), పూజా (75), పురుషుల విభాగంలో సందీప్ తోమర్(57), దీపక్ (63) విభాగాల్లో తమ సత్తా చాటేందుకు సిద్ధం అయ్యారు.

నూతన మద్యం పాలసీని రద్దు చేయాలి

- జనావాసాల్లో మద్యం షాపుల్ని తొలగించాలి
- ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నూతన మద్యం పాలసీని ప్రభుత్వం రద్దు చేయాలని, జనావాసాల మధ్య ఉన్న షాపుల్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం విజయవాడలో జరిగిన ఐద్వా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈమేరకు తీర్మానించామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి ప్రకటనలో తెలిపారు. జనావాసాల మధ్య ఉన్న మద్యం షాపుల్ని తొలగించాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బార్ యజమానులు మహిళల పట్ల దురుసుగా వ్యవహరించడంతోపాటు పోలీసులతో కుమ్మక్కై అరెస్టులు చేసి, కేసులు పెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వమే ఆల్కహాల్ డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని, బెల్టు షాపుల్ని రద్దు చేయాలని, మద్యం అమ్మకాల విషయంలో సమయం, వయసు నిబంధనలు పాటించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ ప్రకారం డ్వాక్రా మహిళలకు లక్ష రూపాయలు రుణమాఫీ అమలు చేయాలన్నారు. మూడో విడత డ్వాక్రా రుణమాఫీకి రూ 3500 కోట్లు, వడ్డీకి రూ 2000 కోట్లు విడుదల చేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానించామని తెలిపారు.

ఉర్రూతలూగించిన 'జయహో జానపదం'

పలువురు కళాకారులకు 'కృష్ణవేణి జానపద' పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

అంతర్జాతీయ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో 'జయహో జానపదం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి సౌజన్యంతో జానపద గాయకులు డాక్టర్ దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం చూపరులను ఉర్రూతలూగించింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. భాష, యాసలు వేరైనా ప్రజల మధ్య సోదర భావానికి జానపద కళారూపాలు తోడ్పడతాయని అన్నారు. జానపద గీతాలు మనసులను రంజింపచేస్తాయని చెప్పారు. వరకట్నం, బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలు, ధూమపానం, మద్య నిషేదం లాంటి సామాజిక రుగ్మతలు, ఎయిడ్స్, గుండె జబ్బులు వంటి ఆరోగ్య సంబంధ విషయాలపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి జానపదాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వివరించారు. జనసేన పార్టీ నాయకులు పోతిన వెంకట మహేష్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ భావాన్ని పల్లెపల్లెలో లోతుగా తీసుకెళ్లింది జానపదాలేనని చెప్పారు. దీంతో తెలంగాణలో జానపద కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం నిర్వహించే హ్యాపీ సండే కార్యక్రమంలో భాగంగా హ్యాపీ జానపదం కూడా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఒంగోలుకు చెందిన నూకతోటి శరత్‌బాబు, విజయవాడ ప్రజానాట్య మండలి సీనియర్ కళాకారులు ఆర్.పిచ్చయ్య, ఖమ్మంకు చెందిన జానపద గాయకులు ఆలవాల కృపానందంలకు 'కృష్ణవేణి జానపద' పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఖ్యాశాస్త్ర నిపుణులు డాక్టర్ కోనాల వంశీకృష్ణ, గుండా వెంకటేశ్వరరావు, తటవర్తి సూర్యనారాయణ, మాసాబత్తుల శ్రీనివాసరావు, అరవ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గీతాలను ఆలపిస్తుండగా నృత్యం చేస్తున్న కళాకారులు

ప్రాంతమేదైనా భావం ఒక్కటే

ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతమేదైనా భావం ఒక్కటే అనే విధంగా జానపద కళాకారులు ఆడతాం-పాడతాం అంటూ చేసి జానపద గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. పల్లెపడుచు అందాలు, బావా మరదళ్ల సరస సంభాషణలు, గ్రామసీమల ప్రత్యేకతలను వివరిస్తూ ఉత్సాహం నింపాయి. అభ్యుదయ గీతాలు, దేశభక్తి, విప్లవం, సందేశాత్మకం వంటి అనేక రూపాల్లో జానపదాలను ఆలపించి కళాకారులు ఆనందం కలిగించారు.

జేఈఈ టాపర్‌కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

న్యూఢిల్లీ : జేఈఈ (జాయింట్ ఎంట్రన్ ఎగ్జామ్) మెయిన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కల్పిత్ వీర్వల్‌కు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఉదయ్‌పూర్‌కు చెందిన కల్పిత్ జేఈఈ మెయిన్స్‌లో 100శాతం మార్కులు సాధించాడు. 360 మార్కులకు గాను 360 మార్కులు సాధించి అందర్నీ అబ్బురపరిచాడు. ప్రస్తుతం ఇతను ముంబయి ఐఐటీలో (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాడు. జేఈఈ మెయిన్స్‌లో 100 శాతం ప్రతిభ కనపర్చినందుకు గాను 'ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్స్' విభాగంలో పురస్కారం అందజేయనున్నట్లు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కల్పిత్ మాట్లాడుతూ...'నేను మంచి మార్కులు సాధిస్తానని అనుకున్నాను కానీ.. 360కి 360 మార్కులు (100 శాతం) సాధిస్తానని ఊహించలేదు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో నాపేరు నమోదవుతుందని కలలో కూడా ఊహించలేదు' అని అన్నాడు. కల్పిత్‌కు ఈ అరుదైన గౌరవం దక్కినందుకు అతని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

గిరిజన సంక్షేమ శాఖలో నిబంధనలకు నీళ్లు

- అనుభవంలేని వారికి అందలం
- విభాగాల కేటాయింపులో అవకతవకలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా అధికారులకు విభాగాల్ని కేటాయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుభవం, అవగాహన లేని వారికి అత్యధిక ప్రాధాన్యం కలిగిన విభాగాలను కేటాయించడంపై ఆ శాఖ అధికారుల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఫీల్డ్ అనుభవం ఉన్న వారికి, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైన వారికి, కష్టపడి పనిచేస్తున్న వారికి ప్రాధాన్యతలేని విభాగాల్ని కేటాయిస్తూ అవమానానికి గురి చేస్తున్నారని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పనిచేస్తున్న వారికి తగిన ప్రోత్సాహం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఎడ్యుకేషన్, ప్లానింగ్, స్కాలర్‌షిప్స్, అడ్మినిస్ట్రేషన్ వంటి వివిధ రకాల విభాగాలున్నాయి. ఒక్కో విభాగం పర్యవేక్షణకు ఒక్కో డిడి, జెడిని నియమిస్తారు. అయితే వీటన్నింటి కంటే ఎస్టీ సబ్‌ప్లాన్ పర్యవేక్షణ అనేది ప్రాముఖ్యత ఉన్న విభాగం. నిబంధనల మేరకు సబ్‌ప్లాన్ పర్యవేక్షణ బాధ్యతల్ని సీనియర్ అధికారులకు అప్పగించాలి. కానీ దానికి భిన్నంగా డిడి స్థాయి కూడా లేని ఎపివో (అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్) స్థాయి అధికారికి డిడి స్థాయిని కల్పిస్తూ బాధ్యతలను అప్పగించడంతో పాటు, ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే కారణంతో గతంలో అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన అధికారికి జెడి స్థాయి కల్పించడం చర్చనీయాంశమవుతోంది. మైదాన ప్రాంత ఐటిడిఎకు పివోతో పాటు సబ్‌ప్లాన్ అమలు బాధ్యతలు అప్పగించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రెడిన్యూ శాఖకు చెందిన సదరు అధికారి డిప్యూటేషన్ పై గతంలో సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎసిబి అధికారులు రైడ్ చేశారు. సీనియర్ అధికారులకు కాకుండా, జూనియర్ అధికారులు, అవినీతి ఆరోపణలున్న అధికారులకు ప్రాధాన్యత కలిగిన విభాగాల బాధ్యతలను అప్పగించడాన్ని ఆ శాఖ అధికారులు తప్పుబడుతున్నారు.

గిరిజన ఉపప్రణాళిక కింద ఈ ఆర్థి సంవత్సరంలో రూ. 3528 కోట్లు కేటాయించగా, గతేడాది రూ. 3099 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో సుమారు 40 కి పైగా శాఖలతో అనుసంధానంగా గిరిజనుల కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రూపొందిస్తూ, వాటి అమలు పై దృష్టి సారించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన నిధుల్లో ఎంత వరకు ఖర్చు చేస్తున్నారు, అభివృద్ధి కార్యక్రమాలు ఎంత వరకు వచ్చాయనే అంశాలపై వివిధ శాఖల అధికారులతో తరచుగా సమావేశాలు నిర్వహిస్తూ, పర్యవేక్షించాల్సిన బాధ్యత జెడి, డిడి స్థాయి అధికారులపై ఉంటుంది. ఈ బాధ్యతల్ని అనుభవం, అవగాహన, ఆయా శాఖల్ని సమన్వయం చేయగల సామర్థ్యం గల అధికారులకు అప్పగించినప్పుడు మాత్రమే నిర్వహణ సాధ్యమవుతుందని ఆ శాఖకే చెందిన సీనియర్ అధికారులు పేర్కొంటున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న ఎస్సీ సబ్‌ప్లాన్ అమలు బాధ్యత ఆ శాఖకు చెందిన సీనియర్ జెడి నెరవేరుస్తుండగా, ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ యాక్ట్‌ను విరమించుకోవాలి

- సెప్టెంబర్ 1న మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయాలి
- యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ఇండిపెండెంట్ స్కూల్స్ యాక్ట్‌ను వెనక్కి తీసుకోవాలని యుటి ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశం రాష్ట్ర కార్యాలయంలో ఆది వారం జరిగింది. రాష్ట్రప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త చట్టం వల్ల ఉచిత విద్యకు తిలోదకాలిస్తుం దని, దీన్ని వెంటనే విరమించుకోవాలని సమా వేశం తీర్మానించింది. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఎస్‌టిఎఫ్‌ఐ పిలుపు మేరకు మహిళలు వినియోగించే నాప్‌కిన్స్‌పై వేసిన జిఎస్టీ పన్ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 31న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు బకాయిపడిన 10 నెలల పిఆర్‌సి అరియర్లు వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు అదనపు పెన్షన్ మంజూరు చేయాలని కోరింది. జులై 2018 నుంచి 11వ పిఆర్‌సి అమలు చేయాల్సి ఉన్నందున పదో పిఆర్‌సి అరియర్లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తీర్మానించింది. పదో పిఆర్‌సి సిఫార్సుల మేరకు మరికొన్ని ఉత్తర్వులు విడుదల చేయాల్సి ఉందని పేర్కొంది. సిపిఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న జరిగే మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయాలని సమావేశం తీర్మానించింది.

విభజన వల్ల సొంత రాష్ట్రానికి బదిలీ కోరుకునే వాందరినీ అనుమతించాలని కోరింది. 1984-96 మధ్య నియామకమైన స్పెషల్ టీచర్ల సర్వీస్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లివ్వాలని, 2008 డిఎస్సీ హామీ పత్రాల వారికి వేతన రక్షణ కల్పించాలని, ఎయి డెడ్ ఉపాధ్యాయుల జీతాలపై బడ్జెట్ కంట్రోల్‌ను తొలగించాలని, మున్సిపల్ పాఠశాలల్లో సమాం తర మీడియంలను కొనసాగించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ వర్తింపచేయాలని, ఏజెన్సీ ముంపు మండలాల్లో స్పెషల్ డిఎస్సీ నియామకాలు వెంటనే చేయాలని, మున్సిపల్, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులను ఉమ్మడి సర్వీస్ రూల్స్‌లో చేర్చాలని, పాఠశాలల ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, ఇటీవల బదిలీల్లో బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలని, అర్ధజీతపు సెలవు ఎన్‌క్యాష్‌మెంట్ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానం చేసింది. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి బాబురెడ్డి ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను సమావేశం ఆమోదించింది. ఫెడరేషన్ అధ్యక్షులు ఐ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు వై శ్రీనివాసులు రెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు, రాము సూర్యారావు, గౌరవాధ్యక్షులు ఎన్ నర్సింహుడు, సహాధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, కోశాధికారి సంజీవ రెడ్డి, కార్యదర్శులు కెఎస్ఎస్ ప్రసాద్, ఎస్‌కె సాబ్జీ, మహమ్మద్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68